ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం

fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

11-3-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 39 పేజీలు: 8+4 వెల: 6.50

జల్‌జీవన్ మిషన్ రెండేళ్లు పొడిగింపు 5లో

చైనా పెట్టుబడులకు కేంద్రం పచ్చజెండా



# ఇరాన్‌ను తుడిచేస్తాం

## భూతల దాడులకూ సిద్ధమైన అమెరికా

## మొజ్తబాను హెచ్చరించిన ట్రంప్

## యుఎఇలో అతిపెద్ద చమురు కేంద్రంపై ఇరాన్ దాడి

**టెహ్రాన్, జెరూసలెం, మార్చి 10:** ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికాలు చేస్తున్న దాడులు ఇపుడు క్షేత్రస్థాయికి చేరాయి. భూతల దాడులకు సిద్ధం అవుతున్నట్లు అమెరికా ఇప్పటికే ప్రకటించింది. వైమానిక దాడులతో టెహ్రాన్ వీధులన్నీ కూడా అగ్నిగుండంలా ఇప్పటికే మారిపోయాయి. మరోపక్క ఇజ్రాయెల్‌కూడా తనవంతు దాడులు ఉధృతంచేస్తోంది. యుద్ధం పదోరోజు కువైట్, దుబాయిల్లోని భారీ చమురుశుద్ధి కేంద్రాలపై ఇరాన్ దాడులుచేయడంతో ఈ రెండుదేశాల్లోను ప్రస్తుతం చమురు ఉత్పత్తిని నిలిపివేసాయి. అంతేకాకుండా ఎగుమతులపైనా ఆంక్షలు విధించారు. బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ, యుఎఇ దేశాలే టార్గెట్‌గా ఇరాన్ దాడులుచేస్తోంది. మరోపక్క సైబర్ దాడులకు కూడా దిగుతోంది. అంతేకాకుండా శతృదేశాలపైకి స్లీపర్‌సెల్స్‌ను పంపించేందుకు కసరత్తులుషురూచేసింది. ఈ సమాచారం అమెరికా, ఇజ్రాయెల్‌లకు చేరడంతో వెంటనే అప్రమత్తం అయ్యాయి. ఇపుడు ఇరాన్ భూగర్భంలో నిక్షిప్తంచేసిన అణు సంపదపైనే అమెరికా, ఇజ్రాయెల్‌లు కన్నేసాయి. ఇరాన్‌లో మిగిలి ఉన్న ఉరేనియం నిల్వలన్నింటినీ స్వాధీనం చేసుకునేందుకు భూతల దాడులకోసం ఆర్మీని రెడీ చేస్తున్నారు. >>2

# గల్ఫ్ నీడలు పడనివ్వొద్దు

## యుద్ధ ప్రభావం తగ్గించేలా చర్యలు

## ప్రవాసాంధ్రుల క్షేమ సమాచారాలపై ఆరా

## ఉగాదికి 2.50 లక్షల సామూహిక గృహ ప్రవేశాలు

## రియల్‌టైమ్ గవర్నెన్స్‌పై సిఎం చంద్రబాబు సమీక్ష




మంగళవారం ఆర్టీజీఎస్‌లో రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ , మార్చి 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఇరాన్ యుద్ధ ప్రభావంపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తగిన నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గల్ఫ్ దేశాలతో ఉన్న అన్ని అం శాలూ ప్రభావితం అయ్యే అవకాశం ఉంటుందని వాటి వల్ల సంక్షోభం తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మంగళవారం వివిధఅంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్పీజీ, గుడ్లు, అరటి వంటి వాటి ఎలాంటి ప్రభావం ఉందోననే అంశంపై నిరంతరం పరిశీలించాలని సీఎం సూచించారు. యుద్ధ ప్రభావిత దేశాలతో పాటు ఇతర ప్రాంతాల్లో తెలుగు వారు ఉన్న చోట పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. విదేశాంగ వ్యవహారాల శాఖతో సంప్రదించి ప్రవాసాంధ్రుల క్షేమంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంతో పాటు ఉన్నతాధికారులు ఓ బృందంగా ఏర్పడి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. అంతకు ముందు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థలు అందిస్తున్న పౌర సేవలు, విద్యుత్ సరఫరా, పాఠశాల, ఉన్నత విద్య, ఇసుక సరఫరా లాంటి అంశాలపై ముఖ్యమంత్రి >>2

## రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్

### సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుపై దృష్టిసారించండి

### సిఆర్‌డిఎ సమావేశంలో సిఎం

**విజయవాడ,మార్చి10,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా భావితరాలకు అందించేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజధానిలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధానిలోని వివిధ సంస్థలకు >>2

# ఇక ప్రత్యేక అధికారుల పాలన

## 11 నగర పాలక, 75 పురపాలక సంఘాలలో అమలు

**విజయవాడ,మార్చి10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 11 నగర పాలక సంస్థలు 75 పురపాలక సంఘాల్లో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారు. మంగళవారం నుంచి 6 నెలల పాటు లేదా ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యే వరకు ప్రత్యేక అధికారుల పాలన ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే స్పెషల్ ఆఫీసర్ పాలన అమల్లో ఉన్న కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కు మరో 6నెలలు పొడిగించింది. కాకినాడకు ఈనెల 16 నుంచి పొడిగింపు వర్తిస్తుంది. ప్రత్యేక అధికారుల పాలనపై పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని 86స్థానిక సంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలన విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీ, నగర >>2

## గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ

**విజయవాడ.మార్చి10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జనాభా (10 వేలకు పైగా/310 వేలు), వార్షిక ఆదాయం (రూ. కోటి పైన/30 లక్షలకోటి) ప్రాతిపదికన పంచాయతీలను రూర్బన్, గ్రేడ్1, గ్రేడ్2, గ్రేడ్3గా నాలుగు రకాలుగా వర్గీకరించారు. ఇందుకు సంబంధించి కీలక అంశాలు గమనిస్తే రూర్బన్ పంచాయతీలు(359. 10,000 పైబడి జనాభా, రూ. కోటి కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవి. గిరిజన ప్రాంతాల్లో 5,000 పైబడి జనాభా ఉంటే చాలు. గ్రేడ్ 1 పంచాయతీలు(3,082): 3,000 10,000 జనాభా, రూ. 30 లక్షల రూ. కోటి ఆదాయం, మండల ప్రధాన కేంద్రాలు ఉంటాయి. మిగిలిన గ్రామాలను జనాభా (2,000 కంటే తక్కువ/1,500 కంటే తక్కువ) బట్టి గ్రేడ్2, గ్రేడ్3గా వర్గీకరించారు. పాలనా మార్పులు గమనిస్తే రూర్బన్‌పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీఓ క్యాడర్ అధికారులను (ఎల్ఆర్ఎస్) నియమిస్తారు. 359 గ్రేడ్। పోస్టులను రూర్బన్ శిదీవీగా, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను సీనియర్ అసిస్టెంట్లుగా అప్గ్రేడ్ చేశారు. **క్లస్టర్ వ్యవస్థ రద్దు:**7,244 క్లస్టర్లను రద్దు చేసి, 13,351 గ్రామ పంచా యతీలను స్వతంత్ర పరిపాలనా విభాగాలుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆదాయ పంపకాన్ని >>2

# రాష్ట్రమంతా ఎసిబి సోదాలు

## పట్టణ ప్రణాళిక విభాగంపై అవినీతి ఆరోపణలు

## 13 మునిసిపల్ కార్యాలయాల్లో తనిఖీలు

## ఫైళ్లు మాయం చేసేందుకు సిబ్బంది యత్నం

## బిల్డింగ్ ప్లాన్లను క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు



మంగళవారం గుంటూరు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో తనిఖీ లు చేస్తున్న ఏసీబీ అధికారులు

**విజయవాడ/గుంటూరు కార్పొరేషన్ మార్చి10,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణ ప్రణాళిక విభాగంలో జరుగుతున్న అవినీతిపై అనేక ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఏపీవ్యాప్తంగా 13 మున్సిపల్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు విస్తృతంగా ఏసీబీ ప్రత్యేక బృందాలు తనిఖీలను చేపట్టాయి. ఇందుకు సంబంధించి టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకు విస్తృతంగా ఏసీబీ ప్రత్యేక బృందాలు తనిఖీలను చేపట్టాయి. విజయవాడ నగరపాలక సంస్థలో అవినీతి ఆరోపణలు, అక్రమ లావాదేవీల ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ సోదాలు నిర్వహించారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, మరియు ఇంజనీరింగ్ విభాగాలపై దృష్టి సారించినట్లు సమాచారం. గత కొన్ని నెలలుగా ఆమోదం పొందిన బిల్డింగ్ ప్లాన్లు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, అక్రమ కట్టడాలకు సంబంధించిన నోటీసుల ఫైళ్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కార్యాలయంలోని కంప్యూటర్లు, ఆన్‌లైన్ దరఖాస్తుల డేటాను ఏసీబీ బృందం తనిఖీ చేస్తోంది. ప్రస్తుతం ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. సోదాలు ముగిసిన అధికారికంగా ఏసీబీ వివరాలు వెల్లడించనుంది. గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు సోదాలు నిర్వహిస్తున్నట్లు ఏసీబీ ఏఎస్పీ మహీంద్ర మాత్రే తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతిపై అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కీలకపత్రాలు, రికార్డులు పరిశీలించాల్సిన నేపథ్యంలో రెండు రోజుల పాటు ఈ సోదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు కొనసాగిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని పలు ఫైళ్లను పరిశీలిస్తున్నారు. >>2

## విశాఖకు తీపి కబురు

### ఆరేళ్ల తర్వాత తిరిగి ఐబిఎం రాక

**విజయవాడ,మార్చి 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖపట్నానికి టెక్ కంపెనీలు క్యూ కడుతున్నాయని రాష్ట్ర ఐటి శాఖ ఉన్నతాధికారులు సమాచారం. విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు పలు ఐటీ సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఐటీ దిగ్గజాలు ఐబీఎం, క్యాప్‌జెమిని సైతం విశాఖ వైపు దృష్టి సారించాయి. ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆరేళ్ల తర్వాత విశాఖపట్నానికి తిరిగి వస్తోంది. ఐబీఎం సంస్థ ఇటీవల సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ)లో నమోదు చేసుకుంది. మరోవైపు క్యాప్‌జెమిని సంస్థ విశాఖపట్నంలో శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేస్తోంది. మార్చి 12వ తేదీన ఏపీ ఐటీ మంత్రి నారాలోకేష్, క్యాప్‌జెమిని సీనియర్ అధికారుల మధ్య సమావేశం జరగనుంది. >>2

## సర్పంచ్ ఎన్నికల జాబితా గడువు పెంపు

**విజయవాడ,మార్చి 10,ప్రభాతవార్తప్రతినిధి:** సర్పంచ్ ఎన్నికల నిర్వహణ కోసం గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా రూపకల్పన గడువును రాష్ట్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఫిబ్రవరి 7న ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం మంగళవారంతో గడువు ముగిసింది. తాజా ఎన్నికల సంఘం జాబితా రూపకల్పనకు ఈ నెల 18 వరకు అవకాశం కల్పించింది. రాష్ట్రంలో సర్పంచ్ల పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. అయితే బీసీలకు 34 రిజర్వేషన్ల కోసం నియమించిన ఏక సభ్య కమిషన్ నివేదిక రావడానికి 3 నెలలు పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాతే ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో పంచాయతీలకు ఇన్‌చార్జిలను నియమించే అవకాశం ఉంది.

# కరెంటు కోతలేని వేసవి

## 'హీట్ వేవ్ యాక్షన్‌ప్లాన్' విడుదల చేసిన హోంమంత్రి అనిత

## భారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు




మంగళవారం హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026 రిలీజ్ చేస్తున్న హోంమంత్రి అనిత

**విజయవాడ,మార్చి 10,ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిలో కరెంటు కోతలు అస్సలు ఉండకూడదని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి పథకాలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు తాగునీటి కష్టాలు రాకుండా చూడాలన్నారు. నిరంతరాయంగా మంచినీటి సరఫరా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆమె ఆదేశించారు. ఏపీ రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో జిల్లా కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్లు, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో. ఎండలో ప్రయాణించే పాదచారుల కోసం రహదారుల వెంట తాత్కాలిక చలువ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎండలు తీవ్రంగా ఉన్నాయి.. రానున్న రోజుల్లో వడగాల్పుల తీవ్రత మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమైంది. ఎండ తీవ్రత, వడగాల్పుల నుంచి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మంగళవారం ఏపీ రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీ ఎస్‌డీఎంఏ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో జిల్లా కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్లు, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్నారు. కూరగాయల మార్కెట్లు, బస్టాండ్లు, ప్రధాన కూడళ్ల వంటి జనసమర్ధ ప్రాంతాల్లో తప్పనిసరిగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ >>2



## చమురు మంటలు!

### భారత్‌పై గల్ఫ్ పరిణామాల ప్రభావం

### గ్యాస్ సంక్షోభనివారణకు 'ఎస్మా' ప్రయోగం

### ఉత్పత్తి పెంచాలని చమురు సంస్థలకు కేంద్రం ఆదేశం

### హోటళ్లకు సిలిండర్ల సరఫరాలో బ్రేక్

**న్యూఢిల్లీ, మార్చి 10:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులతో చమురు, గ్యాస్ నిల్వలకు భారత్‌లో కొరత ఎదురవుతోంది. ఇప్పటికే వాణిజ్యసిలిండర్ల సరఫరాకొరతతో హోటళ్లు పాక్షికంగా మూతపడుతున్నాయి. హార్ముజ్ జలసంధిని ఇరాన్‌మూసివేయడంతో ఆ ఎఫెక్ట్ భారత్‌పై కూడా పడింది. భారత్‌నౌకలకు ఇబ్బందుల్లేవని ఇరాన్ చెప్పినా దేశంలో చమురు, గ్యాస్‌లకు కృత్రిమ కొరత ఏర్పడిందన్నది వాస్తవం. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న వంటగ్యాస్ గృహావసరాల వినియోగదారులే 33 కోట్లమందికిపైగా ఉన్నారు. వీరందరికీ సకాలంలో అందచేసేందుకువీలుగా బుకింగ్‌సమయాన్ని ప్రస్తుతం ఉన్న 21 నుంచి 25 రోజులకు పెంచేసింది. అలాగే ప్రత్యామ్నాయంగా రష్యాతోపాటే ఇతర దేశాలనుంచి దిగుమతికి సన్నాహాలుచేయడంతోపాటు దేశీయ చమురు కంపెనీలను పదిశాతం ఉత్పత్తిని పెంచాలని ఆదేశించింది. ప్రస్తుతం చమురునిల్వలు 5.33 మిలియన్ టన్నులవరకూ ఉంది. ఈ రిజర్వులు 80శాతంఅవసరాలకు సరిపోతాయన్నది అంచనా. ఇక ఎల్‌పిజి దిగుమతులు పశ్చిమాసియానుంచి నిలిచిపోవడంతో ఇతర ప్రత్యామ్నాయాలవైపు దృష్టిపెట్టింది. ఇపుడు రష్యానుంచి చమురు కొంటున్న భారత్ సుమారు 40 దేశాలనుంచి కూడా కొనుగోలుచేస్తోంది. ప్రస్తుతం నాలుగువేలక ఓట్ల లీటర్ల ముడిచమురు నిల్వలున్నాయి. వీటినిశుద్ధిచేసి సిద్ధంచేస్తోంది. ఏడెనిమిది వారాలు సరఫరాకు సరిపోతుంది. ఎల్పీజీ ఉత్పత్తిని అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశాలు జారీచేసింది. పారిశ్రామిక అవసరాలకు తగ్గించింది. టీప్లాంటేషన్లు, ఉత్పత్తిరంగ యూనిట్లు ఇతర పారిశ్రామిక వినియోగదారులను మూడో కేటగిరిలో ఉంచింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశీయంగా పెట్రోల్, డీజెల్ కొరత సమస్య తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. >>2



మంత్రి స్వామి

## టెన్త్ విద్యార్థులకు మంత్రి సూచనలు

**విజయవాడ, మార్చి 10, ప్రభాతవార్త :** పదవ తరగతి విద్యార్థులకు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పలు సూచనలు ఇచ్చారు. మంగళవారం అమరావతిలోని కార్యాలయం నుండి అంబేద్కర్ గురుకులాలు, సాంఘీక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ పదవతరగతి పబ్లిక్ పరిక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో మంత్రి >>2

# గల్ఫ్ నీడలు పడనివ్వొద్దు

>> అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత ఏడాదిలో విద్యుత్ వినియోగం గరిష్టంగా 14,013 మెగా వాట్లకు చేరుకుందని అధికారులు వివరించారు. విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎనర్జీ ఆడిట్ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి డిస్కంలను ఆదేశించారు. ఈ విషయంలో వినియోగదారులకు పూర్తి సమాచారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిస్కంలకు సూచించారు. అటు పాఠశాల, కళాశాల విద్యకు సంబంధించిన అంశాల్లో సిలబస్, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రమైన తరగతి గదులు వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తృణ ధాన్యాలతో చిక్కీ లాంటి పౌష్టికాహారం అం దించే అంశాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉగాది రోజున 2.50 లక్షల మంది లబ్దిదారుల సామూహిక నూతన గృహ ప్రవేశ కార్యక్రమం చేపడుతున్నామని, వారికి ప్రభుత్వం తరపు నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు అందించేలా అధికారిక లేఖ వెళ్లేలా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఇసుక సరఫరా జరగాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సీఎం సూచించారు. ఇటీవల ఢిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ ఇండియా సమ్మిట్లో కుదుర్చుకున్న ఒప్పందాలు సాకారం అయ్యేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు భారత్ జెన్, నెక్స్ జెన్, ఐబీఎం లాంటి సంస్థలు ముందుకు వచ్చాయని వచ్చే విద్యా సంవత్సరం నుంచే కోర్సులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలని సీఎం అన్నారు. అటు కాలిబో సంస్థ ఏర్పాటు చేయదలచిన ఏఐ శాండ్ బాక్స్ వచ్చే నాలుగు నెలల్లో స్టార్టప్ ల కోసం అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఎన్విడియా సంస్థ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో భాగసామ్యం వహించేలా చూడాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ రైతుకూ సహకారం అందించేలా ఏఐ ఆగ్రానమిస్ట్, విద్యా బోధనకు సహకారం అందించేలా ఏఐ ట్యూటర్, ప్రాథమికంగా వైద్య సలహాలు అందించేలా ఏఐ డాక్టర్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పేషెంట్ ప్రిస్క్రిప్షన్ కూడా యాప్ ద్వారా వచ్చేలా చూడాలన్నారు. సీసీ టీవీ యాప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 14 వేల సీసీ కెమెరాలను అనుసంధానించి నేర నియంత్రణ చేపట్టేలా చూడాలన్నారు. నేరస్థులను గుర్తించి నేరాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీని త్వరితగతిన అందుబాటులోకి తేవటంతో పాటు డ్రోన్ ఫ్లైయింగ్ ట్రాక్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రిమోట్ పైలట్ ట్రైనింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సహకారంతో అత్యుత్తమ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏటీసీ తరహాలోనే డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థను కూడా రూపొందించాలన్నారు. వాట్సప్ గవర్నెన్స్ వినియోగం మరింత పెంచేలా పౌరులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయిప్రసాద్, ఐటీ, ఆర్టీజీఎస్, గనులు, విద్య, ఆర్థిక, ప్రణాళిక శాఖల అధికారులు హాజరయ్యారు.



మంగళవారం సిఆర్‌డిఎ సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న సిఎం చంద్రబాబు

# రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్

>> జరపాల్సిన భూ కేటాయింపులు, సెక్రటేరియేట్, హెచ్వోడీ భవనాల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. సీఆర్డీఏ నుంచి వచ్చిన వివిధ ప్రతిపాదనలను సీఆర్డీఏ అథార్టీ సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ. రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి. మొత్తంగా 167 ఎకరాల విస్తీర్ణంలో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు సిద్దం చేయడంతో పాటు తెలుగు వైభవాన్ని చాటేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి. ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్ తదితర విభాగాలు వస్తాయి. పర్యాటకంతో పాటు నిత్యం రకరకాల కార్యక్రమాలు నిర్వహించుకునే వాతావరణం ఉండేలా చూడాలి. హోటళ్లను ఏర్పాటు చేయాలి... అమ్యూజ్మెంట్ పార్కులను అభివృద్ధి చేయాలి. అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా ఆ ప్రాంతాన్ని డిజైన్ చేయాలి. నీరుకొండలో చేపట్టే బోయే ప్రాజెక్టును అత్యంత సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలి. భవిష్యత్తులో క్రీడా రంగం అతి పెద్ద ఆదాయ వనరు కాబోతోంది. దీనికి బీసీసీఐ, ఐసీసీ సంస్థలే అతి పెద్ద ఉదాహరణ. ఒకప్పుడు నిధుల కోసం ఎదురు చూసే పరిస్థితి నుంచి ఇప్పుడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా క్రికెట్ బోర్డులు ఎదిగాయి. ఇదే విధంగా మరికొన్ని క్రీడలు కూడా కమర్షియలుగా టర్న్ అవుతాయి. ఇలాంటి వాటిని అందిపుచ్చుకోవాలి. అమరావతిలోని స్పోర్ట్స్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఇదే విధంగా రూపొందించాం. అమరావతిలోకి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను తీసుకురావాలి. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇలాంటి వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు చింతిస్తున్నాయి. ఈసారి అమరావతిలో అలాంటి అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న క్రెడిబులిటీ. ఈ బ్రాండ్ మరింతగా పెరగాలి. అందుకే పెట్టుబడులు పెట్టే వారిని రెగ్యులరుగా ఫాలో అప్ చేస్తూనే ఉండాలి. ఓవైపు రాజధానిలో పనులను త్వరితగతిన చేపట్టేలా పర్యవేక్షణ చేస్తూనే.. పెట్టుబడులు పెట్టే సంస్థలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. అమరావతిలో నిర్మించబోతున్న తెలుగు కల్చరల్ సెంటర్ కు మంచి పేరును పరిశీలించండి. రాజధానిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయండి. ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఓ పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మించాల్సిన అవసరం ఉంది"అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు. ఇక 59వ సీఆర్డీఏ అథార్టీ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ కార్యాలయ నిర్మాణానికి 80 సెంట్ల భూమి కేటాయింపు. పరిహారంగా తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు కేటాయింపు, పంచాయితీరాజ్ విభాగంలోని ఏపీఎస్ఐఆర్డీకి 5 ఎకరాల కేటాయింపు, ఏపీ సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణంలో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2316 కోట్లకు పరిపాలనా అనుమతులు. రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది.



## స్పీకర్ ఓంబిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చ షురూ

## ప్రత్యేక సభాపతిగా సీనియర్ ఎంపి జగదాంబికా పాల్

**న్యూఢిల్లీ, మార్చి 10:** లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా పై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చను మంగళవారం లోక్‌సభలో ప్రారంభించారు. కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. అనంతరం తీర్మానంపై చర్చ మొదలైంది. ఇందుకోసం 10 గంటల సమయం కేటాయించారు. చర్చ తర్వాత తీర్మానంపై ఓటింగ్ నిర్వహించాలనినిర్ణయించారు. ఈ తీర్మానంపై చర్చ సందర్భంగా సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు కోరాయి. అందుకు అంగీకరించిన కేంద్రం సీనియర్ ఎంపీ, ఛైర్‌పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను స్పెషల్ స్పీకర్‌గా నియమించింది. ఆయన నేతృత్వంలో అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో చర్చ కొనసాగుతోంది. కాగా తనపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం ప్రక్రియమొత్తం ముగిసేంతవరకూ తాను స్పీకర్‌గా హాజరుకాలేనని కోటా ఎంపి ఓంబిర్లా ఇప్పటికే స్పష్టంచేసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికీ డిప్యూటీ స్పీకర్ లేకపోవడంతో ఇపుడు ప్రత్యేక సభాపతిని ఏర్పాటుచేయాల్సి వచ్చింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బిజెపి ఎంపి నిషికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం లాంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చాయి. ఇందుకోసం 118 మంది ఎంపీల సంతకాలు సేకరించినట్లు తెలుస్తోంది. చర్చ అనంతరం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ తీర్మానం ఆమోదం పొందాలంటే సాధారణ మెజారిటీ అయిన 272 ఓట్లు కావాలి. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు 293 ఓట్ల సంఖ్యాబలం ఉంది. ప్రతిపక్షాలకు 238 మంది ఎంపీలుఉన్నారు. దాంతో విపక్షాలు తీర్మానం నెగ్గే అవకాశాలు దాదాపు కనిపించడంలేదు.

# రాష్ట్రమంతా ఎసిబి సోదాలు

>>వారికి వచ్చిన సమాచారం మేరకు అనిశా అధికారులు కార్యాలయం గదులు మూసి సిబ్బందిని బయటకు పోనివ్వకుండా పరిశీలన చేస్తున్నారు. భవన నిర్మాణాలలో అవినీతి ఆరోపణలు ఎదురకొంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులుపై కొందరు గొప్యంగా సమాచారం ఇచ్చారు. లంచాలు తీసుకుని అనుమతులు ఇస్తున్నారని ఫిర్యాదులు వెళ్లాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలోని అధికారులను బయటకు కదలనివ్వకుండా రికార్డులు పరిశీలిస్తున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలుసుకొని టీపీఓ కార్యాలయ సిబ్బంది తమ వద్ద ఉన్న అదనపు డబ్బును కిటికీలనుంచి బయటకు విసిరివేసారు. ఇది గమనించిన ఏసీబీ అధికారులు ఆ నగదును సీజ్ చేశారు. టీపీఓ బాబూరావు, తన సిబ్బందిని తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలిస్తున్నారు. ఏసీబీ సీఐలు రమేశ్ బాబు, సురేశ్ బాబులు ఆధ్వర్యంలో ఈ తనిఖీలను నిర్వహించారు.

**యేడాదిన్నరగా నిద్ర పోయారా.. ఇప్పుడే మేల్కొన్నారా?:** గుంటూరు కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై కన్నెత్తైనా చూడని అవినీతి నిరోధక శాఖ శాఖా అధికారులు ఏడాదిన్నర కాలంగా నిద్రపోయారా? అని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాదిన్నర కాలంలో నాన్ క్యాడర్ ఐఏఎస్ పరిపాలనలో అంతులేని అవినీతి అక్రమాలు జరిగాయని, నిబంధనలను పాటించిన ఓసి రిలీజ్ విషయంలో లక్షలాది రూపాయలు లంచాల రూపంలో పుచ్చుకున్నారనే ఆరోపణలు భారీగా వచ్చాయి. ఒక టౌన్ ప్లానింగ్ విభాగం మాత్రమే కాకుండా రెవిన్యూ, శానిటేషన్, జిఎంసి ఆర్టికల్చర్, ఇంజనీరింగ్ విభాగం వంటి కీలకమైన విభాగాల నుంచి విచ్చలవిడిగా లక్షలాది రూపాయలు అక్రమార్గంలో జేబులు నింపుకున్నారని ఆరోపణలు, భారీ ఎత్తున లంచాల వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకపోతే ఇప్పుడు అనధికారిక కట్టడాలు భారీ ఎత్తున జరుగుతున్న అధికారులు నిద్రమత్తు వినడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపద్యంలోని బిపిఎస్, ఎల్ఆర్ఎస్ రెగ్యులర్ కాసుల పంట కురిపించేలా అధికారులు పనులు చక్కబెడుతున్నట్టు నమస్తే రక్తం అవుతున్నాయి. ఏడాదిన్నర కాలంగా నిద్ర పోయారా ..! ఇప్పుడే మేల్కొన్నారా...? అదే విమర్శలు నగర ప్రజల నుంచి భారీగా వినిపిస్తున్నాయి.

# కరెంటు కోతలేని వేసవి

>> యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, స్థానిక కమ్యూనిటీ గ్రూపుల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని చెప్పారు. వారి సాయంతో కూడళ్ల వద్ద ఉచితంగా మంచినీరు, మజ్జిగ పంపిణీ చేసేలా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. మనుషులతో పాటు మూగజీవాలను కూడా ఎండల నుంచి కాపాడుకోవాలని, పశువులు, జంతువులు వడదెబ్బకు గురి కాకుండా పశుసంవర్ధక శాఖ తగిన జాగ్రత్తలు, సూచనలు జారీ చేయాలన్నారు. గ్రామాల్లో పశువుల తొట్లు నిర్మించి నీరు నింపాలని సూచనలు చేశారు. రాష్ట్రంలో ఎండలు మండిపోబోతున్నాయి. రానున్న రోజుల్లో వడగాల్పుల తీవ్రత మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే అప్రమత్తమైంది. ఎండ తీవ్రత, వడగాల్పుల నుంచి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టింది. సమావేశంలో ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వాతావరణ పరిస్థితులపై కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎండల తీవ్రత విపరీతంగా ఉండబోతోందని ఆయన హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో సాధారణం కంటే చాలా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రానున్న కొద్ది రోజుల్లో వడగాల్పులు విపరీతంగా ఉంటాయని తెలిపారు. దీంతో అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండి తీరాలని మంత్రి అనిత సూచించారు. వేసవి సెలవుల్లో పిల్లలు చెరువులు, నీటి కుంటలు వద్ద ఆడుకునే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నందున అటువంటి చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫైర్ డిపార్టుమెంటు తప్పని సరిగా హాస్పిటల్స్, హోటళ్లు, ప్రవేటు బిల్డింగ్స్ లో వైరింగ్, ఇతర ఫైర్ సేఫ్టీ వంటివి తనిఖీ చేయాలన్నారు. కలెక్టర్లు ఎండ తీవ్రత జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని అలాగే ఎండ తీవ్రత సమాచారం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 నెంబర్లు ప్రచారం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కీలక అడుగు వేసింది. ప్రస్తుత వేసవిని ఎదుర్కొనేందుకు రూపొందించిన ఖీహీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ 2026ను మంత్రి అనిత ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అధికారులంతా ఈ ఖీస్టేట్ హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ మార్గదర్శకాలతోనే ముందుకు వెళ్లాలని ఆమె స్పష్టం చేశారు. ఎండల వల్ల ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదని, జీరో క్యాజువాలిటీస్ లక్ష యంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఇరాన్‌ను తుడిచేస్తాం

>> అదేవిధంగా అమెరికాను విభేదిస్తున్నా దేశాల్లోని యుఎస్ దౌత్యకార్యాలయాలవద్ద బాంబుపేలుళ్లు చోటుచేసుకుంటున్నాయి. టొరంటోలోని యుఎస్ కార్యాలయం వద్ద పేలుడు జరిగితే ముందురోజు ఓస్లోలోని యుఎస్ కాన్సులేట్‌వద్ద పేలుడు సంభవించింది. ఇదిలా ఉంటే యుఎఇలోని అతిపెద్ద రువైస్ ఆయిల్ రిఫైనరీపై ఇరాన్‌డ్రోన్లసాయంతో దాడులుచేసింది.

యుద్ధవ్యయంతో దాడులు ముగించాలని ఒత్తిళ్లు ఇదిలా ఉంటే యుద్ధవ్యయం రెండురోజులకే ఐదు లక్షలకోట్లు దాటడంతో ఇక ఆయుధ సంపద పూర్తిగా క్షీణిస్తుందని అందువల్ల యుద్ధ విరమణ మంచిదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే ట్రంప్ వార్‌ను ముగింపు దశకు చేరిందని, తామేముగిస్తామని ప్రకటించడంతో ఇరాన్‌కూడా ధీటుగా బదులిచ్చింది. ఆయనెవరు ముగించేందుకు మేమే ఆపనిచేస్తామని ఇరాన్ రక్షణ మంత్రిత్వశాఖ స్పందించింది. మొత్తంగాచూస్తే ఇరాన్ చౌకబారు డ్రోన్లను కూల్చేందుకు కూడా ఖరీదైన క్షిపణులను వినియోగించాల్సి రావడంతో ఆయుధ సంపద కరిగిపోవడంతోపాటు రాజకీయంగా ట్రంప్‌పై నిరసన పెరుగుతున్నందున ఎన్నికల నష్టం ఛాన్స్ ఉందని యుద్ధం వెంటనే విరమించాలని సలహాదారులు పట్టుబడుతున్నారు. అయితే ట్రంప్ మాత్రంయుద్ధం కొనసాగింపుపైనే ఉన్నారు. ఇజ్రాయెల్‌తో చర్చించి కానీ నిర్ణయం తీసుకోబోమని ట్రూత్ సోషల్‌మీడియాలోపోస్టు పెట్టారు. అలాగే ఐదువేల లక్ష్యాలను ఛేదించామని, నౌకలన్నింటినీ ధ్వంసంచేసామని ట్రంప్‌ప్రకటించారు. మరోపక్క శతృవును పూర్తిగా దెబ్బతీసేందవరకూ విశ్రమించమని, గతంలో ఎన్నడూలేనంతగా ఇకపై భూతల దాడులు ఉంటాయని రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ హెచ్చరించారు.

### మొజ్తబా నియామకంపై ట్రంప్ కన్నెర్ర

ఇదిలా ఉంటే సుప్రీం లీడర్‌గా దివంగతఖమైనీ కుమారుడు మొజ్తబా ఖమైనీ నియామకంపై ట్రంప్‌ఫైర్ అయ్యారు. ఆయన నియామకాన్ని అంగీకరించబోమని తమ ప్రమేయంలేకుండా నియామకం జరగకూడదని చెపుతూనే ప్రస్తుత సుప్రీం కమాండర్ ఎవరైనా సరే మానుంచి కఠిన కార్యాచరణ ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. అలాగే హార్మోజ్ జలసంధిని కూడా స్వాధీనంచేసుకుంటామని, అవసరమైతే సైనిక చర్యతో రవాణాను పునరుద్ధరిస్తామని ట్రంప్‌ప్రకటించడం ఇరాన్‌కు మరింత ఆగ్రహం కలిగించింది.

**ఇరాన్ మరోసారి స్ట్రాంగ్ వార్నింగ్..**

రోజుకోసారి తమపై విరుచుకుపడుతున్న అమెరికా అద్యక్షుడికి ఇరాన్‌కూడా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. మొజ్తబాను హెచ్చరించడంపై ఖమైనీ సలహాసంఘంలోని ప్రతినిధి ట్రంప్‌ను నిర్మూలించేందుకు ఇరాన్ కృతనిశ్చయంతో ఉందని తమ నేత మొజ్తబాకు ప్రాణహాని తలపెడితే ట్రంప్ నిర్మూలన తథ్యమని హెచ్చరించారు. ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ ఆలీ లారిజాని తన సోషల్‌మీడియా పోస్టులో ట్రంప్‌ను బహిరంగంగానే హెచ్చరించారు. మీకంటే ఎవరు గొప్పవారైనా కూడా ఇరాన్‌ను నిర్మూలించలేరని, అవసరమైతే మిమ్మల్నే నిర్మూలిస్తామని ఆయన తన హెచ్చరికలో పేర్కొనడం ఇరుదేశాలమధ్య మరింత ఆగ్రహావేశాలను రగిలించింది.

# టెన్త్ విద్యార్థులకు మంత్రి సూచనలు

>> జూమ్‌కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఇప్పటి వరకు చదువుకున్న పాఠాలను పునఃశ్చరణ చేసుకోవాలని డౌట్‌లు ఉంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. రాత్రంతా మెలకువగా ఉండి చదవటం వల్ల ప్రయోజనం కన్నా నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. రాత్రంతా చదివి ఉదయం పరీక్షకు హాజరు అయితే పరీక్షహాలులో నిద్ర వస్తుందని, అదీకాకుండా చదివిన విషయాలు గుర్తుకు రావని హెచ్చరించారు. రాత్రి 10గంటలకు నిద్రకుపక్రమించాలని, తెల్లవారుఝామున 4గంటలకు నిద్రలేచి చదువుకోవాలని సూచించారు. వసతి గృహాల్లోని విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

## అఫ్ఘాన్‌పై పాక్ దాడులకు భారత్ తీవ్రనిరసన

**న్యూయార్క్, మార్చి 10:** అఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ సాగిస్తున్న వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో భారత ప్రతినిధి పర్వతనేని హరీష్ మాట్లాడుతూ అఫ్ఘాన్ భూభాగంపై ఇటీవల జరిగిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ దాడులు అంతర్జాతీయ చట్టాలను తుంగలో తొక్కడమే అని చెప్పారు. ఒక దేశ సార్వభౌమాధికారాన్ని బహిరంగంగా ఉల్లంఘించడమేనని ఆయన ధ్వజమెత్తారు. సరిహద్దుల్లో నిత్యం జరుగుతున్న హింసాకాండ కారణంగా అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆందోళన వ్యక్తం చేశారు.

# ఇక ప్రత్యేక అధికారుల పాలన

>> పంచాయతీల్లో ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. విజయనగరం, విశాఖపట్నం, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, కడప, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. వీటితోపాటు ఇప్పటికే కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు స్పెషల్ ఆఫీసర్ పాలన అమల్లో ఉండగా అక్కడ మరో 6 నెలలు పొడిగించారు. ప్రస్తుతం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు. మరో రెండు మున్సిపాలిటీల హోదా పెంచుతూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పెద్దాపురం, జగ్గయ్యపేట మునిసిపాలిటీల హోదాను గ్రేడ్ 2 నుంచి స్పెషల్ గ్రేడ్ కు పెంచింది. 2022 నుంచి ఏటా ఆదాయం పెరగడం, వ్యయాలు సంతృప్తికరంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేసిన ప్రభుత్వం హోదా పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు విడివిడిగా నోటిఫికేషన్లు జారీ చేసింది. ప్రాంతాల వారీగా పాలన వివరాలు: ఇచ్ఛాపురం, పలాస కాశీబుగ్గ, బొబ్బిలి, నెల్లిమర్ల, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, యలమంచిలి, నర్సీపట్నం, పెద్దాపురం, తుని, ఏలేశ్వరం, సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, అమలాపురం, రామచంద్రాపురం, మండపేటల్లో ప్రత్యేక అధికారుల పాలన విధించారు. అదే విధంగా ముమ్మిడివరం, కొవ్వూరు, నిడదవోలు, నర్సాపూర్, నూజివీడు, జంగారెడ్డిగూడెం, పెడన, ఉయ్యూరులో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది. వీటితో పాటు నందిగామ, తిరువూరు, తెనాలి, రేపల్లె, చీరాల, పిడుగురాళ్ల, మాచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీమకుర్తి, మార్కాపూర్, గిద్దలూరు, కనిగిరి, ఆత్మకూరు(ఎన్), వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, పుత్తూర్, పుంగనూర్, పలమనేరు, నగరి, రాయదుర్గ్, కళ్యాణ దుర్గం, తాడిపత్రి, గుంతకల్, గుత్తి, ధర్మవరం, హిందూపూర్, మడకశిరలో ప్రత్యేక అధికారులను నియమించారు. కదిరి, పుట్టపర్తి, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేల్, మైదుకూర్, యర్రగుంట్ల మున్సిపాలిటీల్లో సైతం ప్రజాప్రతినిధుల పాలన ముగిసింది. ఇక మదనపల్లి, రాయచోటి, నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూర్ (కె), నందికొట్కూర్, గూడూర్( కె)లో, ఆదోని, ఎమ్మిగనూర్ లలో ప్రత్యేక అధికారుల పాలన విధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రేడ్ 1, 2, 3 మున్సిపాల్టీలకు పరిస్థితిని బట్టి జాయింట్ కలెక్టర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. ప్రజలకు పరిపాలనాపరంగా ఎక్కడా ఏ విధమైన సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని పురపాలక పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ కు రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కె సురేశ్ కుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

# విశాఖకు తీపి కబురు

>> ఈ సమావేశంలో క్యాప్‌జెమిని సంస్థకు భూకేటాయింపులు, తాత్కాలిక క్యాంపస్‌తో పాటు ఇతర అంశాలపై స్పష్టత రానుంది. మరోవైపు ఐబీఎం సంస్థ మూడేళ్లకు గానూ రూ.321 కోట్ల ఎగుమతులను ఉండొచ్చని అంచనా వేస్తోంది. అలాగే 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రచిస్తోంది. మధురవాడ ఐటీ సెజ్ లోని హిల్ నంబర్ 3లో గతంలో ఐబీఎం క్యాంపస్ ఉండేది. 25 ఎకరాల విస్తీర్ణంలో 3.2 ఎకరాలలో క్యాంపస్ ఉంది. మిగిలిన 21.8 ఎకరాల భూమిని ఐబీఎం సంస్థ తిరిగి ఇచ్చింది, ఏపీఐఐసీ ఈ భూమిని ఇటీవలే టీసీఎస్‌కు కేటాయించింది. మరోవైపు క్యాప్‌జెమిని క్యాంపస్ ఏర్పాటుచేయడానికి 25 ఎకరాల కంటే ఎక్కువ భూమి కోసం కొమ్మాది, ఆనందపురం ప్రాంతాలను పరిశీలిస్తోంది. క్యాప్‌జెమిని సంస్థ తన క్యాంపస్ కోసం భూమిని కేటాయించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీనిపై ప్రభుత్వం కూడా హామీ ఇచ్చినట్లు తెలిసింది. నాలుగు వేలమందికి ఉద్యోగాలు కల్పించేలా క్యాప్‌జెమిని సంస్థ శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రచిస్తోంది. క్యాప్‌జెమిని ఉన్నతాధికారులు ఒకటి లేదా రెండు వారాల్లో విశాఖను సందర్శిస్తారని.. దీనిపై మరింత క్లారిటీ వస్తుందని అధికారులు చెప్తున్నారు. మరోవైపు క్యాప్ జెమిని ప్రతినిధులు విశాఖపట్నాన్ని సందర్శించి ఒకట్రెండు ప్రదేశాలను పరిశీలించారన్న విశాఖ కలెక్టర్ హరేందిర ప్రసాద్.. ప్రస్తుతం చర్చలు ప్రాథమిక దశలోనే ఉందన్నారు. మరోవైపు ఐబీఎం సంస్థ నుంచి ఎవరూ తమను సంప్రదించలేదన్న విశాఖ కలెక్టర్ బహుశా రాష్ట్రస్థాయిలో చర్చలు జరుగుతూ ఉండొచ్చని అన్నారు.

# పునర్వ్యవస్థీకరణ

>> గమనిస్తే ఎల్ఆర్ఎస్ బీపీఎస్ ద్వారా వచ్చే ఆదాయంలో సగం వాటాను గ్రామ పంచాయతీలకు ఇవ్వాలని నిర్ణయం. ఈ చర్యల వల్ల పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, ఇంజనీరింగ్ పనులలో పారదర్శకత, వేగం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# చమురు మంటలు!

>> ప్రధానంగా ఎల్‌పిజి సరఫరాపై దృష్టి పెట్టింది. గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టకుండా బుకింగ్ నుంచి డెలివరీ వరకు నిబంధనలు కఠినతరం చేసింది. కొత్త ఎల్‌పిజి సిలిండర్ బుకింగ్‌ల కోసం వేచి ఉండే సమయాన్ని 21 రోజుల నుండి 25 రోజులకు పెంచింది. అంతేగాక, 'దేశీయ ఎల్‌పిజి సరఫరాలో దుర్వినియోగాన్ని నిరోధించడానికి, ఎల్‌పిజి సరైన దిశలో పంపిణీ జరిగేలా పరిస్థితిని పర్యవేక్షించడానికి నిత్యావసర వస్తువుల చట్టం(ఎస్మా) ప్రయోగించింది' అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అలాగే ఎల్‌పిజి ఉత్పత్తిని 10శాతం మేర పెంచాలని దేశీయ ఎల్‌పిజి ఉత్పత్తి సంస్థలను కేంద్రం ఆదేశించింది. "గృహ వినియోగం ఇప్పటికీ ప్రధానం" అని ఒక వర్గాలు తెలిపాయి. ఎల్‌పిజి కొరత గురించి సోషల్ మీడియాలో వ్యాపించే ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మవద్దని కూడా ప్రభుత్వం ప్రజలను కోరింది. ఎల్‌పిజి లభ్యత గురించి ఆందోళనలను గుర్తు చేస్తూ కొన్ని సంఘాలు లేఖలు రాసినప్పటికీ, ప్రభుత్వం ఇప్పటికీ లేవనెత్తిన సమస్యలను గమనించి వాటిని పరిష్కరించడానికి వెంటనే చర్య తీసుకుందని వర్గాలు తెలిపాయి.

### ఆకస్మిక తనిఖీలు

**నెల్లూరు కార్పొరేషన్, మార్చి 10 ప్రభాతవార్త :** నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఏసీబి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిటీ ప్లానింగ్ విభాగాలకు చెందిన రికార్డులను, వాటి వివరాలను పరిశీలించారు. అందులోని కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, ఇతర విభాగాలపై అనేక ఆరోపణలు రావడం ఏసీబి అధికారులకు సైతం ఫిర్యాదులు వచ్చి ఉండడంతో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఏసీబి డిఎస్‌పి రామక్రిష్ణుడు, సిఐలు విజయ కుమార్, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

11-03-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
అష్టమి తె.4.19
జ్యేష్ఠ రా.9.59
వర్జ్యం : ఉ.5.21-7.06
దు.ఉ.11.55-12.43
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ఇ-మెయిల్స్ ద్వారా లేక ఫోన్ సంభాషణల ద్వారా మీకు ఉపకరించే సమాచారం అందుకుంటారు.

**వృషభం:** రాజకీయ పలుకుబడి, ప్రజా సంబంధాలు లాభిస్తాయి. శుభకార్యాలు నిర్వహించడానికి అదృష్టం తోడవుతుంది.

**మిథునం:** పక్షపాతధోరణితో వ్యవహరించారన్న నిందలు ప్రచారంలో ఉంటాయి. ఋణయత్నం ఫలిస్తుంది. వాహనసౌఖ్యం.

**కర్కాటకం :** కార్యాలయాలలో మీ పనితీరును మరింతగా మెరుగుపర్చు కోగలుగుతారు. వ్యాపారస్థులకు అనుకూలం. ధనలాభం.

**సింహం:** కొత్త, వింత ఆలోచనలతో మీ మనస్సు వత్తిడికి లోనవుతుంది. విదేశీయాన ప్రయత్నాలు కలిసివస్తాయి.

**కన్య :** వైద్యున్ని మార్పుచేయడం వలన లాభపడగలుగుతాయని భావిస్తారు. ఆధ్యాత్మిక భావాలు కలిగిఉంటారు.

**తుల :** సుపరిచితులు కొందరు మీ సహాయాన్ని అర్థిస్తారు. ఆర్థికంగా లాభ నష్టాలు రెండూ సరిసమానంగా ఉంటాయి.

**వృశ్చికం:** డాక్యుమెంట్స్, లిఖిత పూర్వక వ్యవహారాలవలన లాభపడతారు. నూతన వైద్య విధానాలను అవలంభిస్తారు.

**ధనుస్సు:** ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడానికి గాను ప్రయత్నాలను సాగిస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు.

**మకరం:** వ్యాపారాభివృద్ధిలో చురుకుదనాన్ని తీసుకురావడానికిగాను చేసే ప్రయత్నాలు సానుకూలపడతాయి. వాహనసౌఖ్యం.

**కుంభం:** ఇష్టం లేని వ్యక్తులతో కలిసి పనిచేయవలసి వస్తుంది. ఆశయ సాధనకోసం అహోరాత్రులు శ్రమిస్తారు.

**మీనం :** సున్నితమైన అంశములతోటి వివాదాస్పదమైన వ్యక్తులతోటి ముడిపడి ఉంటాయి. ఆహారనియమాలను పాటిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి నో బెయిల్

### వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసు

### పిన్నెల్లి బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన గురజాల కోర్టు

**గుంటూరు మార్చి 10 ప్రభాత వార్త ప్రతినిధి :** పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నేత పిన్నెల్లి వెంకట రామిరెడ్డికి న్యాయస్థానంలో చుక్కె దురైంది. ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను గురజాల కోర్టు కొట్టివేసింది. కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయలేమని కోర్టు స్పష్టం చేసింది. గతేడాది గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు కోటేశ్వరరావు హత్యకు గురయ్యారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌లో వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా వెల్దుర్తి మండలం బొదిలవీడు సమీపంలో వాహనంతో ఢీకొట్టి ఇరువురిని హతమార్చారు. ఈ హత్యల వెనుక పిన్నెల్లి సోదరుల ప్రమేయం ఉందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఏ7 నిందితుడిగా ఉన్నారు. ఆయన తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన గురజాల కోర్టు కేసు పూర్వాపరాలను పరిశీలించి బెయిల్‌ను తిరస్కరించింది.

## గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

**విజయవాడ మార్చి 10 ప్రభాతవార్త ప్రతినిధి:** మంగళగిరి ఆరో బెటాలియన్‌లో గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే పీపీటీ ట్రైనింగ్ భాగంగా 3.2 కిలోమీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజయవాడ రామవరప్పాడుకు చెందిన హెచ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కొంచెం దూరం పరిగెత్తగానే గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఎయిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# రాష్ట్రంలో వంట గ్యాస్‌కు ఎటువంటి ఇబ్బంది లేదు

### పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ,మార్చి 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వంట గ్యాస్‌కు ఎటువంటి ఇబ్బంది లేదని ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వినియోగదారుల అవసరాలను గుర్తించి ప్రభుత్వం అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందన్నారు. వంట గ్యాస్ కొరత ఉందంటూ వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో వంట గ్యాస్ సరఫరాపై ఉన్నతాధికారులతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏపీలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని ప్రజలెవరూ దీనిపై అనవసరమైన ఆందోళనకి గురి కావొద్దని మంత్రి నాదెండ్ల విజ్ఞప్తి చేశారు. గృహ అవసరాలకు, వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ప్రస్తుతానికి ఇబ్బ ంది ఏమీ లేదని తెలిపారు. కీలక మైన ఈ న వ ం య ం ం లో ఎల్పీజీ గ్యాస్ అక్రమంగా బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా జిల్లాలవారీగా చర్యలు తీసుకోవాలనీ ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రానికి అందుబాటులో ఉన్న గ్యాస్ నిల్వల గురించి అధికారులతో మంత్రి నాదెండ్ల చర్చించారు. గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అవసరం అయితే వాణిజ్య అవసరాలకు అందించే ఎల్పీజీ గ్యాస్‌ను ప్రాధాన్యతల ప్రకారం అందించే ఏర్పాటు చేస్తామని వివరించారు. హెచ్ పీసీ విశాఖపట్నం రిఫైనరీ, మంగళూరు నుంచి వచ్చే హాస్సన్ చర్లపల్లి పైపులైను, విశాఖలోని హెచ్ పీసీ, బీపీసీ, ఐఓసీల ద్వారా రాష్ట్రం నుంచి సరఫరా అవుతున్న గ్యాస్ సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని నాదెండ్ల పేర్కొన్నారు. అంతేకాకుండా రోజువారీ అవసరాలకు సరిపడా నిల్వల్లో ఏ మాత్రం తేడా వచ్చినా, ప్రత్యామ్నాయంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముందుకు వెళ్తామని నాదెండ్ల స్పష్టం చేశారు. ప్రత్యేక నిఘా బృందాలను నియమించుకొని గ్యాస్ పక్కదోవ పట్టకుండా జాయింట్ కలెక్టర్లు నియంత్రించాలని ఇష్టానుసారం ధరలు పెంచినా, వదంతులు వ్యాప్తి చేసినా సరే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గ్యాస్ సరఫరాపై ప్రత్యేక దృష్టి ఎప్పటికప్పుడు జిల్లాల వారీగా సరఫరా చైన్ ను పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా సరఫరాలో లోపాలు వస్తే వెంటనే సరిదిద్దే ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి నాదెండ్ల ఆదేశించారు.

# పాల కల్తీని గుర్తించాలంటే..

### - ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి

**సచివాలయం,మార్చి 10,ప్రభాతవార్త :** రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో పాలు,పాల పదార్థాల్లో కల్తీని ఇంట్లోనే సులువుగా గుర్తించవచ్చని రాష్ట్ర ఆహార భద్రత శాఖ వెల్లడించింది. మంగళవారం ఫుడ్ అండ్ సేఫ్టీ డైరెక్టర్ నీలకంఠారెడ్డి పై విధంగా తెలిపారు. ఏటవాలుగా పళ్ళాన్ని ఉంచి పాల చుక్కను వదలినప్పుడు స్వచ్ఛమైన పాలు అయితే తెల్లటి ధార మాదిరిగాదిగుతుంది. అదే నీరు కలిపిన పాలయితే తెల్లటి దార లేకుండా త్వరగా కిందికి దిగిపోతుందని రాష్ట్ర ఆహార భద్రత శాఖ తెలిపింది. ఇలా చిన్న చిన్న చిట్కాలు పాటించడం ద్వారా కల్తీపాలు, వాటి ఉత్పత్తులకు దూరంగా ఉండవచ్చని పేర్కొంది. రాజమహేంద్రవరం ఘటన నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తాజాగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశించిన ప్రకారం కల్తీపాలను ఎలా గుర్తించాలి అన్న దానిపై ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్ నీలకంఠారెడ్డి ఓ ప్రకటన జారీ చేశారు. ఫుడ్ సేఫ్టీ ఆధార్టి వారు పాలు, పాల ఉత్పత్తుల్లో జరిగే కల్తీని ఎలా కనుగొనాలో తెలియజేస్తూ పేర్కొన్న అంశాల ను కరపత్రాలు, పుస్తకాల రూపంలో ప్రచురించి విద్యాసంస్థలకు పంపిణీ చేయబోతున్నట్లు ఐపిఎం డైరెక్టర్ నీలకంఠారెడ్డి తెలిపారు. వీటి ద్వారా ముఖ్యకూడళ్ళలోనూ, సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

**- యూరియా లేదా డిటర్జంట్ కలిసిందో లేదో తెలుసుకోవాలంటే ..**

ఓ గ్లాసులో 10ఎంఎల్ పాలు, 10ఎంఎల్ నీటిని కలిపి, బాగా కదిలించాలి, అప్పుడు పై భాగంలో మందమైన నురుగు ఏర్పడుతుంది. అదే స్వచ్ఛమైన పాలయితే నురుగరాదు.

**- రంగు మారితే**

మొక్కజొన్న లేదా ఇతర పిండి పదార్థాలను చిక్కదనం కోసం పాలలో కలిపారా లేదా తెలుసుకోవాలంటే ఓ గ్లాసులో పాలు తీసుకొని ఆయోడిన్ ద్రావణాన్ని రెండు, మూడు చుక్కలు కలిపినట్లయితే సదరుపాలు నీలం రంగులోకి మారుతుంది. ఇదే జరిగితే కల్తీ జరిగినట్లు భావించాలి. రంగు మారకుండా ఉంటే వాటిని స్వచ్ఛమైన పాలుగా పరిగణించాలి. బంగాళాదుంప, చిలకడ దుంప, ఇతర పిండి పదార్థాలను నెయ్యిలో కలిపారా? లేదా అని తెలుసుకోవడానికి ఒక స్పూన్ నెయ్యిని చిన్న గాజు గిన్నెలో వేయాలి. తర్వాత రెండు మూడు చిన్న అయోడిన్ ఉప్పు ద్రావణాన్ని వేయాలి. అప్పుడు నెయ్యి నీలం రంగులోనికి మారితే కల్తీ జరిగినట్లు భావించాలి.

**- నెయ్యిలో వనస్పత్తి, పామాయిల్ ఉందా లేదో తెలుసుకోవాలంటే ..**

ఒక స్పూన్లో నెయ్యి తీసుకొని కొంచం చక్కెర కలిపి వేడిచేసినప్పుడు అది ఎరుపు లేదా పింక్ రంగులోనికి మారితే వనస్పత్తి కలిపినట్లు గుర్తించాలి, అలాగే గ్లాస్ వేడినీటిలో స్పూన్ నెయ్యిని వేస్తే... ఒరిజినల్ నెయ్యి అయిన పక్షంలో అది పైన తేలుతుంది. వనస్పత్తి కలిపిన నెయ్యి అయితే చిన్న చిన్న ముద్దలుగా మారి కనిపిస్తుంది. ఒక చుక్క నెయ్యిని అరచేతిలోకి తీసుకొని గట్టిగా రుద్దినట్లయితే సువాసన రావాలి సువాసన రాకుండా ఉంటే నెయ్యిలో కల్తీ జరిగినట్లుగా భావించాలి.

**- కల్తీ గురించి తెలిస్తే ఫిర్యాదు చేయాలి..**

కల్తీ ఘటనల గురించి తెలిస్తే 1800 425 3857(టోల్‌ఫ్రీ నెంబర్) 0845 297245 (ఐపిఎం ప్రధాన కార్యాలయం)కు తెలియ జేయాలని డైరెక్టర్ నీలకంఠారెడ్డి సూచించారు.

## పిఎం ఇ - డ్రైవ్ పథకం ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన

### - జాతీయ రహదారి పక్కన 135 ప్రాంతాల్లో ఇవి 600 ఛార్జింగ్ యూనిట్లు!

**విజయవాడ మార్చి 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పీఎం ఈ-డ్రైవ్ పథకం దశల వారీగా 444 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన రూపొందించింది. ఇందులో భాగంగా జాతీయ రహదారి పక్కగా 135 ఈవీ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, జెన్‌కో, డిస్కంల దగ్గర అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను ఎంపిక చేసి ఫిబ్రవరి మొదటి వారంలో అధికారులు కేంద్రానికి ప్రతిపాదన పంపారు. కేంద్ర బృందం సుమారు 200 లొకేషన్లను పరిశీలించి మొదటి దశలో 135 చోట్ల ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వీటిలో సుమారు 600 ఛార్జింగ్ యూనిట్లు అందుబాటులోకి రానున్నాయ. ఒక్కో ఛార్జింగ్ కేంద్రంలో కారు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, భారీవాహనాల ఛార్జింగ్‌కు సదుపాయాలు కల్పించనున్నారు. ఏప్రిల్‌లో టెండర్లు పిలిచి, గుత్తేదారులకు పనులు అప్పగించనున్నట్లు నూతన పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు. జులై, ఆగస్టు నాటికి అందుబాటులోకి తేవాలని భావిస్తున్నారు. ఒక్కో ఛార్జింగ్ కేంద్రం ఏర్పాటుకు సుమారు రూ.50 లక్షలు ఖర్చవుతుందని అంచనా. ఇందులో 80 శాతం కేంద్రం భరిస్తుంది. మిగిలిన 20 శాతాన్ని రాష్ట్ర వాటాగా డిస్కంలు సమకూరుస్తాయి. సప్లయ్, ఆపరేషన్, ఇన్‌స్టలేషన్ విధానంలో ఐదేళ్లపాటు వీటిని నిర్వహించేందుకు ఆపరేటర్లను టెండరు ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. నిర్వహణ ద్వారా వచ్చిన ఆదాయంలో అధిక భాగం డిస్కంలకు వెళ్తుంది. అవి ఒప్పందం మేరకు కొంత మొత్తాన్ని ఆపరేటర్లకు చెల్లిస్తాయి. రెండో దశలో నగరాల్లో ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం ప్రాధాన్యమిస్తోంది. విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాల్లో అనువైన స్థలాలను నెడ్‌క్యాప్ గుర్తించి ప్రతిపాదనలను కేంద్రానికి పంపింది. రాష్ట్రంలో ఏటా సుమారు 6వేల కొత్త ఎలక్ట్రికల్ కార్లు, 4వేల ఆటోలు, 40వేల ద్విచక్రవాహనాలు రోడ్డెక్కుతున్నాయని లెక్కలు చెబుతున్నాయి.

## నేటి నుంచి సచివాలయంలో కలెక్టర్ల సమావేశాలు

**విజయవాడ,మార్చి10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర అభివృద్ధి దిశగా పని చేస్తోన్న అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేసేలా ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు కలెక్టర్ల సమావేశం జరగనుంది. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, జీఎస్డీపీ గ్రోత్, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, మౌలిక సదుపాయాల కల్పన, శాంతిభద్రతలపై సమగ్రంగా చర్చించనున్నారు. కాన్ఫరెన్స్ మొదటి రోజు ఉదయం 10 గంటలకు దిదిలితి స్వాగత ప్రసంగంతో ప్రారంభమవుతుంది. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఉదయం 10:30 గంటలకు ముఖ్యమంత్రి కీనోట్ అడ్రస్ ఇవ్వనున్నారు. అనంతరం వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షినున్నారు. స్వర్ణాంధ్ర 2047 పది సూత్రాల అమల్లో భాగంగా పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, జల భద్రత, వ్యవసాయ రంగంలో టెక్నాలజీ వంటి అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్ర జీఎస్‌డిపి, జిల్లాల వారీగా సాధించిన లక్ష్యాలపై సమీక్షిస్తారు. ఇక డిజిటల్ గవర్నెన్సులో భాగంగా ఈ- ఆఫీస్ ఫైళ్ల పరిష్కారం, డేటా డ్రివెన్ గవర్నెన్స్, పెట్టుబడి ప్రతిపాదనల గ్రౌండింగ్‌పై అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. సదస్సు రెండో రోజున ప్రజారోగ్యం, సంక్షేమ పథకాలపై ప్రత్యేక సమావేశంలో కీలక చర్చ జరగనుంది. దీంతో సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు, మధ్యాహ్న భోజన పథకం, వేసవిలో తాగునీటి ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్ష చేపడతారు.

అలాగే భూ పరిపాలన, రెవెన్యూ ఆర్జన శాఖల పనితీరుతో పాటు విద్య, ఉపాధి అవకాశాల కల్పనపై చర్చలు జరగనున్నాయి. రెండో రోజు సాయంత్రం వేళ రాష్ట్రంలోని శాంతిభద్రతలపై ప్రత్యేక సెషన్ ఉంటుంది. ఈ సెషనులో జిల్లా ఎస్పీలు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితిపై డీజీపీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ రెండు రోజుల సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, హెచ్వోడీలు పాల్గొననున్నారు.

## ఇంటెగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్‌గా ఎపి

### వచ్చే 10 యేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులే లక్ష్యం

### రాష్ట్రంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు అధికారుల ప్రతిపాదన

### గనుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



గనుల శాఖపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడమార్చి 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్‌గా అభివృద్ధి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. ఇందుకు రాష్ట్రంలో బీచ్ సాండ్ వంటి మినరల్స్‌ను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. సచివాలయంలో మంగళవారం గనుల శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ రూపకల్పన, పెట్టుబడులు, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ మిషన్ ద్వారా భారీగా పెట్టుబడులు ఆకట్టుకోవడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం అన్నారు. ఇది రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతంగా నిలుస్తుందన్నారు. ఈ మిషన్ ద్వారా వచ్చే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు, 40,000 ఉద్యోగాల సాధనే లక్ష్యం కావాలన్నారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్రం, మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలు, వాల్యూ ఎడిషన్ పైనా మరింత అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. వనరుల సద్వినియోగం చేసుకోవాలంటే వాటిపై అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్రంలో విలువైన బీచ్ సాండ్ మినరల్స్ రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని, వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి ఖనిజాలు ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బీచ్ సాండ్ మినరల్స్ ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఔషధ పరిశ్రమ, ఏరోస్పేస్, రక్షణ రంగం, శస్త్రచికిత్స, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ భాగాల వంటి కీలక పరిశ్రమలకు అవసరం అవుతాయని వివరించారు. రాష్ట్రంలో లభిస్తున్న మినరల్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ఈ సందర్భంగా ప్రతిపాదనలు ముఖ్యమంత్రి ముందుంచారు. అందులో ఒకటి శ్రీకాకుళంలో టైటానియం పార్క్, సంవత్సరానికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం. రెండవది అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్,

సంవత్సరానికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం. మూడవ మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్. ఈ సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర, మైనింగ్, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా,

## జనసేన రాష్ట్రస్థాయి వేడుకల్లో మార్పులు

**విజయవాడ మార్చి 10 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 14న పిఠాపురంలో తలపెట్టిన కార్యక్రమంలో మార్పులు చేసినట్లు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా రాష్ట్రస్థాయి వేడుకల్ని రద్దు చేశారు. ఆవిర్భావ దినోత్సవాన్ని ఎక్కడికక్కడ నిర్వహించుకోవాలని పార్టీ శ్రేణుల్ని ఆదేశించారు. జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను ఈసారి రాష్ట్ర స్థాయిలో పిఠాపురంలో నిర్వహించాలని తొలుత భావించారు. అయితే వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉంటాయనే నివేదికల్ని పరిగణనలోకి తీసుకొని అందుకు అనుగుణంగా మార్పులు చేశారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో కాకుండా జిల్లా, నగర, మండల కేంద్రాల్లో నిర్వహించి కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహాన్ని కొనసాగించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. జన సైనికులకి, వీర మహిళలకు, జనసేన నాయకులకు పండగ లాంటి రోజైన మార్చి 14న పార్టీ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు.

### గరుడ వారధి పై ప్రమాదాల నివారణకు చర్యలు

### - భారీ వాహనాలు నిషేధం: పోలీస్‌శాఖ

**తిరుపతి,మార్చి 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో ఉన్న గరుడ వారధి పై ప్రయాణించే వాహనచోదకులు ప్రమాదాల బారిన పడకుండా కొన్ని నిబంధనలు పోలీసుశాఖ అమలుచేసింది. గరుడవారధిపై ఇక నుండి ద్విచక్ర వాహనాలు , భారీ వాహనాలు ప్రయాణించకుండా నిషేధం విధించారు. ప్రజల భద్రత కు అధిక ప్రాధాన్యతనిస్తూ తిరుపతి స్మార్ట్ సిటీ ఆదేశాలు అమలు లో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య కీలక నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం ఈ అధికారులు సంయుక్తంగా సమావేశమయ్యారు. సంబంధిత విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలతో పాటు గరుడ వారధి పైన జరిగే రోడ్డు ప్రమాదాల పైన చర్చించడం జరిగింది. గరుడ వారధి ప్రారంభమైన నాటి నుండి ఇప్పటివరకు జరిగిన ప్రమాదాల వివరాలను పరిశీలించి ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాల కారణంగా ప్రమాదం జరుగుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యం లో ప్రజల భద్రతే ధ్యేయంగా గరుడ వారధి పై ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాల పూర్తిగా నిషేధించడం జరిగింది.

# తిరుమల సమాచారం

## పరాకామణిలో బహుళస్థాయి భద్రతా వ్యవస్థ

**తిరుమల,మార్చి 10ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించే కానుకల లెక్కించే పరకామణి భవనంలో బహుళస్థాయి భద్రతా వ్యవస్థ, కఠిన నియంత్రణ విధానాలు, సీసీటీవీ పర్యవేక్షణ ఉన్నాయని టిటిడి స్పష్టం చేసింది. 2025 జనవరి 11న పరాకామణిలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెంచలయ్య 100 గ్రాముల బంగారు బిస్కెట్‌ను అపహరించేందుకు ప్రయత్నించినప్పుడు టిటిడి నిఘాభద్రత సిబ్బంది అప్రమత్తంగా స్పందించి అక్కడికక్కడే పట్టుకున్నారు. అతను ఆ బంగారు బిస్కెట్‌ను ఖాళీగా ఉన్న స్టీల్ హుండీ ట్రాలీలోని పైపు రంధ్రంలో దాచిపెట్టినట్లు సాధారణ భద్రతా తనిఖీలలో గుర్తించారు. ఈ ఘటన సిసిటివి కెమెరాల్లో స్పష్టంగా నమోదైంది. దాని ఆధారాలు కూడా కోర్టుకు సమర్పించబడ్డాయి. ఈ ఘటనపై విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్ టౌన్ పోలీస్‌లు 02/2025 ,సెక్షన్ 316(5) కింద నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి నిందితుడిని వెంటనే అరెస్ట్ చేశారు. 2025 జనవరి 13న నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం అతన్ని రిమాండ్‌కు పంపింది. నిందితుడు సుమారు 30 రోజులు రిమాండ్‌లో ఉన్నాడని టిటిడి తెలిపింది. పోలీసుల దర్యాప్తులో నిందితుడి ఇంటి వద్ద ,ఇతర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ఘటన స్థలంలో 100 గ్రాముల బంగారు బిస్కెట్, ఇంటి సోదాల్లో 555.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 157 గ్రాముల వెండి వస్తువులు, పోలీసు కస్టడీలో అదనంగా 76 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అదనంగా ఓ జ్యువెలరీ దుకాణాల్లో బంగారం మార్పిడి చేసిన ఇన్వాయిస్ రసీదులు కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. దర్యాప్తులో భాగంగా 12 మంది సాక్షులను విచారించి, నిందితుడి ఆర్థిక లావాదేవీలు, బ్యాంకుల్లో బంగారం ముట్టజెప్పిన వివరాలు, ఆస్తులు, బినామీ లావాదేవీలు తదితర అంశాలను కూడా పరిశీలించారు. ఈ ఘటనపై అన్ని ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేయబడింది. ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానంలో విచారణలో ఉందని, తదుపరి విచారణ ఏప్రిల్ 13న జరగనుందని టిటిడి తెలిపింది.

## శబ్దకాలుష్య వాహనాలకు జరిమానా

### - అలిపిరి వద్ద విస్తృత తనిఖీలు



**తిరుమల,మార్చి 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నుండి తిరుమలకు నడిచే ద్విచక్రవాహనాలు, నాలుగుచక్రాల వాహనాలు శబ్దకాలుష్యానికి కారణంగా మారాయి. వీటిపై తిరుపతి అలిపిరి వద్ద మంగళవాం సాయంత్రం తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్,,తిరుపతి రవాణాశాఖ జిల్లా అదికారి కొర్రపాటి మురళీమోహన్, ఎంవిఐలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మోహన్ కుమార్ ,రమణ నాయక్, అతికానాజ్ , స్వర్ణలత, ప్రసాద్ వర్మతో కలసి పలు బృందాలూ తనిఖీలు చేశారు. తిరుమల ఘాట్ రోడ్డు ప్రవేశ ద్వారం అలిపిరి టోల్ గేట్ వద్ద శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు తిరుపతి మోటార్ వాహన తనిఖీ అధికారులు ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అధిక శబ్దం చేసే మార్పు చేసిన సైలెన్సర్లు ఉపయోగిస్తున్న ద్విచక్ర వాహనాలు , ఇతర వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అధికంగా శబ్ద కాలుష్యాన్ని వెలువరిస్తున్న జీపులు మరియు ఇతర రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. చట్టంలోని సెక్షన్ 190(2) ప్రకారం ఈ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేసి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సిఐ హరి ప్రసాద్ తెలిపారు. తిరుమల వంటి ఆధ్యాత్మిక ప్రాంతంలో అధిక శబ్దం భక్తులకు , స్థానిక ప్రజలకు అసౌకర్యం కలిగించడంతో పాటు పర్యావరణానికి కూడా హానికరం అవుతుందని తెలిపారు. వాహనదారులు అనుమతించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సైలెన్సర్లను మాత్రమే ఉపయోగించాలని, అనధికార సైరన్ లను ఉపయోగించరాదని అధికారులు సూచించారు.. తొలిరోజు తనిఖీల్లో 25 వాహనాలు తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిని 1.50లక్షలు రూపాయలు వసూలు చేయడం జరిగింది. మూడు సంవత్సరాలుగా త్రైమాసిక పన్నుచెల్లించని టెంపో ట్రావెలర్ పై లక్ష రూపాయలు జరిమానా విధించడం జరిగింది.

## సమయానికే క్యూలైన్‌కు రండి

### - నిర్దేశించిన సమయంలోనే అనుమతి

**తిరుమల,మార్చి 10ప్రభాతవార్తప్రతినిధి:** కలి యుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి దర్శనానికి అమలవుతున్న పలు విధానాల్లో ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాటెడ్ టోకెన్లు పొందిన, ఆన్‌లైన్‌లో ఎస్ఇడి టిక్కెట్లు కలిగిన భక్తులు నిర్ధేశిత సమయానికే క్యూలైన్ వద్దకు చేరుకోవాలని టిటిడి తెలిపింది. రోజువారీగా ఆయా సమయాల్లోనే భక్తులు వస్తే సులభంగా క్యూలైన్లలోనికి ప్రవేశించి స్వామివారిని దర్శించుకోవచ్చని తెలిపింది. స్లాటెడ్ సర్వ దర్శనం టోకెన్లు, ప్రత్యేక దర్శనం టికెట్లు (300 రూపాయలు)కలిగిన భక్తులు వారికి కేటాయించిన స్లాట్ ప్రకారం నిర్దేశిత సమయంలోనే అనుమతించడం జరుగుతుందని టిటిడి స్పష్టం చేసింది. ఈ నిబంధనను టిటిడి ఇప్పుడు పటిష్టంగా అమలు చేస్తోంది. భక్తులు తమకు కేటాయించిన సమయానికంటే ముందుగా వచ్చి ఇబ్బంది పడవద్దని, సమయం పాటించే భక్తులను ఇబ్బంది పెట్టవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు టిటిడి అధికారులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని తమకు కేటాయించిన సమయానికే క్యూలైన్ల వద్దకు చేరుకోవాలని భక్తులకు కోరారు.

## తిరుమల ఆలయంలో అష్టదళపాద పద్మారాధనసేవ సమయం మార్పు

### - ఉదయం 6గంటలకే మూలవిరాట్టుకు నివేదనలు

**తిరుమల,మార్చి 10ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతిరోజూ ఉత్సవాలే.. సేవలే. రోజువారీగానేగాక వారపుసేవలుగా ప్రతి మంగళవారం ఆనందనిలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు అష్టదళపాదపద్మారాధనసేవ నిర్వహిస్తారు. వైఖానస ఆగమోక్తంగా ఆలయ అర్చకులు, పండితులు ఆలయంలోపల బంగారువాకిలిలో జరిపించే ఈ సేవ గత నాలుగేళ్ళుగా ఉదయం 9గంటల నుండి 9.45గంటల వరకు చేసేవారు. అయితే టిటిడి ఆగమసలహామండలి సూచనలతో టిటిడి బోర్డు, అధికారులు ఈ సమయాన్ని మార్పుచేశారు. ఇకనుండి మంగళవారం ఈ అష్టదళపాద పద్మారాధనసేవ ఉదయం 6గంటల నుండి 6.45గంటల వరకు నిర్వహిస్తారు. మంగళవారం (నేటి)నుండి ఈ నూతన సమయం అమలవుతుంది. భక్తులు కూడా ఈ మార్పును గమనించి తదనుగుణంగా సేవ టిక్కెట్ పొందిన గృహస్థులు ఆలయంలోనికి చేరుకోవాలని టిటిడి తెలిపింది. కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని వేలసార్లు దర్శించి తరించే భక్తులు మళ్ళీమళ్ళీ చూడాలనే పరవశం చూపుతుంటారు. అలాంటిది ఆర్జితసేవల్లో మరీ దగ్గరగా స్వామివారిని దర్శించుకునే భాగ్యం కూడా కలుగుతుంది. మంగళవారం ఉదయం జరిపించే అష్టదళ పాదపద్మారాధన సేవ సమయంలో టిటిడి కొత్త మార్పు చేసింది.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY**
Project Office, Rayapudi(V), Thullur (M) Amaravati - 522237.
E-Procurement Short Tender Notice
NIT No. 122/MAU61-USI0HB(BG)/19/2025-HB Dt. 09.03.2026
Name of Work: APCRDA - "Providing Audio & Video Solutions for the APHRDI new office located in Block-1 of the PEB Building near the APCRDA Project Office at Rayapudi Village, Amaravati".
The bid can be downloaded on AP e-procurement portal from 11.03.2026 to 21.03.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 21.03.2026 up to 15.00 Hrs, Technical bid opening 21.03.2026 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Amaravati.

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayIndia మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.
**ఇ-వేలం ప్రకటన నెం. BZA-27-2025-26**
భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ వారు విజయవాడ డివిజన్‌లో ప్రకటనలు ఇతర NFR మరియు పార్కింగ్ కాంట్రాక్టులు, ఇవ్వటానికి IREPS www.ireps.gov.in యొక్క 'ఇ-వేలం లీజింగ్' మాడ్యూల్ ద్వారా ఇ-వేలం కొరకు కంపెనీలు/సంస్థలు మరియు పద్దెనిమిది సంవత్సరాలు వయస్సు పైబడిన భారత జాతీయులను ఆహ్వానిస్తున్నారు. ఇ-వేలం షెడ్యూల్ ఇక్కడ క్రింద వివరింపబడింది.

| కాంట్రాక్ట్ యొక్క రకం | వేలంలో ఆఫర్ చేయబడిన లాట్స్ యొక్క సంఖ్య | వేలంషెడ్యూల్ తేదీ మరియు తెరచు సమయం |
|---|---|---|
| పార్కింగ్ | సామర్లకోట (SLO) రైల్వేస్టేషన్ వద్ద సాధారణ ద్విచక్ర వాహనాల కొరకు పార్కింగ్ లాట్స్ | 16.03.2026 ఉ.11.00గం.వద్ద |
| | గూడూరు (GDR) రైల్వే స్టేషన్ వద్ద సాధారణ నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్ స్టాండ్, సింగరాయకొండ (SKM) రైల్వే స్టేషన్ వద్ద ప్రీమియమ్-కం-సాధారణ ద్విచక్రవాహనాల పార్కింగ్ స్టాండ్, తనుకు (TNKU) రైల్వే స్టేషన్ వద్ద సాధారణ ద్విచక్రాల మరియు సాధారణ నాలుగు చక్రాల పార్కింగ్ స్టాండ్ | 25.03.2026 ఉ.11.00గం.వద్ద |

A2635 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ.

వార్త

అందం కంటిని మాత్రమే ఆకట్టుకుంటుంది.
కానీ సౌశీల్యం హృదయాన్నే దోచుకుంటుంది.

-రామకృష్ణ పరమహంస

# పతనం అంచున ప్రజారోగ్యం

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశ ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశాం, చేస్తూనే ఉన్నాం. అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కానీ లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టారు. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యలగూర్చి రాజ్యాంగంలో పొందుపరిచారు. ఇన్ని దశాబ్దాలు గడిచిపోయినా అందరికి కనీస ఆరోగ్య వసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపైదాడుల పరంపర కొనసాగుతూనే ఉన్నది. కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యం కావడం లేదు. కొత్త మందులు, చికిత్సలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటున్నా అంతకురెట్టింపు స్థాయిలో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయి. కోట్లాది మంది రోగపీడితులు అవుతున్నారు. లక్షలాది మంది ప్రాణాలు వదులుతున్నారు. నిన్నమొన్నటి వరకు ప్రపంచాన్ని చిగురుటాకులా వణికించిన కరోనా రక్కసి శాంతించినా అప్పుడు వాడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది కోలుకోలేకపోతున్నారు. కిడ్నీ సమస్యలు పెరిగిపోతున్నాయి. డయాలసిస్ కేంద్రాలు ఎన్ని పెట్టినా సరిపోవడంలేదు. ఇటీవల కాలంలో గుండె జబ్బులు పెరిగిపోయాయి. వయస్సుతో నిమిత్తంలేకుండా ఎనిమిది, తొమ్మిదేళ్ల వయసున్న చిన్నపిల్లల నుండిఅరవై యేళ్లకు పైబడిన వారు గుండెజబ్బులకు లోనవుతున్నారు. ఆకస్మికంగా ఉన్న చోటనే కూలిపోయి క్షణాల్లో ప్రాణాలు వదులుతున్నారు. ఇక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు. గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఒకటే మిటిరకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. అయితే ఈ వ్యాధుల నుండి రోగ నిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు డాక్టర్లు అభిప్రాయపడు తున్నారు. ఒక్క అల్లోపతి డాక్టర్లేకాదు, ఆయుర్వేదం,హోమియో తదితర విభాగాల డాక్టర్లు, వైద్య నిపుణులు, శరీరంలో ఇమ్యూనిటీ పెంచుకోవాలని సలహాలు ఇస్తున్నారు. ఈవిషయం ఇప్పుడు కొత్తగా చెప్పడం లేదు. ఏనాటి నుంచో చెప్తున్నారు. ఈవాస్తవాలు ప్రజలకు కూడా తెలియనివి కావు. అయినా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు. కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? తదితర అంశాలు పరిశీలించాల్సిన తరుణమిది. రోగనిరోధక శక్తి ఒక్క రోజులో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్యమైన పోషక విలువలు కలిగిన పోష్టికాహారాన్ని అందించాలి. ఏమేరకు అందిస్తున్నామో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో ప్రధానంగా నిరుపేదలు అల్లాడిపోతున్నారు.

పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్థాకలితోఅలమటించే వారు భారత్‌లో కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో రోగ నిరోధకశక్తి ఎలా వస్తుంది. మరొకపక్క వాయు, నీటి కాలుష్యాలు ప్రజారోగ్యాన్ని కోలుకోలేకుండా చేస్తున్నాయి. కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు దాదాపు కాగితాలకే పరిమితమవుతున్నాయి. మొన్న దేశరాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం తారాస్థాయికి చేరుకోవడంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఢిల్లీపరిసర ప్రాంతాల్లో ప్రధానంగా చలికాలం, వాయుకాలుష్యం చుట్టుముట్టడం, ఆ పౌరులను ఉక్కిరిబిక్కిరి చేయడం ప్రతియేడాది జరుగుతూనేఉన్నది. యేడాదియేడాదికి పెరిగిపోతున్నది. ఒక్క ఢిల్లీయేకాదు, భారత దేశంలోని అనేక నగరాలు, పట్టణాలు వాయుకాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. దీనికి తోడువాహన కాలుష్యం పెరిగిపోతున్నది. ఫలితంగా కేన్సర్ లాంటి వ్యాధులు పంజా విసురుతున్నాయి. దీని బారినపడి లక్షలాది మంది ఆర్థికంగా చితికిపోతుంటే మరికొందరు సకాలంలో సరైన వైద్యం అందకప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. యేటా సరాసరి దేశంలో పద్నాలుగు లక్షలకుపైగా కేన్సర్ కేసులు నమోదవుతున్నట్లు భారత వైద్య పరిశోధన మండలి జాతీయ కేన్సర్ నమో దు కార్యక్రమం నివేదికను బట్టి తెలుస్తున్నది. యాభై యేళ్లు వయసురాకముందే మహిళలు, పురుషులు రకరకాల కేన్సర్ల బారిన పడుతుండటానికి వారి జీవన శైలి, సంబంధిత అలవాట్లు ప్రధాన కారణమని పరిశోధకులు, వైద్యనిపుణులు విశ్లేషిస్తున్నారు. అలవాట్లను, జీవనశైలిని మార్పు చేసుకోవడం ద్వారా కేన్సర్ మహమ్మారిబారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని నిపుణులు చెబుతున్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడంవల్ల నోరు, ఊపిరితిత్తులు, గొంతు, స్వరపేటిక కేన్సర్ల నుండి తప్పించుకోవచ్చునని డాక్టర్లు సలహా ఇస్తున్నారు. అయితే ప్రజ ల్లో దీనిపై అవగాహన పెంచేందుకు త్రికరణశుద్ధిగా ప్రయత్నాలు జరగడంలేదు. ఒక పక్క పొగాకు సాగును ప్రోత్సహిస్తూనే మరొకపక్క నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. మద్య పానంకూడా ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది. ప్రజా సంక్షేమమే తమలక్ష్యమని చెప్పుకునే పాలకపెద్దలు ఆప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ఇవేకాదు కల్తీకూడా ప్రజారోగ్యంపై తీవ్రప్రభావం చూపిస్తున్నది. ఇలాంటివి ఎన్నో ప్రజారోగ్యాన్ని పతనం అంచుకు తీసుకుపోతున్నాయి. పాలకులు ఇప్పటికైనా మనస్సుపెట్టి ఆలోచించాలి. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఆస్పత్రులను, సిబ్బందిని పెంచి వైద్యసదుపాయాలు అందించాల్సిన అవసరం ఉంది.

అదును తెలిసి వ్యవహరించడమంటే ఎంతో శ్రమను, సమయాన్ని, వ్యయాన్ని ఆదా చేయడమే.



ఆస్కార్‌వైల్డ్

ఉత్తముల్ని గౌరవించడం, సేవకుల్ని దయతల్చడం, శత్రువుల్ని క్షమించడం అభివృద్ధికి ఆధారాలు.



అబ్రహాంలింకన్

# చట్టం అందరికీ సమానమేనా?

**రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను వాడటం, 30 రోజుల జైలు జీవితం వంటి అసంబద్ధ చట్టాలను తీసుకురావాలనే ఆలోచన ప్రజాస్వామ్య మనుగడకు శ్రేయస్కరం కాదు. చట్టం తన పని తాను చేయాలి, కానీ అది ఏ ఒక్క పార్టీకో లేదా వర్గానికో కొమ్ముకాయకూడదు. రాజ్యాంగంలోని ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లో మార్పులు తెచ్చేటప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్రతను, వ్యక్తుల ప్రాథమిక హక్కులను రక్షించేలా ఉండాలి. తప్పుడు కేసులు పెట్టిన అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా జవాబుదారీతనం పెంచాలి. అప్పుడే దర్యాప్తు సంస్థల్లో పారదర్శకత వస్తుంది, ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థల మీద నమ్మకం కలుగుతుంది. నిర్దోషులకు న్యాయం జరగాలి, నిజమైన దోషులు చట్టం నుండి తప్పించుకోకూడదు. అదే అసలైన ప్రజాస్వామ్య చిహ్నం.**

నల్ల రవికుమార్

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశం'చట్టంముందు అందరూ సమానులే' అన్నసూత్రం. కానీ, వర్తమాన రాజకీయ ముఖచిత్రాన్ని నిశితంగా పరిశీలిస్తే, చట్టం అందరికీ సమానంగా వర్తిస్తోందా? లేక అధికార పీఠంపై ఉన్నవారికి అనుకూలంగా, ప్రతిపక్షంలో ఉన్న వారికి ప్రతిబంధకంగా మారుతోందా? అన్న సందేహం సామాన్యుడికి కలగక మానదు. ఇటీవలి కాలంలో సంచలనం సృష్టించిన లిక్కర్ కుంభకోణం వంటి కేసుల్లో సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పు కేవలం ఒక కేసు ముగింపు మాత్రమే కాదు, అది మన దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థల విశ్వసనీయతపై సంధించిన ఒక పదునైన అస్త్రం. సాక్ష్యాధారాలతో లేవని, కేవలం ఊహాగానాలతోనే కేసులు అల్లారని న్యాయమూర్తి కుండబద్ధలు కొట్టినప్పుడు, ఆ నెపం మోసి, జైలు గోడల మధ్య కాలాన్ని వెళ్లదీసి, రాజకీయంగా సర్వస్వం కోల్పోయిన నేతల జీవితాలకు జరిగిన నష్టానికి బాధ్యులెవరు? అనే ప్రశ్నఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ప్రకారం ప్రతి పౌరుడికి జీవించే హక్కువ్యక్తిగత స్వేచ్ఛ ఉన్నాయి. చట్టం నిర్దేశించిన పద్ధతిలో తప్ప, ఏ వ్యక్తి స్వేచ్ఛను హరించకూడదు. అయితే, ఈ ఆర్టికల్‌ను అడ్డంపెట్టుకుని,దర్యాప్తు సంస్థలు 'అరెస్ట్' అనే ఆయుధాన్ని రాజకీయ వ్యూహంగా వాడుకుంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇటువంటి ఫాల్స్ కేసులు నమోదు చేయడం ద్వారా ఓటర్ల ఆలోచనా దృక్పథాన్ని, తద్వారా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే ప్రమాదకర ధోరణి పెరుగుతోంది. ఒక బలమైన నాయకుడిని ఎన్నికల ప్రచారానికి దూరం చేయడం కోసం లేదా ప్రజాక్షేత్రంలో వారిని అవినీతిపరులుగా ముద్ర వేయడం కోసం నెలల తరబడి జైల్లో ఉంచడం అంటే అది కేవలం ఒక వ్యక్తికి జరుగుతున్న అన్యాయం కాదు, అది ప్రజల తీర్పునే అపహాస్యం చేయడం. ఉదాహరణకు, ఎన్నికలకు కేవలం ఆరు నెలలముందు ఒక కీలక నేతను అరెస్ట్ చేస్తే, విచారణ పూర్తయి అతను నిర్దోషి అని తేలేసరికి ఎన్నికలు ముగిసిపోతాయి, ప్రభుత్వం మారిపోతుంది. అంటే, ఇక్కడ 'విచారణే ఒక శిక్ష'గా మారిపోతోంది. తప్పుడు కేసుల ద్వారా ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చేయడం ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోయడంతో సమానం. ఈ గందరగోళంలో 30 రోజులు జైల్లో ఉంటే పదవి కోల్పోవాలి అనే చట్ట ప్రతిపాదన ప్రజాస్వామ్యానికి మరో గొడ్డలిపెట్టు. భారత న్యాయ సూత్రం ప్రకారం నేరం నిరూపితమయ్యేవరకు ప్రతి ఒక్కరూ నిర్దోషులే. కానీ,ఈ ప్రతిపాదన ఆప్రాథమిక సూత్రాన్నే తుంగలో తొక్కుతోంది. విచారణ పూర్తి కాకుండానే, శిక్ష పడకముందే ఒక వ్యక్తిని పదవికి అనర్హుడిని చేయడం



అంటే అది ప్రత్యర్థులపై రాజకీయ కక్ష సాధింపులకు రాజ మార్గం వేయడమే అవుతుంది. దర్యాప్తు సంస్థలు అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మలుగా మారినప్పుడు, ఎవరినైనానెల రోజులు బెయిల్ రాకుండా జైల్లో ఉంచడం పెద్ద కష్టమేమీ కాదు. ఇలాంటి చట్టం అమలులోకి వస్తే, దేశంలో రాజకీయ సుస్థిరత దెబ్బతింటుంది. ప్రత్యర్థుల పొలిటికల్ కెరీర్ను నాశనం చేయడానికి ఇది ఒక చట్టబద్ధమైన ఆయుధంగా మారుతుంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వపు హక్కు)కు పూర్తి విరుద్ధం. మరోవైపు, ఈ నాణేనికి మరో భయంకరమైన పార్శ్వం కూడా ఉంది. నిరాధారమైన కేసులు పెరిగిపోవడం వల్ల, నిజమైన నేరస్థులు కూడా దీనిని ఒక కవచంగా వాడుకుంటున్నారు. దర్యాప్తు సంస్థలు తమపై కూడా తప్పుడు కేసులే పెట్టాయని ప్రజల్లో నమ్మించి, విచారణాధికారులను బెదిరించడం, దర్యాప్తును నీరుగార్చడం వంటివి చేస్తున్నారు. వ్యవస్థల విశ్వసనీయత తగ్గినప్పుడు, నిజమైన అవినీతిపరులు కూడా బాధిత ముద్ర వేసుకుని ప్రజల్లో సానుభూతి పొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది దర్యాప్తు సంస్థల సామర్థ్యాన్ని నీరుగార్చడమే కాకుండా, నిజమైన దోషులు చట్టం నుండి తప్పించుకోవడానికి మార్గం సుగమం చేస్తోంది. దర్యాప్తు అధికారుల మీద కేసులు ఫైల్ చేయాలని కోర్టు ఆదేశించాల్సి వస్తుందంటేనే, వ్యవస్థ ఎంతటి సంక్షోభంలో ఉందో అర్థమవుతోంది. ఇందులో మీడియా పాత్ర కూడా ఇక్కడ విమర్శల పాలవుతోంది. సంచలనం కోసం దర్యాప్తు సంస్థలు ఇచ్చే అరకొర సమాచారాన్ని పరమ సత్యంగా ప్రసారం చేయడం వల్ల ప్రజాస్వామ్య పౌరులైన ప్రజల్లో ఉదాసీనత పెరుగుతోంది. ఒక వ్యక్తి అరెస్ట్ అయినప్పుడు గంటల తరబడి చర్చలు నిర్వహించే మీడియా, అదే వ్యక్తి నిర్దోషిగా విడుదలైనప్పుడు ఒక చిన్న స్క్రోలింగ్తో సరిపెడుతోంది. దీనివల్ల నిందితులకు జరిగే క్యారెక్టర్ అస్సాసినేషన్ అంతా ఇంతా కాదు. రాజకీయ నాయకులపై కేసులు అంటే అది వారి వ్యక్తిగత విషయమని సామాన్య పౌరులు భావిస్తుండటం ప్రమాదకరం. వ్యవస్థలు నిర్వీర్యమైతే, చట్టం తన దారిని తప్పుతుంటే అది రేపు సామాన్యుడి గడప వరకు రాదని గ్యారెంటీ లేదు. నిర్దోషిత్వం నిరూపించుకున్న నాయకుల కన్నీళ్లు వ్యవస్థలోని లోపాలను వేలెత్తి చూపుతున్నాయి. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను వాడటం, 30 రోజుల జైలు జీవితం వంటి అసంబద్ధ చట్టాలను తీసుకురావాలనే ఆలోచన ప్రజాస్వామ్య మనుగడకు శ్రేయస్కరం కాదు. చట్టం తన పని తాను చేయాలి, కానీ అది ఏ ఒక్క పార్టీకో లేదా వర్గానికో కొమ్ముకాయకూడదు. రాజ్యాంగంలోని ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 లో మార్పులు తెచ్చేటప్పుడు న్యాయవ్యవస్థ స్వతంత్రతను, వ్యక్తుల ప్రాథమిక హక్కులను రక్షించేలా ఉండాలి. తప్పుడు కేసులు పెట్టిన అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా జవాబుదారీతనం పెంచాలి. అప్పుడే దర్యాప్తు సంస్థల్లో పారదర్శకత వస్తుంది, ప్రజలకు ప్రజాస్వామ్య వ్యవస్థల మీద నమ్మకం కలుగుతుంది. నిర్దోషులకు న్యాయం జరగాలి, నిజమైన దోషులు చట్టం నుండి తప్పించుకోకూడదు. అదే అసలైన ప్రజాస్వామ్య చిహ్నం. ●

# హైటెక్ అడుగులతో వ్యవసాయానికి స్వర్ణ యుగం

తిప్పర్తి శ్రీనివాస్

దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా నిలిచిన వ్యవసాయ రంగం ప్రస్తుతం అనేక సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం, భూసారహ్రాసం, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, మార్కెట్ అనిశ్చితి వంటి సమస్యలు రైతు జీవితాన్ని క్లిష్టతరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ హైటెక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆమోదించే దిశగా అడుగులు వేయడం సమయానుకూలమైన, దూరదృష్టితో కూడిన నిర్ణయంగా భావించాలి. ఆధునిక సాంకేతికతను వ్యవసాయంలో సమర్థవంతంగా వినియోగించడం ద్వారా రైతు ఆదాయం పెంపు, దిగుబడి వృద్ధి, వనరుల సంరక్షణ వంటి లక్ష్యాలు సాధ్యమవుతాయి. ఇప్పటి ప్రపంచంలో వ్యవసాయం కేవలం సంప్రదాయ పద్ధతులకే పరిమితం కావడం సాధ్యం కాదు. ప్రపంచవ్యాప్తంగా డేటా ఆధారిత వ్యవసాయం, ఖచ్చితత్వ వ్యవసాయం, డ్రోన్లు, ఉపగ్రహ చిత్రాలు, సెన్సార్లు, కృత్రిమ మేధస్సు వంటి సాంకేతిక పరిజ్ఞానాలు విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. ఇవి పంటల ఆరోగ్య పరిస్థితిని, నేలలోని పోషక స్థాయిలను, నీటి అవసరాన్ని ముందుగానే అంచనా వేసి రైతులకు సరైన సూచనలు అందించగలవు. ఈ విధంగా పంటలపై వచ్చే ఒత్తిడి, వ్యాధులు, నీటికొరత వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుంది. ఉపగ్రహ సాంకేతికత డ్రోన్ సర్వేలు ద్వారా పంటల స్థితిగతులను సున్నిత స్థాయిలో గమనించడం ఒక విప్లవాత్మక మార్పుగా నిలవవచ్చు. పంటలో చిన్న మార్పులు వచ్చినా వాటిని గుర్తించి రైతులకు హెచ్చరికలు అందించడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు. అంతేకాకుండా నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించడం, ఎరువుల వినియోగాన్ని ఖచ్చితంగా అంచనా వేయడం ద్వారా ఖర్చులు తగ్గుతాయి. ఇది రైతు లాభదాయకతను పెంచడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుంది. అయితే సాంకేతికత ప్రవేశపెట్టడమే సరిపోదు. దాని అమలు సక్రమంగా జరగాలి. ముఖ్యంగా మన దేశంలో చిన్న సన్నకారు రైతులే ఎక్కువ. వారికి అధునాతన పరికరాలు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. సబ్సిడీలు, సమూహ ఆధారిత వినియోగ విధానాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పరికరాల పంచుకునే విధానం వంటి చర్యలు తీసుకోవాలి. లేకపోతే సాంకేతికత పెద్ద రైతులకు మాత్రమే పరిమితమై అసమానతలను పెంచే ప్రమాదం ఉంది. సాంకేతిక పరిజ్ఞానం రైతుకు సహాయకురాలిగా మారాలంటే శిక్షణ అత్యవసరం. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వ్యవసాయ విస్తరణాధికారులకు సాంకేతిక శిక్షణ ఇవ్వడం, రైతులకు సులభమైన భాషలో మార్గదర్శకాలు అందించడం అవసరం. డిజిటల్ వేదికల ద్వారా మొబైల్ యాప్‌లు, సందేశ సేవలు, కాల్ సెంటర్లు వంటి సౌకర్యాల ద్వారా రైతులకు సమయానుకూల సమాచారం అందించాలి. మార్కెట్ అనుసంధానం కూడా హైటెక్ వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తుంది. పంటల ధరల సమాచారం, డిమాండ్ అంచనాలు, నిల్వ సదుపాయాల వివరాలు వంటి అంశాలను డిజిటల్ ప్లాట్ ఫారమ్‌ల ద్వారా రైతులకు అందిస్తే వారు సరైన నిర్ణయాలు తీసుకోవచ్చు. ముందస్తు ఒప్పంద వ్యవసాయం, నేరుగా వినియోగదారులకు విక్రయం వంటి అవకాశాలు విస్తరిస్తాయి. డేటా ఆధారిత వ్యవసాయం రైతుకు పంట ఎంపికలో, సాగు కాల నిర్ణయంలో, మార్కెట్ ఎంపికలో కీలకంగా మారుతుంది. అదే విధంగా డేటాభద్రత గోప్యత అంశాలను విస్మరించరాదు. రైతుల భూమి, పంటల వివరాలు వంటి సమాచారాన్ని రక్షించేందుకు స్పష్టమైన విధానాలుఉండాలి. సాంకేతికత వినియోగం పారదర్శకంగా ఉండి రైతు ప్రయోజనాలను కాపాడాలి. ప్రభుత్వ పర్యవేక్షణతో పాటు నిపుణుల సూచనల ఆధారంగా వ్యవస్థలు రూపొందించాలి. వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో క్లైమేట్ స్మార్ట్ వ్యవసాయం అత్యవసరం. మట్టి ఆరోగ్య పటాలు, వర్షపాతం అంచనాలు, నీటి నిర్వహణ సాంకేతికతలు రైతులకు రక్షణ కవచంలా నిలుస్తాయి. దీర్ఘకాలికంగా చూస్తే ఇది ఆహార భద్రతకు బలమైన ఆధారంగా నిలుస్తుంది. మొత్తం మీద వ్యవసాయ శాఖ హైటెక్ దిశగా అడుగులు వేయడం శుభ సూచకం. అయితే ఇది కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, నేలమీద స్పష్టమైన ఫలితాలుగా మారాలి. రైతు ఆదాయం పెరగడం, వ్యయాలు తగ్గడం, పంట నష్టాలు తగ్గడం వంటి స్పష్టమైన ప్రయోజనాలు కనబడితేనే ఈ ప్రయత్నం సార్థకమవుతుంది. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, నిపుణులు, రైతులు కలిసికట్టుగా కృషి చేస్తేనే సాంకేతికత నిజమైన మార్పుకు దోహదపడుతుంది. హైటెక్ వ్యవసాయం ఒక ఆశాకిరణం. సరైన ప్రణాళిక, సమర్థ అమలు, సమగ్ర భాగస్వామ్యంతో ఇది రైతు జీవితాన్ని స్థిరత్వం వైపు నడిపించగలదు. వ్యవసాయం లాభదాయకంగా, సుస్థిరంగా మారే దిశగా ఈ మార్పు ఒక కీలక మైలురాయిగా నిలవాలని ఆకాంక్షిద్దాం. ●

# యుద్ధోన్మాది అమెరికా ప్రపంచ ప్రజల శత్రువు!

బొల్లిముంతసాంబశివరావు

సామ్రాజ్యవాద రక్తపిపాసి అమెరికా మరోసారి ఇరాన్పై విరుచుకుపడింది. తనపెంపుడు బిడ్డ ఇజ్రాయిల్తో కలిసి ఇరాన్లోని అనేకప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్సుప్రీమ్నాయకుడు అలీఖమేని హత్యచేసింది. ఇంకా అనేక మంది ఇరాన్ నాయకులు, వందలాది మంది ప్రజలు అమెరికా దాడిలో మరణించారు. 140మంది చిన్నపిల్లలను బాంబులతో చంపివేసింది. ఇజ్రాయిల్, అమెరికా నిరంతరం బాంబుల వర్షం కురిపిస్తూ మారణకాండ సాగిస్తున్నది. ఆధునిక కాలంలో యుద్ధాలకు మూలం సామ్రాజ్యవాదమే. సామ్రాజ్యవాదుల మోసపూరితమైన శాంతిపంథానూ, దురాక్రమణ పూరితమైన యుద్ధాలను రెండుచేతులా ఉపయోగిస్తారు. తాము జరిపిన దురాక్రమణ యుద్ధాలనూ, యుద్ధ ప్రయత్నాలను శాంతివచనాల ముసుగుతో కప్పిపెట్టుకో ప్రయత్నిస్తారని లెనిన్మహాశయుడు అన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. సామ్రాజ్యవాద ప్రభుత్వాలు శాంతి గురించి కబుర్లు చెబుతాయి. వాస్తవంలో ఆక్రమణ యుద్ధాలను, బందిపోటు దండయాత్రలను కొనసాగిస్తాయి. సాత్విక వాదాన్ని ప్రచారం చేయడంలో ఒకేఒక్క ఆశయమున్నది. శాంతిని గురించి వాగాడంబరంతో ప్రజలను మోసగించడం దానిచాటున మరో కొత్తయుద్ధానికి సన్నాహాలు చేయడం, ఇదే సామ్రాజ్యవాద ఆవశ్యమని వివరించారు స్టాలిన్. లెనిన్,స్టాలిన్చెప్పిన మాటలు నేడు అమెరికా సామ్రాజ్య వాదానికి వర్తిస్తాయి. అది చేసిన దురాక్రమణ యుద్ధాలకు, సైనిక జోక్యాలకు కమ్యూనిజం, టెర్రరిజం వల్ల ప్రపంచ శాంతికి ప్రమాదం ఏర్పడుతుందని, శాంతి ఏర్పడాలంటే వాటిపై దాడిచేయాలని అమెరికా చెబుతూ తన దురాక్రమణ విధానాలను సమర్థించుకుంటున్నది. ఇరాన్‌పై దాడికి ఇలాంటి శాంతిజపాన్నే వల్లిస్తూ ఉన్నది. ఇరాన్ యురేనియం శుద్ధి పెద్దఎత్తున కొనసాగిస్తూ అణ్వాయుధాల తయారీకి సిద్ధమౌతున్నదని, పెద్దఎత్తున మిస్సైల్స్ ఉత్పత్తి చేసిందని ఇది ప్రపంచానికి ముఖ్యంగా అమెరికా రక్షణకు చాలాప్రమాదమని అందుకే ఇరాన్ యురేనియం శుద్ధికార్య క్రమాన్ని ఆపివేయాలని లేని వెడల దానిపై ఆంక్షలు విధిస్తామని అవసరమైతే దాడికూడా చేస్తామని అమెరికా బెదిరింపులు ప్రారంభించింది. ఇరాన్ విధానాల వల్ల పశ్చిమాసియాకి ప్రమాదమని ముఖ్యంగా తనపెంపుడు బిడ్డ ఇజ్రాయెల్‌కు ప్రమాదమని అమెరికా భావిస్తున్నది. అందుకే ఇరాన్‌ను తన చెప్పు చేతుల్లో ఉంచుకునేందుకు అవసరమైన విధానాలు అమలు జరుపుతున్నది. ఇరాన్‌లో సహజ వనరులు అనేకం ఉన్నాయి. ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఇంధన వనరులు కలిగిన దేశం. ప్రపంచంలో 3వ అతిపెద్ద సహజ వనరుల నిల్వలను 2వ అతిపెద్ద సహజవాయువు నిల్వలు కలిగి ఉంది. బొగ్గు, రాగి, సీసం, యురేనియం వంటి ఖనిజ సంపద పుష్కలంగా ఉన్న దేశం. ఇవికాక కుంకుమ పువ్వు, పిస్తా వంటి వ్యవసాయ ఉత్పత్తులలో కూడా అగ్ర స్థానంలో ఉంది. ఇరాన్‌లో 208.6మిలియన్ల చమురు నిల్వలు ఇతర ఖనిజాలు, సుమారు 2కోట్ల, 20లక్షల టన్నుల స్వచ్ఛమైన బంగారంఉన్నాయి. వీటి విలువ27.30 ట్రిలియన్ డాలర్లు. ఇరాన్ విస్తారమైన సహజ వనరులను తన అవసరాలకు



వినియోగించుకునే విధానాలు అమలు జరిపేలా ఆ దేశపాలకులను అమెరికా ప్రభావితం చేసింది. అమెరికా మద్దతుతో కొనసాగిన షామొహమ్మద్రెజాపహ్లావి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటుకి షానిరంకుశపాలన, అమెరికా అనుకూల విధానాలు, తీవ్ర ఆర్థిక అసమానతలు, ఇస్లామిక్ సంప్రదాయాలను విస్మరించడం, అవినీతి, సామాజిక అణచివేత కారణాలుగా ఉన్నాయి. చమురు కార్మికులు సమ్మెలు చేశారు. ప్రవాసంలో ఉన్న ఖోమేని షా పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపర్చాడు. ప్రజల తిరుగుబాటుతో షా ప్రభుత్వం కూలిపోయింది. 1979 ఇరాన్ విప్లవం తర్వాత అమెరికా దోపిడీ ప్రయోజనాలకు ఆటంకం ఏర్పడింది. ఫలితంగా ఇరాన్ పట్ల అమెరికా శత్రుత్వ వైఖరి చేపట్టింది. రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఇరాన్ అణుశుద్ధి కార్యక్రమం మధ్యప్రాచ్యంలో ప్రభావం చూపింది. తనపెంపు బిడ్డ ఇజ్రాయెల్‌కు, తన ప్రయోజనాలకు ఇరాన్ ఆటంకంగా ఉందని అమెరికా భావించింది. దానిపై దాడి చేయడానికి ఉగ్రవాదానికి ఇరాన్ మద్దతు ఇస్తుందనే ప్రచారం అమెరికా ప్రారంభించింది. 1985 నుంచి ఇజ్రాయెల్‌ను ఇరాన్‌పై ఘర్షణకు సిద్ధమైంది. 2018లోసంయుక్త సమగ్ర కార్యాచరణ ప్రణాళిక నుండి వైదొలిగిన అమెరికా, ఇరాన్‌పై అనేక ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు ఇరాన్ ఆర్థికవ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఇరానియని యాల కరెన్సీ విలువ గణనీయంగా తగ్గింది. ఇరాన్‌తో వ్యాపా రంచేసే అనేక అంతర్జాతీయ బ్యాంకులు భారీ జరిమానాలు చెల్లించాయి. అన్ని ప్రధాన యూరోపియన్ కంపెనీలు అమెరికాకు భయపడి ఇరాన్‌తో వ్యాపారం మానివేశాయి. ఫలితంగా ఆర్థికంగా ఇరాన్‌బాగా దెబ్బతిన్నది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్, రష్యా, చైనాలతో అనేక ఒప్పం దాలు చేసుకుంది. 2025 జనవరిలో రష్యాతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేయగా, చైనాతో 2021లో25 సంవత్సరాల సహకార ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందాలు సైనిక, ఆర్థికసహకారానికి పెంచుకోవడానికి ఇరాన్‌కు తోడ్పడ్డాయి. రష్యాప్రధానంగా ఇరాన్‌కు ఆయుధ సరఫరాదారుగా ఉంది. చైనాతో కుదిరిన 25 ఏళ్ల సమగ్ర సహకార ఒప్పందం ద్వారా చైనానుంచి ఇరాన్ ఇంధన రంగానికిభారీగా నిధులు పొందింది. చైనా, రష్యా, ఇరాన్, ఉత్తరకొరియా దేశాలు, పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆధిపత్యాన్ని ముఖ్యంగా అమెరికా ఆంక్షలను సవాలు చేయడానికి ఒకభౌగోళిక, రాజకీయ కూటమిగా ఏర్పడ్డాయి. ఈ ఒప్పందాలవల్ల షాంఘై సహకార సంస్థ బ్రిక్స్ద్వారా సహకారాన్నిపొందుతున్నాయి. రష్యా, చైనాలతో ఒప్పందాలు తనప్రపంచ ఆధిపత్య విధానాలకు ప్రమాదంగా అమెరికా భావించింది. తన ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా ఉన్న ఇరాన్‌ను దెబ్బతీయడానికి ఆ దేశంపై దాడులు ప్రారంభించింది. 2003లో, 2024లో, 2025లో ఇరాన్‌పై దాడులు చేసింది. వెనిజులాపై దాడి తర్వాత ఇరాన్‌ను అమెరికా లక్ష్యంగా చేసుకుంది. దానిపై దాడి చేయడానికి కుంటిసాకులు ప్రచారంచేయడం ప్రారంభించింది. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తున్నదని దానివల్ల ప్రపంచానికి, అమెరికాకు ప్రమాదమని పేర్కొంది. యురేనియంశుద్ధిని, అణ్వాయుధాల తయారీని మానుకోవాలని అందుకుచర్చలకు రావాలని, చర్చలకురాకపోతే ఇరాన్‌పై దాడిచేస్తామని బెది రించింది. ఇరాన్ చర్చలకు ఆమోదం తెలిపింది. రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయి. జెనీవాలో రెండవ రౌండ్‌చర్చల జరగాల్సిఉంది. ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణదాడిని ప్రపంచ ప్రజలూ ఖండించి దానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి. ●

# ప్రజావాక్కు



### సైబర్ నేరాలను అరికట్టాలి

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రజలు తమ కష్టార్జితాన్ని పొదుపు రూపంలో దాచుకుంటారు. అయితే సైబర్ నేరగాళ్లు ప్రజలకు తెలియకుండానే ఈసొమ్మును దొంగిలిస్తున్నారు. ఇలాంటిమోసాలకు గురైన బాధితులు పోలీసులకు, బ్యాంకులకు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదులు చేసినా అవి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగించే విషయం. బ్యాంకులు తమ నిస్సహాయతను వ్యక్తంచేస్తూ, పోగొట్టుకున్న లేదా స్తంభింపజేసిన సొమ్మును తిరిగి పొందడం కేవలం సైబర్ సెక్యూరిటీ సిబ్బంది ద్వారానే సాధ్యమని చెబుతున్నాయి. దీనివల్ల సామాన్య ప్రజలు తమ సొంత డబ్బు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిఏర్పడుతోంది. అధికారులు సకాలంలో స్పందించి, సాంకేతికతనుఉపయోగించిబాధితులు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి వచ్చేలాచేయాలి. అప్పుడే ప్రజలకు బ్యాంకింగ్ వ్యవస్థపై, చట్టంపై నమ్మకం కలుగుతుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### టూరిజాన్ని అభివృద్ధి చేయాలి

మన దేశంలో కొన్ని రకాల పర్యాటక రంగాలున్నాయి. అందులో ఒకటి విమాన రంగం. పూర్వం బేగంపేట విమానాశ్రయంలో వచ్చేపోయే విమానాలను చూడటానికి పల్లెటూర్ల నుండి పనిమీద బంధువుల ఇంటికి హైద్రాబాద్ వచ్చినవారుటికెట్టుకొని పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మిద్దెమీద ప్రదేశానికి వెళ్ళి చూసేవారు. ఇదే మాదిరిగా రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో కూడా పర్యాటకులకు ఇటువంటి సదుపాయాన్ని తక్కువ ధర అంటే 50రూపాయలలోపు ప్రవేశ రుసుమును నిర్ణయించాలి. ఈపర్యాటక సదుపాయం కల్పిస్తే చూసేవారికి కనువిందు, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

- ఎన్. లక్ష్మి, సికింద్రాబాద్

### షరా మామూలే

ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి రావాలని ముందు వెనుక ఆలోచించకుండాసాధ్యాసాధ్యాలను పరిశీలించకుండా హామీల వర్షం కురిపేస్తుంటారు పార్టీలకు చెందిన నాయకులు. అధికారంలోకివచ్చాకహామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుంటారు. అయితే ఒకరుమోసం చేసినా మరొకరు మంచి చేయకపోతారా అనే ఆశతో ప్రభుత్వాలను మారుస్తుంటారు.

- ఎమ్.శర్మ, హైదరాబాద్

### వైద్య కళాశాలల విస్తరణ అవసరం

వైద్య విద్యను, ఆరోగ్య సేవలను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ప్రభుత్వ వైద్య కళాశాలల విస్తరణ అవసరంగా మారింది. ప్రస్తుతం లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రైవేటు వైద్య కళాశాలలసంఖ్య ప్రభుత్వ కళాశాలల కంటే ఎక్కువగా ఉంది. ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 18 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే, తెలంగాణలో ఇటీవల 8 కొత్త కళాశాలలు మంజూరు కావడంతో ప్రభుత్వ కళాశాలల సంఖ్య 34కిపెరిగింది. అయినప్పటికీ విద్యార్థుల పెరుగుతున్న డిమాండ్‌కి, జనాభాకు తగిన వైద్యులనిష్పత్తి దృష్ట్యా ఈ సంఖ్య పరిమితంగా ఉంది. అధిక శాతం వైద్య సీట్లు ప్రైవేట్ లేదా మేనేజ్‌మెంట్‌కోటాలో ఉండటంవల్ల మెరిట్ ఉన్నప్పటికీ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ఎంబీబీఎస్ సీటు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- సి.సాయిరుత్విక్, నల్గొండ

### నిధుల కొరత

**వాతావరణ** మార్పులు గ్లోబల్ పాలనను పునర్నిర్వచిస్తున్న ఈ దశలో, కాప్30లోభారత్ ప్రకటించిన వైఖరి ఒక ప్రతిస్పందన మాత్రమేకాదు, అదివాతావరణ న్యాయం, సమానత్వం, చారిత్రక బాధ్యతలపై ఆధారపడిన ఒక సుస్థిరదృక్కోణం. ప్యారిస్ ఒప్పందానికి పునాది అయిన సాధారణ కానీ విభిన్న బాధ్యతలు సూత్రం, సర్వదేశాలకుఒకేరకం బాధ్యతలను పెట్టడం అసంబద్ధమని స్పష్టంగా చెబుతుంది. పారిశ్రామికీకరణ ద్వారా శతాబ్దాలుగా అధిక ఉద్గారాలు విడుదల చేసిన అభివృద్ధి చెందిన దేశాలు తమ పాత్రను సక్రమంగా నిర్వర్తించకపోవడం, కానీ అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలపై కఠిన బాధ్యతలను మోపాలని, వాతావరణ చర్చల్లో ఏర్పడుతున్న అసమతౌల్యాన్ని బహిర్గతం చేస్తుంది.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

### నిప్పులేనిదే పొగ రాదు

**నేపాల్‌లో** బంగ్లాలో శ్రీలంకలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు ప్రధాని రాజీనామా దాకా తీసుకొచ్చారు. నిప్పులేనిదే పొగరాదు అన్నట్టు ప్రభుత్వం అనుసరించిన అవినీతి విధానాలు ఒకవైపు వలసీకరణ ఒకవైపు విద్యార్థుల ఉద్యమం ఒకవైపు ఈ జెన్ జీ ఉద్యమాన్ని ఫలవంతం చేసాయి. అయితే ప్రజా పోరాట విస్ఫోటనం తరవాత కొన్ని రాజ్యాలు లేక దేశాలు వెనుకబడిపోయాయి .

-భారత అవినాష్,జనగామ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జల్‌జీవన్ మిషన్ రెండేళ్లు పొడిగింపు



## అదనంగా రూ.1.15 లక్షల కోట్లు కేంద్ర ఆర్థిక సాయం

### రూ.4,474కోట్లతో 2 మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులు

### రూ.3,839 కోట్లతో బద్నావర్- తిమర్వాణి ఎన్‌హెచ్ విస్తరణ

### మదురై ఎయిర్‌పోర్టు ఇక అంతర్జాతీయ విమానాశ్రయం

### కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు: మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, మార్చి 10:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ గడువును 2028 వరకు పొడిగిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందు కోసం రూ.1.51 లక్షల కోట్లు అదనంగా కేంద్రం సాయం అందించనుంది. ఈ మేరకు జల్ శక్తి మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.4,474 కోట్లతో పశ్చిమబెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని రెండు మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులను చేపట్టాలన్న ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు 192 కిలోమీటర్ల మేర అంటే సైంథియా- పకూర్, సంత్రాగాచి -ఖరగ్ పూర్ మార్గాలలో నాల్గవ లైన్ నిర్మించనున్నారు. ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌లో భాగంగా బద్నావర్- పెట్లావాడ్- థాండ్లా- తిమర్వాణి సెక్షన్ జాతీయ రహదారిని నాలుగు వరుసలు (గ్రీన్‌ఫీల్డ్ కారిడార్)గా అభివృద్ధి చేయడానికి రూ. 3,839.42 కోట్లతో ఎన్‌హెచ్ఎఐ రూపొందించిన ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ జాతీయ రహదారిని హైబ్రిడ్ అన్యుటీ మోడ్‌లో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ కారిడార్ అభివృద్ధి చేయడంతో ఉజ్జయిని-తిమర్వాణి ఇంటర్‌చేంజ్ కనెక్టివిటీకి దోహదపడనుంది. అలాగే ఢిల్లీ- ముంబై ఎక్స్‌ప్రెస్‌లోని ఢిల్లీ - ఫరీదాబాద్- బల్లాభ్‌ఘర్-సోహ్నాపూర్ నుంచి జెవార్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ నిర్మాణానికి రూ.3,630.77 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తమిళనాడులోని మదురై ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించాలన్న ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. మదురై విమానాశ్రయం తమిళనాడులోని పురాతన విమానాశ్రయాలలో ఒకటి. ఇది దక్షిణ తమిళనాడుకు కీలకమైన ప్రవేశ ద్వారంగా పనిచేస్తుంది. పర్యాటకం, తీర్థయాత్రలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది, తద్వారా ఈ ప్రాంతం వృద్ధికి దోహదపడుతుంది. మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ హోదాకు పెంచడంవల్ల ప్రాంతీయ కనెక్టివిటీ పెరుగుతుంది, వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ ప్రాంతంలో ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. అంతర్జాతీయ యాత్రికులు, వ్యాపారాలను ఆకర్షించేవిధంగా విమానాశ్రయం సామర్థ్యంగానూ చారిత్రక ప్రాముఖ్యతకు అనుగుణంగా ఉంటుంది.

# వంటగ్యాస్ కోసం బారులు తీరిన కస్టమర్లు



**న్యూఢిల్లీ, మార్చి 10:** డిమాండ్ స్వల్పంగా పెరిగినా, సరఫరా గొలుసులు బిగుసుకుపోయినా మార్కెట్లు స్పష్టమైన ఒత్తిడితో స్పందిస్తాయి. ప్రస్తుతం ఇరాన్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్) సహా అనేక పట్టణాలు, నగరాల్లోని ఎల్పీజీ ఏజెన్సీల బయట ఆ ఒత్తిడి కనిపిస్తున్నది. నోయిడాలోని సెక్టార్ 22లో ఓ భారత్ గ్యాస్ ఏజెన్సీ వెలుపల ఖాళీ సిలిండర్లు పట్టుకుని పెద్ద సంఖ్యలో ప్రజలు బారులు తీరి నిలబడి ఉన్న దృశ్యాలు సోమవారం ఉదయం కనిపించాయి. అదే విధంగా ఉత్తర ప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలోని బిస్వాన్ గ్రామంలో ఓ గ్యాస్ ఏజెన్సీ బయట వందలాది మంది ప్రజలు ఖాళీ సిలిండర్లతో నిలుచున్న దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎల్పీజీ సిలిండర్ల కోసం కొన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు గ్యాస్ ఏజెన్సీల వెలుపల బారులుతీరి నిలబడుతున్నట్లు వార్తలు వస్తుండగా దేశంలో ఎక్కడా ఎల్పీజీ సంక్షోభం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇరాన్ యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడినట్టు వస్తున్న వార్తలతో ప్రజల్లో ఏర్పడిన భయాందోళనలను సొమ్ము చేసుకునేందుకు కొందరు గ్యాస్ సరఫరాదారులు కృత్రిమ కొరతను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. గ్యాస్ ఏజెన్సీలో స్టాక్ లేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో రూ. 1,500 ఇచ్చి ఎల్పీజీ సిలిండర్ కొనవలసి వచ్చిందని ఉత్తరప్రదేశ్‌లోని ఓ చిన్న పట్టణానికి చెందిన మహిళ ఒకరు తెలిపారు. రంజాన్ మాసం కావడంతో ఎల్పీజీ అత్యవసరమని ప్రతాప్‌గఢ్ జిల్లాకు చెందిన ఆ గృహిణి చెప్పారు. గత నాలుగైదు రోజులుగా ప్రజలు భయాందోళనతో ఎల్పీజీని కొనుగోలు చేస్తున్నట్లు దక్షిణ ఢిల్లీలోని ఇండేన్ గ్యాస్‌కు చెందిన సిలిండర్ డెలివరీ ఉద్యోగి ఒకరు చెప్పారు. గతవారం ఎల్పీజీ సిలిండర్ ధరను పెంచిన కేంద్రం సిలిండర్ రీబుకింగ్ నిబంధనలను కఠినతరం చేసింది. ఎల్పీజీ సిలిండర్లపై ఆంక్షలు పెంచిన దరిమిలా హైదరాబాద్, రాంచీ, కోల్‌కతా, గోవా తదితర నగరాల్లో కూడా ఎల్పీజీ కోసం ప్రజలు బారులు తీరుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వంటగ్యాస్ అక్రమ నిల్వను నిరోధించి అందరికీ సమానంగా పంపిణీ జరిగే లక్ష్యంతో ఎల్పీజీ సిలిండర్ కనీస వెయిటింగ్ కాలాన్ని 21 రోజుల నుంచి 25 రోజులకు ప్రభుత్వం పెంచినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రెండు సిలిండర్లు ఉన్న వారికైతే లాక్ ఇన్ పీరియడ్‌ను 30 రోజులకు పెంచింది.

ప్రపంచ ముడి చమురు బ్యారెల్ ధర 130 డాలర్ల దాటేంతవరకు దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు నిలకడగా ఉంటాయని వర్గాలు చెప్పాయి. బ్యారెల్ చమురు ధర 100 డాలర్ల సమీపంలో స్థిరపడవచ్చని ప్రస్తుత అంచనాలు సూచిస్తున్నట్లు పేర్కొన్నాయి. దేశంలో ఏ పెట్రోల్ పంపు వద్ద పెట్రోల్, డీజిల్ కొరత లేదని, సరఫరా కూడా సజావుగా సాగుతున్నదని తెలిపాయి. ముడి చమురు సరఫరాకు అంతరాయాన్ని నివారించేందుకు హార్ముజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాలపై కేంద్రం దృష్టి కేంద్రీకరించినట్లు వివరించాయి.

### వాణిజ్యసిలిండర్ల కొరతతో హోటల్ పరిశ్రమకు ముప్పు

### ప్రధాన నగరాల్లో తాత్కాలిక మూసివేత

దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికి పలు ప్రాంతాల్లో ఇంధన కొరత ఆందోళన కలిగిస్తున్నది. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా ముంబైలో 20 శాతం హోటళ్లు, రెస్టారెంట్‌లు మూతపడ్డాయి. ఈ విషయాన్ని ముంబై హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ మంగళవారం వెల్లడించింది. పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే రాబోయే రెండు రోజుల్లో నగరంలోని సగం హోటళ్లు మూతపడతాయని పేర్కొన్నది. ముంబై మాత్రమే కాదు, గత రెండు రోజులుగా దేశంలోని పలు ప్రధాన నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత ఏర్పడింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై నగరాల్లో ఇప్పటికే కొన్ని హోటళ్లలో వంటగ్యాస్ అందుబాటులో లేక తాత్కాలికంగా మూసివేస్తున్నారు. సిలిండర్ల కొరతవల్ల తమ వ్యాపారం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఒక్కో వాణిజ్య సిలిండర్‌ను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బ్లాక్ విక్రయాలను అరికట్టేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఎల్పీజీ సిలిండర్ బుకింగ్ వ్యవధిని ప్రస్తుతం ఉన్న 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. ఇక వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వ శాఖ ఓ కమిటీని వేసింది. మన దేశంలో ఏటా 31.3 మిలియన్ టన్నుల వంటగ్యాస్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో 62 శాతం దిగుమతుల నుంచి వచ్చేదే. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో ఈ దిగుమతులపై ప్రభావం పడింది. అయితే ప్రస్తుతం మన వద్ద సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులోనే ఉన్నాయని కేంద్రం వెల్లడించింది.

# యూరోప్ దేశాలను కలవరపరిచిన ఖగోళ అగ్నిగోళం

**ప్యారిస్, మార్చి 10:** యూరప్‌లోని పలు దేశాల ప్రజలను మార్చి 8వ తేదీ సాయంత్రం ఒక అద్భుత దృశ్యం ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఆకాశంలో అత్యంత కాంతివంతమైన అగ్నిగోళం ఒకటి వేగంగా ప్రయాణిస్తూ కనిపించింది. దాదాపు ఆరు సెకన్ల పాటు వెలుగులు చిమ్ముతూ ప్రయాణించిన ఈ అగ్నిగోళం చివరకు గాలిలోనే ముక్కలై భూమిపై పడింది. బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో ఇది స్పష్టంగా కనిపించింది. శాస్త్రవేత్తల ప్రాథమిక అంచనా ప్రకారం ఇది కొన్ని మీటర్ల వ్యాసం కలిగి ఉంది. జర్మనీలోని కోబ్లెంజ్ ప్రాంతంలో దీని శకలాలు పడ్డాయి. ఒక ఇంటి కప్పును చీల్చుకుంటూ సుమారు ఫుట్‌బాల్ పరిమాణంలో ఉన్న రాయి లోపలికి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. గాలిలోనే పేలిపోవడంతో భూమిపైకి వచ్చేసరికి చిన్న చిన్న ముక్కలుగా మారిపోయిందని నిపుణులు చెబుతున్నారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (యుఎస్ఎ), ఇతర పరిశోధనా సంస్థలు ఈ అగ్నిగోళం ప్రయాణించిన మార్గాన్ని విశ్లేషిస్తున్నాయి. ఇది ఉల్క కావచ్చని పలువురు భావిస్తున్నారు. ఇవి సాధారణంగా ప్రతి కొన్ని వారాలకు ఒకసారి భూ వాతావరణంలోకి వస్తుంటాయని, అయితే ఇంత ప్రకాశవంతంగా కనిపించడం అరుదని వారు పేర్కొంటున్నారు. సూర్యాస్తమయం సమయంలో వెలుతురు ఎక్కువగా ఉన్న దిశ నుంచి ఇది రావడంతో భూమిపై ఉండే టెలిస్కోపులు దీనిని ముందుగా గుర్తించలేకపోయాయని సమాచారం.

# ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, మార్చి 10:** ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లలో క్రిమీలేయర్ విధానం అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ ఆర్.మహదేవన్, జస్టిస్ జోయ్ మల్య బాగ్చిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతిస్పందనల కోరుతూ నోటీసులు జారీ చేసింది. మాజీ బ్యూరోక్రాట్ జ్ఞానేంద్ర కుమార్ ఖరే ఈ పిటిషన్ దాఖలు చేయగా, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ఎన్‌హెచ్ ఆర్‌సిలను ప్రతివాదులుగా చేర్చారు. విచారణ నాలుగు వాయిదాలు వాయిదా వేసింది.

# ఏ ఒక్క ఓటరును జాబితానుంచి తొలగించం: సిఇసి



**కోల్‌కత్తా, మార్చి 10:** అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరును కూడా ఓటర్ జాబితా నుంచి తొలగించబోమని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం సీఈసీ బృందం పశ్చిమబెంగాల్‌లో పర్యటించింది. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు, అధికారులతో సమావేశాల అనంతరం జ్ఞానేశ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. పశ్చిమబెంగాల్‌లో స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడటమే ఎన్నికల సంఘం (ఈసిఐ) మొదటి ప్రాధాన్యమని ఆయన చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన ఓటర్ల పేర్లు ఎప్పటికీ తొలగించబోమని స్పష్టంచేశారు. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారమే అన్ని రాష్ట్రాలో ప్రత్యేక సమగ్రసవరణ అమలవుతుందన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటం, అర్హులైన వారి పేర్లు ఆ జాబితాలో ఉండేలా చూడటమే సర్ బాధ్యత అని చెప్పారు. ఇక్కడ ఎన్నికలు ఎన్ని దశల్లో జరుగుతాయనేది రాష్ట్రప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో చేపట్టే చర్యలపైన ఆధారపడి ఉంటుందన్నారు. బెంగాల్ ఎన్నికల ప్రక్రియలో ప్రభుత్వ ఉద్యోగులందరూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించాలని చెప్పారు. ఓటర్లపైనా, ఎన్నికల అధికారులపైనా రాజకీయ నేతలు ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా సహించేది లేదని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 80 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిల్లో దాదాపు 61 వేలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని చెప్పారు. ఓటింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించేందుకు రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను అమలుచేయనున్నట్లు తెలిపారు.

# మురిద్ ఎయిర్‌బేస్‌ను నేలమట్టం చేసిన పాకిస్థాన్



**కరాచి, మార్చి 10:** భారత వైమానిక దళం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ధాటికి పాకిస్థాన్‌లోని కీలకమైన మురిద్ ఎయిర్‌బేస్ కోలుకోలేని విధంగా దెబ్బతిన్నట్లు తాజా శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. చక్వాల్ సమీపంలోని ఈ వ్యూహాత్మక ఎయిర్‌బేస్‌లో ధ్వంసమైన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను పునరుద్ధరించడానికి పాక్ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. గతనెల 28నఅందిన చిత్రాల ప్రకారం, అక్కడ మరమ్మతులకు బదులుగా భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తున్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ప్రముఖ శాటిలైట్ ఇమేజరీ అనలిస్ట్ డామియన్ సైమన్ విశ్లేషణ ప్రకారం, ఈ భవనాన్ని ప్రస్తుతం పూర్తిగా నేలమట్టం చేశారు. కేవలం పైకప్పు మాత్రమే కాకుండా, భవనం లోపలి ప్రధాన నిర్మాణం తీవ్రంగా దెబ్బతినడం వల్లే దీనిని రిపేర్ చేయడం అసాధ్యమని పాక్ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లుతెలుస్తోంది. అంతకు ముందు ఈభవనాన్ని టార్పాలిన్ షీట్లతో కప్పి ఉంచిన ప్పటికీ, ఇప్పుడు అక్కడకేవలం శిథిలాలు మాత్ర మే కనిపిస్తున్నాయి. 2025మే 10న తెల్లవా రుజామున భారత వైమానిక దళం మెరుపు దాడి చేసిన 10 పాక్ ఎయిర్‌బేస్‌లలో మురిద్ ఒకటి. ఇక్కడినుంచే డ్రోన్లకార్యకలాపాలు సాగుతుంటాయని అంచనా. భారత గగనతలంనుంచే రఫేల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగించిన స్కాల్ప్ వంటి శక్తివంతమైన ఎయిర్ టు సర్ఫేస్ క్షిపణుల వల్లే పాక్ కు ఇంతటి భారీ అంతర్గత నష్టం సంభవించి ఉండవచ్చని రక్షణ నిపుణులు భావిస్తున్నారు.

# చైనా పెట్టుబడులకు కేంద్రం పచ్చజెండా

## ఎఫ్‌డిఐల నిబంధనల సవరణకు మంత్రివర్గం ఆమోదం

**న్యూఢిల్లీ, మార్చి 10:** విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తో సరిహద్దు పంచుకునే దేశాల నుండి వచ్చే పెట్టుబడుల నిబంధనలను సరళతరం చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 2020లో గాల్వాన్ లోయ ఉద్రిక్తతల తర్వాత విదేశీ శక్తులను ముఖ్యంగా చైనాను నిరోధించడానికి 'ప్రెస్ నోట్ 3' (పిఎన్3) నిబంధనను తీసుకువచ్చారు. దీని ప్రకారం చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి పొరుగు దేశాల నుండి వచ్చే ప్రతి పైసా పెట్టుబడికి ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనసరి చేశారు. అయితే, తాజా సవరణతో ఈ కఠినమైన ఆంక్షలను సడలిస్తూ కొన్ని రకాల పెట్టుబడులను, ముఖ్యంగా తక్కువ మొత్తంలో ఉండే పెట్టుబడులను 'ఆటోమేటిక్ రూట్' ద్వారా అనుమతించాలని కేంద్రం నిర్ణయంచింది. దీనివల్ల ఇకపై కొన్ని నిర్దేశిత రంగాలలో, అలాగే పరిమితులకు లోబడి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వ అనుమతి కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ఈ నిబంధన ప్రకారం భారత్‌తో భూసరిహద్దు ఉన్న దేశాలకు చెందిన కంపెనీలు లేదా ఆ దేశాల షేర్ హోల్డర్లు ఉన్న సంస్థలు భారత్‌లో ఏ రంగంలోనైనా పెట్టుబడి పెట్టాలంటే తప్పనిసరిగా ప్రభుత్వఅనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ నిబంధనల్లో కొంత సడలింపు కల్పించినట్లు వర్గాలు చెబుతున్నాయి.

**భారత్‌లో చైనా ఎఫ్‌డీఐ వాటా తక్కువే**

భారత్‌లో మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో చైనా వాటా చాలా తక్కువగా ఉందని అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. 2000 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.32 శాతం మాత్రమే. విలువ పరంగా ఇది సుమారు 2.51 బిలియన్ అమెరికన్ డాలర్లుగా నమోదైంది. ఈ కారణంగా ఎఫ్‌డీఐ పరంగా చైనా భారత్‌లో 23వ స్థానంలో ఉంది.

# మహిళలపై వివక్ష..యుసిసినే మేలు

**న్యూఢిల్లీ, మార్చి 10:** ముస్లిం మహిళల పట్ల వివక్ష చూపుతున్న 1937నాటి షరియత్ చట్ట నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. సిజె జస్టిస్‌సూర్యకాంత్, జస్టిస్‌ఆర్.మహదేవన్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీల ధర్మాసనం విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి) అమలుకు సమయం ఆసన్నమైందన్నారు. మహిళలకు ఆస్తి వారసత్వంలో వివక్ష జరుగుతోందన్న వాదనతో ధర్మాసనం ఏకీభవిస్తూ,అయితే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యత చట్టసభలకే వదలివేయడం ఉత్తమమని పేర్కొంది. మహిళల హక్కులు, వివక్ష తదితర సమస్యలన్నింటికీ యూనిఫాం సివిల్ కోడ్ ఒక్కటే శాశ్వత పరిష్కారమని, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం దీనిని రూపొందించే అధికారం పార్లమెంటుకు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

## మంటల్లో పశ్చిమాసియా

# ఇరాన్ నౌకలను ముంచేయడం సరదాగా ఉంది: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 10:** ఇరాన్ నౌకలను ముంచడం సరదా అనిపించిందని తమ సైన్యం చెప్పిందని, అదే సురక్షితమని వారు తనతో చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మా సైన్యం చెప్పింది కూడా తనకు నిజమే అనిపించిందన్నారు. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం అనంతరం ఇప్పటి వరకు 5 వేల లక్ష్యాలను ఛేదించామని ఆయన వెల్లడించారు. తమ దాడులతో ఇరాన్ క్షిపణి సామర్థ్యం 10 శాతానికి పడిపోయిందని అన్నారు. మూడున్నర రోజుల్లో ఇరాన్‌కు చెందిన 46 అగ్రశ్రేణి నౌకలను అమెరికా మిలిటరీ ముంచివేసిందన్నారు. ఇరాన్ డ్రోన్, క్షిపణి సామర్థ్యం పూర్తిగా ధ్వంసమవుతోందని అన్నారు. 46ఇరాన్ నౌకలను ముంచివేశామంటే విశ్వసించగలరా అని అన్నారు. అయితే ఒక విషయంలో మన సైన్యం తీరు తొలుత తనకు నచ్చలేదని, దాంతో వెంటనే సైనికాధికారులతో మాట్లాడానని అన్నారు. ధ్వంసమైన నౌకలు ఎలాంటివని తాను అడిగానని, అవి ఇరాన్ అగ్రశ్రేణి నౌకలు అని తమ సైన్యం చెప్పిందన్నారు. అలాంటప్పుడు వాటిని స్వాధీనం చేసుకుని మన నౌకా ఉపయోగించుకోవచ్చు కదా, ఎందుకు ముంచివేశారని తాను వారిని ప్రశ్నించానని తెలిపారు. వాటిని ముంచడం సరదాగా అనిపించిందని, అలా చేయడమే సురక్షితమని వారు సమాధానం చెప్పారని అన్నారు.

# పుతిన్‌తో ట్రంప్ సుదీర్ఘ చర్చలు..





**వాషింగ్టన్, మార్చి 10:** అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫోన్‌లో దాదాపు గంటపాటు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఇరాన్ యుద్ధం, ఉక్రెయిన్ సంక్షోభం తీవ్రతపై ఇరుపక్షాల నేతలు విస్తృతంగా చర్చించారు. ట్రంప్ చొరవతోనే ఈ ఫోన్ కాల్ సంభాషణ జరిగిందని రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి యూరి ఉషకోవ్ తెలిపారు. ఈ సంభాషణ ఎంతో నిర్మాణాత్మకంగా సాగిందని, ఇది ఇరు దేశాల నేతల మధ్య జరిగే సాధారణ చర్చల వంటిదేనని ఆయన వివరించారు. మరోవైపు, ట్రంప్ మాట్లాడుతూ, నేను పుతిన్‌తో చాలా మంచి సంభాషణ జరిపాను. ఉక్రెయిన్ గురించి చర్చించాం. అది ఎప్పటికీ అంతం కానియట్టుంది. కానీ, ఈ అంశంపై సానుకూల చర్చ జరిగింది. ఉక్రెయిన్, మధ్యప్రాచ్యం గురించి చర్చించాం. ఈ సమస్యల పరిష్కారానికి పుతిన్ సాయం చేయాలని కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పుతిన్ ఇరాన్‌కు రష్యా బేషరతు మద్దతు కొనసాగుతుందని ట్రంప్‌కు తేల్చిచెప్పారు. పశ్చిమ ఆసియాలో యుద్ధం ఇలాగే కొనసాగితే ప్రపంచచమురు, గ్యాస్ సరఫరాలు దెబ్బతిని, ధరలలో పెనుమార్పులు వస్తాయని పుతిన్ హెచ్చరించారు. ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ జరిపిన ఉమ్మడి దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన విషయం తెలిసిందే.

# యుద్ధం ముగించాలంటూ ట్రంప్ సలహాదారుల ఒత్తిడి



**వాషింగ్టన్, మార్చి 10:** ఇరాన్ తో కొనసాగుతున్న యుద్ధం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. యుద్ధాన్ని సాగదీయడం వల్ల రాజకీయంగా భారీ మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుందని భయపడుతున్న ఆయన సలహాదారులు యుద్ధం నుంచి వెంటనే వైదొలగాలని ట్రంప్‌పై ఒత్తిడి పెంచుతున్నారు. సలహాదారుల ఆందోళనకు ప్రధానంగా రెండు కారణాలు కనిపి స్తున్నాయి. యుద్ధం సుదీర్ఘంగా కొనసాగితే అమెరికా ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందని, ఇది రాబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి గట్టి దెబ్బ కొడుతుందని వారు హెచ్చరిస్తున్నారు. చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరడంతో అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగిపోయింది. సామాన్యుడిపై పడుతున్న ఈ ఆర్థికభారం ట్రంప్ పాపులారిటీని దెబ్బతీస్తోంది. సలహాదారుల నుంచి ఒత్తిడి వస్తున్నప్పటికీ ట్రంప్ మాత్రం బయటపడకుండా తనదైన శైలిలో స్పందించారు. మేము షెడ్యూల్ కంటే ముందే ఉన్నాం. మిలిటరీ పరంగా సాధించాల్సిన లక్ష్యాలను దాదాపుగా పూర్తి చేశాం. ఈ యుద్ధం చాలా త్వరగా ముగిసిపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, సంతృప్తికరమైన విజయం సాధించకుండా ఆయన వెనక్కి తగ్గేలా కనిపించడంలేదని మరికొందరు అధికారులు అభిప్రా యపడుతున్నారు. ఇదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్‌గా హార్డ్‌లైనర్ మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ఒకవేళ ఆయన తమ డిమాండ్లకు లొంగకపోతే, ఆయనపై కూడా దాడులు చేసేందుకు ట్రంప్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# యాక్టివేట్ అయిన ఇరాన్ స్లీపర్ సెల్స్..

**టెహ్రాన్, మార్చి 10:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత ఆ దేశం తన స్లీపర్ సెల్స్‌ను మేల్కొలిపేందుకు ప్రయత్నిస్తోందని నిఘా నివేదికలు ప్రస్తావించాయి.ఇరాన్ నుంచి వెలువడిన కొన్ని రహస్య ఎన్‌క్రిప్టెడ్ సందేశాలను అమెరికా నిఘా సంస్థలు అడ్డుకున్నాయి. ఇవి విదేశాల్లో ఉన్న ఇరాన్ ఏజెంట్లకు దాడులు చేయాలని ఇచ్చే సంకేతాలు కావచ్చని ఏజెన్సీలు చెపుతున్నాయి. గతనెల 28న ఖమేనీ మృతి చెందిన కొద్దిసేపటికే ఇరాన్ నుంచి ఒక కొత్త రేడియో స్టేషన్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో సందేశాలు వెలువడ్డాయి. ఇవి ఇంటర్నెట్ లేదా సెల్ ఫోన్ నెట్‌వర్క్ వాడకుండా, కేవలం క్లోజ్డ్ గ్రూపులకు మాత్రమే అర్థమయ్యే కోడ్ లాంగ్వేజ్‌లో ఉన్నాయి. వీటి ద్వారా విదేశాల్లో ఉన్న తమ ఏజెంట్లకు ఇరాన్ ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉందని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. దీనివల్ల అమెరికా, యూరప్ దేశాల్లోని భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఈ పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని, ఇరాన్ గనుక ఏవైనా పిచ్చి వేషాలు వేయాలని చూస్తే ఆ దేశం మ్యాప్‌లో లేకుండా పోతుందని హెచ్చరించారు. యుద్ధం దాదాపు ముగిసిందని, ఇరాన్ గగనతలం, నౌకాదళం పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ, అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచాలని స్థానిక పోలీసు విభాగాలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

# రెండురోజుల యుద్ధానికి రూ.4.65 లక్షలకోట్ల ఖర్చు



**వాషింగ్టన్, మార్చి 10:** ఇరాన్‌పై అమెరికా జరుపుతున్న సైనిక చర్య అత్యంత ఖరీదుగా మారింది. యుద్ధం మొదలైన తొలి రెండు రోజుల్లోనే కేవలం ఆయుధాల కోసం అమెరికా ఏకంగా 5.6 బిలియన్ డాలర్లు భారత కరెన్సీలో సుమారు రూ. 4.65 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు అమెరికా పత్రికలు అంచనా వేస్తున్నాయి. యుద్ధం త్వరలోనే ముగియవచ్చని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచిస్తున్నప్పటికీ, ఈ భారీ వ్యయం వాషింగ్టన్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. అమెరికా కాంగ్రెస్‌కు అందించిన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేసినట్లు పత్రికలు పేర్కొంటున్నాయి. ఇది కేవలం దాడుల్లో వాడిన అత్యాధునిక ఆయుధాల విలువ మాత్రమే. సైనిక బలగాల తరలింపు, విమానాలు, నౌకల నిర్వహణ వంటి ఇతర కార్యాచరణ ఖర్చులను ఇందులో కలపలేదు. ఈ స్థాయిలో దాడులు కొనసాగితే, అమెరికా వద్ద ఉన్న కీలకమైన ఆయుధ నిల్వలు వేగంగా తరిగిపోతాయని చట్టసభ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈ సైనిక చర్యను కొనసాగించేందుకు అదనపు నిధులు కోరే క్రమంలోనే పెంటగాన్ ఈ వివరా లను కాంగ్రెస్‌తో పంచుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఈ యుద్ధంలో ఏడుగురు అమెరి కన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. కువైట్‌లో ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో ఆరుగురు, సౌదీ అరేబి యాలో జరిగిన దాడిలో గాయపడి మరొకరు మరణించినట్లు అమెరికా అధికారులు ధ్రువీకరించారు.

# ఇరాన్ ఫైనాన్షియల్ హబ్‌పై ట్రంప్ నజర్: అడ్డుకుంటున్న అడ్వైజర్లు



**వాషింగ్టన్, మార్చి 10:** పశ్చిమాసియాలోని పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ తీరానికి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపంపై ఇపుడు ట్రంప్ దృష్టిపడింది. 20 చదరపు కిలోమీటర్ల అతి తక్కువ వైశాల్యంతో ఉన్నప్పటికీ ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు ఇది వెన్నెముకగా అమెరికా అంచనా వేసింది. ఇరాన్ చమురు ఎగుమతుల్లో 90శాతం వాటా దీనిదే. అమెరికా ఆంక్షలు విధించినప్పటికీ, 2024లో ఈ ద్వీపం నుంచి చమురు ఎగుమతుల ద్వారా ఇరాన్ 78 బిలియన్ డాలర్లను ఆర్జించింది. దీన్ని బట్టి ఇరాన్ ఆర్థిక వ్యవస్థ నడవాలంటే ఇక్కడి చమురు ఎగుమతులే కీలకమన్న విషయం అర్థమవుతున్నది. ఖర్గ్‌లోని లోడింగ్ టర్మినళ్లు రోజుకు ఏడు మిలియన్ బ్యారెళ్ల చమురును హ్యాండిల్ చేయగలవని నివేదికలు చెప్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మొదలుకావడానికి ముందు ఖర్గ్ నుంచి రోజుకు 1.5 మిలియన్ బ్యారెళ్ల చమురును ఎగుమతి చేసిన ఇరాన్ ఘర్షణలు మొదలైన తర్వాత ఈ ఎగుమతులను 4 మిలియన్ బ్యారెళ్లకు పెంచింది. యుద్ధానికి అవసరమైన నిధుల కోసమే ఇలా చేసినట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఖర్గ్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు ఎగుమతితో ఆర్థికంగా బలోపే తమవుతున్న ఇరాన్‌ను దీర్ఘకాలంలో దెబ్బతీయలేమని ట్రంప్ గ్రహించినట్టు వినికిడి. ఈ క్రమంలోనే ఆ ద్వీపంపై దాడులు జరిపి ఇరాన్‌ను వ్యూహాత్మకంగా దెబ్బతీయాలని ఆయన యోచిస్తున్నట్టు సమాచారం. ఖర్గ్‌పై దాడులు చేస్తే ఇరాన్‌ను దెబ్బతీయవచ్చన్న విషయం నిజమైనప్పటికీ, ఈ చర్య అటు అమెరికాకు, ఇటు ఇజ్రాయెల్‌కు కొత్త ఇబ్బందులు తీసుకురావొచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇప్పటికే చమురు ధరలు బ్యారెల్‌కు 110నుంచి 115 డాలర్లకు చేరుకొన్నాయి. ఇప్పుడు ఖర్గ్‌పై దాడులు జరిగితే ఈ ధరలు మరో 10 డాలర్ల మేర పెరిగే ప్రమాదముంది. అంతేకాకుండా ఖర్గ్ ద్వీపం స్వాధీనానికి యూరోప్, ఇతర ఆసియా దేశాలు కూడా తీవ్రంగా వ్యతిరేకించే ప్రమాదం ఉంది. ఈలోపు ఇరాన్‌యుద్ధం ముగించాలని సలహాదారులు ఒత్తిళ్ల తీసుకురావడంతో ట్రంప్ ఇపుడు కొంతమేర వెనుకంజవేసినట్లు తెలుస్తోంది.

# వినోద, పర్యాటక రంగాల గమ్యస్థానం ఎపి

● అమరావతి, విశాఖపట్నం, తిరుపతి నగరాలలో భారీ మెగా అమ్యూజ్‌మెంట్ పార్కులు ● ముంబైలో ఐఎంపిఏ ఎక్స్‌పోలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ, మార్చి 10 ప్రభాతవార్తప్రతినిధి: పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన రాష్ట్రంగా తీర్చిదిద్ద డానికి ప్రభుత్వ విధానాలు, మౌలిక సదుపాయాలు, సంస్కరణలు సిద్ధంగా ఉన్నాయని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముంబై లోని బాంబే ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతున్న 24వ ఇండియన్ అసోసి యేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆధునిక పర్యాటక రంగంలో అమ్యూజ్ మెంట్, థీమ్ పార్కులు కీలకమైన స్తంభాలుగా ఎదిగిన నేపథ్యంలో కుటుంబాలు వినూత్న అనుభూతుల కోసం, యువత సాహస క్రీడల కోసం, సామాన్య పర్యాటకులు కొత్తదనం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొంటూ అమ్యూజ్‌మెంట్ రంగంలోని జాతీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఉద్దేశించి ప్రసంగించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, వేలాది ఉద్యోగాలను సృష్టించడం తద్వారా సమాజ జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంలో ఇన్వెస్టర్లకు అందిస్తున్న రాయితీలను తెలు పుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించారు. ఎక్స్‌పోను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన మంత్రి దుర్గేష్ స్టాళ్లను పరిశీలించి ఎపి పర్యాటక రంగానికి విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. పలు స్టాళ్ల వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన వినోద సాధనా లను పరిశీలించారు. కార్యక్రమం అనంతరం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ అంకూర్ మహేశ్వరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. సుదీర్ఘ తీరప్రాంతం, గొప్ప సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యమైన ప్రకృతి దృశ్యాలు కలిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం పర్యాటక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఎపి ప్రభుత్వం పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించిందని, నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇన్వెస్టర్లకు 25శాతం వరకు ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, పారిశ్రామిక ధరలకే విద్యుత్ సరఫరా, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, 100 శాతం నెట్ ఎస్‌జిఎస్‌టి రీయింబర్స్‌మెంట్, ఉపాధి కల్పన ఆధారిత సబ్సిడీలు తదితర భారీ రాయితీలు కల్పిస్తు న్నామని ఆయన తెలిపారు. హోటళ్లు, థీమ్ పార్కులు, రిసార్టుల కోసం భూ కేటాయింపు ప్రక్రియను సరళతరం చేస్తూ టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2025ను దేశంలోనే మొదటిసారిగా ఎపి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మంత్రి దుర్గేష్ వివరించారు. రూ.50 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టే ప్రాజెక్టులకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా నేరుగా భూ కేటాయింపులు జరుగుతాయని స్పష్టం చేశారు.

**స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047:** సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల దార్శనికతతో స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047ని రూపొందించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. దీని ద్వారా ఏపీని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొ న్నారు. ఏడాది కాలంలోనే 102 ఒప్పందాల ద్వారా రూ.18,448 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని ఆయన వెల్లడించారు. అదనంగా, స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ద్వారా రూ.9,446 కోట్ల పెట్టుబడితో 7,348 క్లాసిఫైడ్ హోటల్ గదుల నిర్మాణానికి ఆమోదం తెలి పామన్నారు. పర్యాటక రాయితీలను పొందడంలో పారదర్శకత, వేగం, ఎటువంటి ఇబ్బందులులేని ప్రక్రియను నిర్ధారించడానికి పర్యాటక విధానా నికి సంబంధించిన 'ఆపరేషనల్ గైడ్‌లైన్స్' విడుదల చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో పర్యాటక అనుభవాలను విస్తృతం చేయడానికి కారవాన్ టూరి జం ప్రమోషన్, హోమ్‌స్టే, బిఅండ్‌బి పాలసీలను తెచ్చామన్నారు. త్వర లోనే కాన్సర్ట్ పాలసీ, ఎపి ఫిల్మ్ టూరిజం పాలసీ, మైస్ పాలసీలను అందుబాటులోకి తెస్తామని, ఇవి పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించడమే కాకుండా స్థానికులకు ఉపాధిని కల్పిస్తున్నాయన్నారు.

**మెగా పెట్టుబడులకు మూడు ప్రధాన నగరాలు... ఆంధ్రప్రదేశ్ అవకాశాల గని:** అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్కులు, వాటర్ ఫ్రంట్ అట్రాక్షన్స్, అడ్వెంచర్ జోన్లు, సమగ్ర వినోద కేంద్రాల ఏర్పాటుకు ఏపీలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, తీరప్రాంత సర్క్యూట్లు, ఆధ్యాత్మిక పట్టణాలు,



ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ ఎక్స్‌పోలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

అటవీ ప్రాంతాలు, పట్టణ వినోద కారిడార్లలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వాటర్ రిక్రియేషన్, ఫ్యామిలీ థీమ్ పార్కులు, అడ్వెంచర్ స్పోర్ట్స్ హబ్‌లకు ఇక్కడ అధిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో అమ్యూజ్‌మెంట్, థీమ్ పార్కుల కోసం మూడు కీలక నగరాలను ప్రతిపాదించారు. గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతి నూతన ఆవిష్కరణలకు అద్భుతమైన వేదిక అని, విశాఖపట్నం ను అంతర్జాతీయ స్థాయి తీరప్రాంత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందు తుందని, భారీ సంఖ్యలో వచ్చే భక్తుల దృష్ట్యా ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తిరుపతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన పర్యాటక, పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులలో సమాంతరంగా ఈ రంగానికి కూడా ప్రాముఖ్యతనిస్తూ ఒక అనుకూలమైన వ్యవస్థను నిర్మిస్తున్నామని భరోసా నిచ్చారు. అంతర్జాతీయ స్థాయి వినోద కేంద్రాల నిర్మాణంలో ఇన్వెస్టర్లకు ఎదురయ్యే అడ్డంకులను తొలగించి, అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తున్నామని వివరించారు.



## కడప నగరపాలక సంస్థలో ఎసిబి సోదాలు

### రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల్లో తనిఖీలు

కడప కార్పొరేషన్, మార్చి 10 ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) దాడులు నిర్వహిస్తుంది. బిల్డింగ్ పర్మిషన్ జారీలో ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణలో టౌన్ ప్లానింగ్ అధికా రులు అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో పక్కా వ్యూహంతో ఎసిబి భారీ ఆపరేషన్‌కు శ్రీకారం పెట్టింది. క్షుణ్ణంగా రికార్డులను పరిశీలిం చారు. ఏకకాలంలో శ్రీకాకుళం, విశాఖ, నెల్లూరు, ఒంగోలు, కడప, అనంత పురం, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎసిబి అధికారులు తనిఖీ చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతిపై ఆరా తీశారు. టౌన్ ప్లానింగ్ చేపట్టిన పనులపై ఫిర్యాదు రావడంతో అధికారులు తనిఖీ చేపట్టారు. అందులో భాగంగానే కడప నగరపాలక సంస్థ కార్యాల యంలో మంగళవారం ఎసిబి అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో రికార్డులను పరిశీలించారు. ఎసిబి సిఐలు నాగరాజు, సయ్యద్ హసన్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో సోదాలు చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని విచారించారు. పూర్తిస్థాయి వివరాలను సోదాలు ముగిసిన అనంతరం వెల్లడిస్తామని ఎసిబి అధికారులు తెలిపారు.

## శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయంలోనూ...



శ్రీకాకుళం, మార్చి 10 ప్రభాతవార్త: శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యా లయంలో మంగళవారం అవినీతి నిరోదకశాఖ (ఎసిబి) అధికారులు ఆకస్మికం గా సోదాలు నిర్వహించారు. కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన రికార్డులు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను పరిశీలిస్తూ అధికారులు సిబ్బందిని విచారిస్తున్నారు. ఎసిబి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల టౌన్ ప్లానింగ్ విభాగాల్లో ఒకేసారి దాడులు చేపట్టారు. అందులో భాగంగా శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయంలో కూడా సోదాలు నిర్వహించారు. ఎసిబి సిఐలు ఎస్.వి.రమణ, భాస్కరరావు ఆధ్వర్యంలో ముందుగా టౌన్ ప్లానింగ్ విభాగం లోని అధికారులు, సిబ్బంది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హాజరు పట్టీలను పరిశీలించి సంతకాలు చేసిన అధికారులు నిజంగా విదుల్లో ఉన్నారా లేదా అన్నది ఆరా తీశారు. తర్వాత విభాగాధిపతి, టౌన్ సర్వేయర్, సీనియర్ అసిస్టెంట్ తదితర సిబ్బంది వద్ద ఉన్న రికార్డు లను పరిశీలించారు. జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహిస్తున్నారా అనే అంశంపై కూడా విచారణ చేపట్టారు. కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లలోని డేటాను తమ వెంట తీసుకు వచ్చిన ల్యాప్‌టాప్‌లకు అనుసంధానం చేసి వివరాలను సేకరించారు. ఈ సోదాలు సాయంత్రం వరకు కొనసాగాయి.



## 13న యోగి వేమన వర్సిటి స్నాతకోత్సవం

వైవీయూ, మార్చి 10 ప్రభాతవార్త: యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రతిష్టా త్మకంగా నాలుగు కాన్వొకేషన్లు ఒకేసారి ఈ నెల 13వ తేదీ నిర్వహించ నున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. విశ్వవిద్యాలయం 11వ (2020-21), 12వ (2021-22) 13వ (2022-23), 14వ (2023-24) కాన్వకేషన్ల నిర్వహణకు కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయం సిద్ధమైందన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ కడపలోని వైవియూ ఆధ్వర్యం లోని సి.పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కాన్వొకేషన్‌లో 1,194 పిజి పట్టభద్రులకు, డిగ్రీ, పిజి కోర్సులలో ప్రతిభావంతులకు 176 బంగారు పతకాలు, 70 మంది పరిశోధకులకు పీహెచ్డీ అవార్డులు అందజేస్తున్నామన్నారు. నాలుగేళ్లకు కలిపి మరో ఇద్దరు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు ఇవ్వనున్నామన్నారు. ఆ ఇద్దరి పేర్లు రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుంచి ఆమోదం రాగానే వెల్లడిస్తామన్నారు. విద్యార్థుల పట్టాలు అందజేసే మహోన్నత కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ కాన్వకేషన్లో ఇన్ ఆప్సెన్షియా కింద 11,664 మంది డిగ్రీ విద్యార్థులు డిగ్రీలను అందుకోనున్నారని వివరించారు. ఈ సమావేశంలో ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య పార్వతి, విశ్వవిద్యాలయ పబ్లిక్ రిలేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత, డాక్టర్ టి.సురేష్ బాబు పాల్గొన్నారు.

# చేజర్లలో అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శ్రీకారం

● రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేత ● లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చేజర్ల, (నెల్లూరు)మార్చి 10, ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా చేజర్ల మండలం యనమదల గ్రామంలో మంగళవారం మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సంద ర్భంగా గ్రామంలో చేపట్టిన పలు పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించి గ్రామాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పర్యటనలో భాగంగా ముందుగా మంత్రి గ్రామస్తులకు "మీ భూమి మీ హక్కు" పట్టా దారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పంచాయతీ పరిధిలో రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లకు ప్రారంభోత్సవాలు, నిర్వహించారు. దేవాదాయ శాఖ నిధులతో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న గంగమ్మ దేవస్థానం ప్రహరీ గోడకు భూమిపూజ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి మరింత ఊతమివ్వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.8,53,631 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భం గా మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పింఛన్లను ప్రతి నెల ఒకటో తేదీన అందజేస్తున్నామని, ఒకటో తేదీ సెలవు వచ్చినట్లయితే ముందురోజే పింఛన్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గ్రామంలోని గంగమ్మ తల్లి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి ఇప్పటికే కేటాయించిన నిధులు సరిపోవని అధికారులు చెప్పడంతో అదనంగా రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ నిధులతో గంగమ్మ తల్లి ఆలయ ప్రహరీ గోడతో పాటు శ్రీవాణి భజన మందిరానికి ముఖ మండపం నిర్మిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో బి పావని ఆత్మకూరు నియోజకవర్గం టిడిపి నాయకులు తాళ్లూరి గిరినాయుడు, ఎంపిడిఓ అమర్, తహసీల్దార్ మస్తానయ్య, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపిపిలు అన్నలూరు శ్రీనివాసులు నాయుడు, రావి పెంచల్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, మండల ప్రధాన కార్యదర్శి తలపనేని జయంతులు నాయుడు, అచ్చాల నారాయణరెడ్డి, కొమ్మి రమేష్ నాయుడు, రావి లక్ష్మీనర్సా రెడ్డి, గోనుగుంట రాంబాబు, చేజర్ల మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆనం అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### ధాన్య సేకరణ కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



విడవలూరు,(నెల్లూరు), మార్చి 10 ప్రభాతవార్త: రైతన్నల కష్టానికి తగిన గిట్టుబాటు ధర కల్పించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ధాన్య సేకరణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్య సేకరణలో తలెత్తే గోనె సంచుల కొరత, ట్రాన్స్ పోర్ట్ తదితర సమస్యలపై జిల్లా కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులు,మిల్లర్లతో ఇప్పటికి పలు సార్లు చర్చించామని, రైతులకు అండగా నిలిచి సహాయ సహకారాలు అందించేందుకు అందరూ హామీ ఇచ్చారని ఆమె అన్నారు. ముఖమంత్రి రైతుల పాలిట పెద్దన్నలా రైతు సంక్షేమ పాలన అందిస్తున్నారని కొనియాడారు. రైతులు ఎదుర్కొంటున్న తేమ శాతం సమస్యను కలెక్టర్ హిమాన్షు శుక్ల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు వివరించారు. ఈ నెల 13 వ తేది అన్నదాత సుఖీభవ తాలూకు ఆర్థిక సహాయం అందనున్న నేపథ్యంలో ప్రతి రైతు సమీప రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ ఐడిలు చెక్ చేసుకోవాలని పేర్లు లేకుంటే వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు, భూసార పరీక్షా పత్రాలను రైతులకు అందచేశారు. అనంతరం విడవలూరు గ్రామ పంచాయతీకి సంబంధించి 28 చెత్త తరలించే రిక్షాల ప్రారంభోత్స వంతో పాటు పారిశుద్ధ్య కార్మికులకు 168 డస్ట్ బిన్స్ అందచేశారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి అనిత, అడపాల శ్రీధర్ రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి, అచ్యుత్ రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, సత్తివోలు సత్యం రెడ్డి, ఆవుల వాసు, విడవలూరు సొసైటీ ఛైర్మన్ పొన్నలూరు పురంధర్ రెడ్డి, సొసైటీ సీఈఓ దద్దోలు రవి ఏటూరు శ్రీహరి రెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, శ్రీనివాసులు, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో నగేష్ కుమారి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ జంట ఆత్మహత్య?

### ప్రియురాలు ఉరేసుకుని బలవన్మరణం

### ఆస్పత్రిలో ప్రియుడి పరిస్థితి విషమం



మహానంది, మార్చి 10 ప్రభాతవార్త : నంద్యాల జిల్లా మహానంది ప్రాంతంలో ఒక ప్రేమకథ విషాదాంతానికి దారి తీసింది. కులాంతర వివాహం చేసుకున్న యువ జంట కుటుంబ విభేదాలతో చివరకు ఒకరి ప్రాణాన్ని తీసి, మరొకరిని ఆస్పత్రి పడక పైకి నెట్టాయి. మహానందికి చెందిన శివ, స్వప్న ప్రేమించుకున్నారు. ఇటీవల కులాంతర వివాహం చేసుకున్నారు. అయితే ఈ వివాహానికి యువకుడి తల్లి తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. కుటుంబంలో ఏర్పడిన వివాదంతో మనస్తాపానికి గురైన శివ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్వప్న తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది.

అనంతరం మహానంది సమీపంలోని జనశంకర్ తపోవనం వద్ద ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆమె మృతదేహం కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనపై రెండు కుటుంబాల మధ్య పరస్పర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్వప్నను ప్రియుడు కుటుంబ సభ్యులే హత్య చేసి ఉరివేసి ఉండవచ్చని అమ్మాయి బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు శివ కుటుంబ సభ్యులు మాత్రం స్వప్న బంధువులే ఆమెను చంపి ఉండవచ్చని ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనతో ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్వప్న మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఒకప్పుడు ప్రేమతో ప్రారంభమైన స్వప్న-శివ జీవితం, ఇప్పుడు అనుమానాల మధ్య విషాద గాథగా మిగిలిపోయింది.

## తిరుపతి నగరపాలక సంస్థలో ఎసిబి సోదాలు

తిరుపతి, మార్చి 10 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎసిబి అధికారులు సోదాలు చేశారు. ఎసిబి అదనపు ఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో సిఐలు సిబ్బంది ఉదయం నుండి సాయంత్రం బాగా పొద్దుపోయేవరకు టౌన్‌ప్లానింగ్‌లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో రికార్డులు, సిబ్బంది నుండి వివరాలు రాబట్టారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది వద్ద ఉన్న రూ.30 వేలు నగదును గుర్తించి ఎసిబి స్వాధీనం చేసుకుంది. ఉన్నఫళంగా ఒక్కసారిగా నగరపాలకసంస్థలో కౌన్సిల్ పదవీకాలం ముగిసే సమయంలో ఎసిబి దాడులు సంచలనం రేకెత్తాయి.

## ఆదిత్యుని తాకని సూర్యకిరణాలు



శ్రీకాకుళం, మార్చి 10 ప్రభాతవార్త: శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ అరసవల్లి సూర్యనారా యణ స్వామి దేవాలయంలో ఆదిత్యునికి సూర్యకిరణాలు తాకే అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు తరలి వచ్చిన భక్తులకు రెండవ రోజైన మంగళవారం నిరాశే ఎదురైంది. ఆకాశంలో కమ్ముకున్న మబ్బుల కారణంగా స్వామి వారి పాదాలను తాకే అద్భుత దృశ్యాన్ని చూసే అవకాశాన్ని సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు కోల్పోయారు. ఉత్తరాయణం, దక్షిణాయణం కాలాల మార్పుల్లో భాగంగా ప్రతి ఏడాది మార్చి 9, 10 తేదీల్లో అక్టోబర్ 1, 2, 3 తేదీల్లో సూర్యుని లేలేత కిరణాలు ఆలయ గర్భగుడిలో ఉన్న సూర్యనారాయణస్వామి విగ్రహాన్ని తాకడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి వారి పాదాల నుంచి తల వరకూ కూడా కిరణాలు స్పృశిస్తూ ఉంటాయి. ఆ సమయంలో స్వామి వారి విగ్రహం మేలిమి బంగారు ఛాయలో మెరిసిపోతూ ఉంటుంది. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకిస్తే శుభకం జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో అనేక సంవత్సరాల నుంచి జరుగుతున్న ఈ అద్భుతాన్ని తిలకించేందుకు ఉత్తరాయణంలోనికి మార్పు చెందడంలో భాగంగా మార్చి 9, 10 తేదీల్లో స్వామి వారి మూల విరాట్‌పై కిరణాలు నేరుగా తాకే దృశ్యాన్ని స్వయంగా తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సూర్యకిరణాల రాక కోసం వారు ఈ రెండు రోజులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. అయితే సూర్యుడిని మబ్బులు చుట్టిముట్టడంతో కిరణాలు స్వామి వారి పాదాలను తాకే అవకాశం లేకుండా పోయింది. దీంతో భక్తుల ఆశపై నీళ్లు జల్లినట్లయ్యింది. తొలిరోజు మిస్సవ్వడంతో రెండవ రోజు తెల్లవారుజామునే భక్తులు అక్కడకు చేరుకున్నారు. మబ్బులు రెండవ రోజు కూడా అడ్డుగా నిలవడంతో సూర్యకిరణాలు స్వామి వారి మూలవిరాట్‌ను తాకలేదు. దీంతో భక్తులంతా కూడా తీవ్ర నిరాశ చెందారు.

అరసవిల్లిలో ఆదిత్యుని మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకే దృశ్యాన్ని తిలకించేందుకు వచ్చిన ఎమ్మెల్యే గొండు శంకర్ సైతం ఇతర భక్తుల మాదిరిగానే నిరాశకు గరయ్యారు. మబ్బులు వీడుతాయని ఎదురు చూసినా అప్పటికే సమయం మించిపోవడంతో ఆ అవకాశం లభించలేదు. దీంతో సూర్యనారాయణస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# కన్నోళ్లకు మిగిలిన కన్నీళ్లు... ఆశలన్నీ ఆవిరయ్యాయి!

### ఉరికి వేలాడిన సరస్వతీ పుత్రుడు... నిర్లక్ష్యమే బిడ్డ ప్రాణం తీసింది: కడుపుకోతతో తల్లిదండ్రులు



అనంతపురం క్రైమ్ మార్చి 10 ప్రభాతవార్త: తాము పడిన కష్టాలు తమతోనే అంతం అయిపోవాలని, తమ బిడ్డల భవిష్యత్తుకు బంగారు పునాది వేయాలని ప్రతి తల్లిదండ్రులు భావించడం సర్వసాధారణం. అందుకోసం రెక్కలు ముక్కలు చేసుకుని తమ బిడ్డలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని, గొప్పవాళ్లు కావాలని వారి తల్లిదండ్రులు తమ శక్తికి మించి పిల్లలను చదివిస్తున్నారు. అయితే కొన్ని కళాశాలల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా చేసుకుని ఫీజుల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి పెడుతున్నారు. అయినప్పటికీ తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తమ స్థోమతకు మించి అప్పో సప్పో చేసి వేలకు వేలు ఫీజులు చెల్లించి మంచి చదువును అందిస్తున్నారు. అయితే ఈ ప్రభావం విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి దెబ్బతీస్తోంది. తమపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు బతికించాలని, యజమాన్యాలు పెడుతున్న ఒత్తిడికి తట్టుకుని పిల్లలు చదువుకోవాల్సి వస్తోంది. అయితే సున్నిత మనస్తత్వం కలిగిన కొందరు పిల్లలు వేరే దారి లేక బలవన్మరణానికి పూనుకోవడం దురదృష్టకరం. చివరికి తమపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు గుండె కోత మిగిల్చి తనువు చాలించడం పరిపాటిగా మారింది. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వాలు ముందుకు వచ్చి ఆదుకోవాలని ఎంతోమంది పుత్రశోకం అనుభవించిన బాధిత తల్లిదండ్రులు చేతులెత్తి వేడుకుంటున్నారు.

సరిగ్గా ఇలాంటి ఘటనే అనంతపురం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో జరగడం జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. జిల్లాలోని కళ్యాణదుర్గం మున్సిపల్ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన కృష్ణయ్య శారదమ్మ దంపతులకు చెందిన హరి ప్రసాద్(19) కష్టపడి చదివి పది, ఇంటర్ ఫలితాల్లో మెరిట్ మార్కులు సంపాదించి మట్టిలో మాణిక్యంగా నిలిచాడు. రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబం వీరిది. తల్లిదండ్రులు భవన నిర్మాణ కార్మికులుగా కష్టపడి పనిచేస్తూ తమ ఇద్దరు కుమారులను బాగా చదివిస్తూనే ఉన్నారు. అయితే అనంతపురం శివారు ప్రాంతంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న హరిప్రసాద్ అదే కళాశాలలోని హాస్టల్ గదిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం క్లాస్ రూమ్‌కు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన తోటి మిత్రులు ఎంతసేపటికి పిలిచినా బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి తొంగి చూడగా అప్పటికే ఉరికి వేలాడుతూ కనిపించాడు. తోటి విద్యార్థులు వెంటనే తలుపులు బద్దలుకొట్టి ఉరికి వేలాడుతున్న హరిని కిందికి దింపి హుటాహుటిన సర్వజన



ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

యజమాన్యం నిర్లక్ష్యమే తమ బిడ్డ ప్రాణాలు తీసింది: కళాశాల యజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తన బిడ్డ చనిపోయాడు అంటూ ఆ విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. క్లాస్ రూమ్‌లో అటెండెన్స్ వేసి ఉంటే తన బిడ్డ ఆచూకీ లభించేదని, తమ బిడ్డ ప్రాణాలతో బతికే వాడని రోధించారు. మొన్ననే కదరా కాలేజీ ఫీజు చెల్లించాలని బైక్ కుదవ పెట్టి ఫీజు కట్టాం.. అంతలోనే ఏమయిందిరా హరీ... అంటూ గుండెలు బాదుకున్నారు. హరిప్రసాద్ మృతదేహంపై పడి రోదించడం అక్కడివారిని కలిచివేసింది. తమ బిడ్డ చనిపోయాడని కనీసం తమకు సమాచారం కూడా ఇవ్వకుండా గోప్యంగా ఉంచడం వెనుక కారణాలేంటి అని ప్రశ్నించారు. తమ కుమారుడి మృతికి కారణమయ్యారంటూ కళాశాల యజమాన్యం సిబ్బందితో బాధితులు దిగడం చర్చనీయాంశం అయింది. తమ బిడ్డ ప్రాణాలు తెచ్చి ఇవ్వగలరా..? అంటూ ఆక్రోషం వెళ్లగక్కారు. హాస్టల్ వార్డెన్ అప్రమత్తం అయి ఉంటే తమ బిడ్డను ప్రాణాలతో చూసేవాళ్ళమని ఆవేదన చెందారు.




# అలిపిరిలో పట్టుబడిన రూ.65లక్షలు ఐటికి అప్పగింత

తిరుమల, మార్చి 10 ప్రభాతవార్త ప్రతినిధి: తమిళనాడు చెన్నై నుండి తిరుమలలో చిల్లరనాణేల కోసం వ్యాపారలావాదేవీల్లో భాగంగా తీసుకోస్తున్న భారీ మొత్తంలో నగదును అలిపిరి వద్ద విజిలెన్స్ సిబ్బంది పట్టుకున్నారు. పట్టుకున్న నగదు రూ.65 లక్షలు ఉండటంతో తదుపరి అలిపిరి పోలీసులకు అప్పగించారు. అయితే ఈ నగదును చిల్లర నాణేల మార్పిడి కోసమే తీసుకురావడం పరిపాటని వ్యాపారులు తెలిపారు. ఇదివరకు 10, 15లక్షలు రూపాయలు నగదు తీసుకువచ్చేవారమని, అయితే ఇంత మొత్తంలో ఎలాంటి రశీదులు లేకుండా, ఆధారాలు లేకుండా తీసుకు రావడంతో అనుమానంపై పట్టుకున్నారు. పట్టుకున్న నగదును అలిపిరి సిఐ పివిఎస్ రామకిశోర్ విచారణ చేశారు. చెన్నైలో వ్యాపారం చేసుకునే దీపక్ యజమాని, అతను తిరులమలోని ఎస్‌బిఐ నుండి నోట్లు ఇచ్చి చిల్లర నాణేలు తీసుకుపోవడం పరిపాటి. ఇందుకు అతని వ్యాపారులు వెంకటేశ్, నీలమేగం ద్వారా రూ.65 లక్షలు రెండు సంచుల్లో పంపారు. పట్టుబడిన నగదును యజమానికి దీపక్ తిరుపతికి చేరుకుని పోలీసులకు వివరణ ఇవ్వడంతో తదుపరి ఐటి శాఖకు అప్పగించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తరలించడం, నోట్లకు బదులు చిల్లర తీసుకెళ్ళడం పన్ను ఎగవేతనేనని అధికారులు తెలిపారు.

# సిఎంతో జనగణన డైరెక్టర్ భేటీ

- మే 1తేదీ నుంచి హౌస్ లిస్టింగ్ హౌసింగ్ సెన్సెస్ ప్రక్రియ
- వచ్చే నెల 15 నుంచి స్వీయగణన కార్యక్రమం
- రెండు దశలుగా 2027 జనగణన కార్యక్రమం గురించి సీఎంకు వివరణ ఇచ్చిన జె. నివాస్



**విజయవాడ మార్చి 10,ప్రభాతవార్త ప్రతినిధి:** 2027 జనగణనలో భాగంగా రాష్ట్రంలో ఈ ఏడాది మే 1 తేదీ నుంచి హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్ ప్రక్రియ చేపడుతున్నట్టు ఏపీ సెన్సెస్ ఆపరేషన్స్, సిటిజన్ రిజిస్ట్రేషన్స్ డైరెక్టర్ జె. నివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంతో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జనాభా లెక్కల ప్రక్రియను రెండు దశలుగా చేపడుతున్నామని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహ గణన (హౌస్ లిస్టింగ్, హౌస్ సెన్సెస్) ప్రక్రియను చేపట్టనున్నట్టు జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. మే 30 తేదీ వరకూ జరిగే ఈ ప్రక్రియలో ఇళ్లలోని పరిస్థితులు, గృహాల్లోని వివిధ సదుపాయాలను, ఆస్తులకు సంబంధించిన వివరాలను నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఏప్రిల్ 16 తేదీ నుంచి 30 తేదీ వరకూ స్వీయ గణన వెసులుబాటు కల్పించినట్టు ముఖ్యమంత్రికి వివరించారు. రెండో దశలో భాగంగా 2027 ఫిబ్రవరి నుంచి జనాభా లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. జనగణనలో భాగంగా సామాజిక ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు, వలసలు, సంతానానికి సంబంధించిన వివరాలను నమోదు చేయనున్నట్టు తెలిపారు. పూర్తిగా డిజిటల్ విధానంలో తొలిసారి 16వ సెన్సెస్ చేపడుతున్నట్టు ముఖ్యమంత్రికి తెలిపారు. మొబైల్ అప్లికేషన్లు, ప్రత్యేకించిన వెబ్ పోర్టల్ల ద్వారా ఈ సమాచార సేకరణ జరుగుతుందన్నారు. ఇంటర్నెట్ కనెక్షన్ లేని ప్రాంతాల్లో ఆఫ్ లైన్ లోనూ సమాచార సేకరణ, జనగణన చేపట్టనున్నట్టు తెలియచేశారు. ప్రజలే నేరుగా తమ వివరాలను స్వీయ గణన ద్వారా నమోదు చేసేందుకు పబ్లిక్ పోర్టల్ ను ఏర్పాటు చేసినట్టు ముఖ్యమంత్రికి వివరించారు. దీని కోసం సెన్సెస్ మేనేజ్మెంట్ మోనిటరింగ్ సిస్టమ్ పోర్టల్ ద్వారా నిరంతరం ఈ జనగణన ప్రక్రియను పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ కోసం డిజిటల్ సరిహద్దు మ్యాపింగ్ చేయనున్నట్టు వివరించారు. వివరాల నమోదు కోసం 16 భాషల్లో హౌస్ లిస్టింగ్ మొబైల్ యాప్ అందుబాటులోకి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని ముఖ్యమంత్రికి తెలియచేశారు. 2027 జనగణన ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ప్రగతి, వికాస్ అనే మస్కట్ లను వినియోగిస్తున్నట్టు రాష్ట్ర సెన్సెస్ ఆపరేషన్ డైరెక్టర్ జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు.

ఫైల్డ్‌బై:ఘంటా విజయకుమార్

# తిరుపతిలో రమాదేవి ఆస్పత్రిలో మృతదేహం అప్పగింతకు లంచం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య... రాజమండ్రిలో**

**విధులు వదిలి రీల్స్ చేస్తున్న ఇద్దరు హెడ్ నర్సుల సస్పెన్షన్**

**తిరుపతి,మార్చి 10ప్రభాతవార్త న్యూస్ నెట్‌వర్క్:** తిరుపతిలో ఓ కార్పొరేట్ ఆస్పత్రి యాజమాన్యం ఏకంగా ఠాగూర్ చిత్రంలో లీలలు నిజమయ్యేలా మృతదేహానికి డబ్బులు చెల్లించాలంటూ తెల్లవారు జాము నుంచి మృతదేహాన్ని ఇవ్వని ఆసుపత్రి యాజమాన్యం. మరణించిన వ్యక్తి కుటుంబం నుండి డబ్బులు డిమాండ్ చేసిన వైనం సాయం త్రం వెలుగుచూసింది. తిరుపతి సాయిరాం వీధిలోని రమాదేవి హాస్పిటల్ యాజమాన్యం తీరుపై బాధితులు రోడ్డుపైకి చేరారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం జీడిమాకులపల్లికి చెందిన శ్రీనివాస్ యువకుడు బ్రెయిన్ స్ట్రోక్‌తో తొమ్మిది రోజుల క్రితం ఈ ఆసుపత్రిలో చేరాడు. ఇప్పటి వరకు అతని కుటుంబం నుండి మూడు లక్షల వరకు ఆస్పత్రి యాజమాన్యం వసూలు చేసిందని, చివరకు అతని భార్య, తల్లి పుస్తెల తాకట్టు పెట్టి ఆసుపత్రి ఫీజు చెల్లించారని కుటుంబ సభ్యులు వాపోయారు. ప్రాణాలు కోల్పోయినా ఏమాత్రం మానవత్వం చూపకుండా 45 వేలు రూపాయలు చెల్లించాలంటూ మంగళ వారం ఉదయం నుండి మృతదేహాన్ని ఇవ్వకుండా ఆసుపత్రి యాజమాన్యం ఇబ్బందులు పెట్టిందని ఆరోపించారు. డిఎంహెచ్‌వోకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు.

**ఆ ఆస్పత్రిని వెంటనే సీజ్ చేయండి: ఈశ్వరయ్య**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య తిరుపతి నగరంలో ఉన్న రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను వెంటనే సీజ్ చేయాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ప్రజలకు సేవచేయాల్సిన వారే దోచుకోవడం ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది ఇలా ఉండగా...

**విధుల నిర్లక్ష్యం పై ఇరువురు హెడ్ నర్సుల సస్పెన్షన్**

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల కు సరైన సేవలు అందించాల్సిన ఇద్దరు నర్సులు విధులను మరిచారు. ఇన్‌స్టాగ్రాంలో రీల్స్ పోస్ట్ చేయడం పై ఉన్న దృష్టిని ఉద్యోగ బాధ్యతలపై ఉంచడం లేదని తెలుసుకున్న పై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దీంతో ఐటెం సాంగ్స్‌కు డాన్స్ వేస్తున్న ఇరువురు హెడ్‌నర్సు లను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై విచారణకు ఆదేశాలు జారీచేశారు. దీనికి సహకరించిన 16 మంది సిబ్బందికి అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ రీల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఉన్నతాధికారులు అప్రమత్తమయి వారిపై తగిన చర్యలు తీసుకొనడం కొసమెరుపు. ఉద్యోగులు విధులు నిర్వహించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# జగన్ చేసిన అప్పులతో ప్రభుత్వానికి యేటా రూ.71,800 కోట్ల భారం

**రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**



గుంటూరు, మార్చి 10 ప్రభాతవార్త ప్రతినిధి: సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడమే పనిగా జగన్ ఐదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించాడని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. భారతి సిమెంట్, సాక్షి పత్రికకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పనిచేశాడని ఆరోపించారు. మంగళవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ భారతీ సిమెంట్‌కు లబ్ధి చేకూరే విధంగా సిమెంట్ ధర రూ.3 పెంచి సుమారు రూ.165 కోట్లు ప్రజలపై భారం వేశాడని మండిపడ్డారు. దీంతో భారతీ సిమెంట్ సామర్థ్యం మూడు రెట్లు పెరిగిందన్నారు. జగన్ అసెంబ్లీకి రాకుండా ఇంట్లో ఉంటూ రాష్ట్ర ఆర్థిక రంగంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన అన్ని అవకాశాలను జగన్ వదిలేసి నేడు ప్రభుత్వంపై ఒకటే పనిగా బురద జల్లే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు.

జగన్ ఆర్థిక విధ్వంసానికి సాక్షం కాగ్ నివేదిక: చంద్రబాబు నాయుడు నాయకత్వానికి రాష్ట్ర ప్రజలు 164 సీట్లు అప్పగించారనే నమ్మకంతోనే కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోందని మంత్రి అన్నారు. వైసిపి ఐదేళ్ల పరిపాలనలో సుమారు 9.70లక్షల కోట్లు అప్పు చేశారని ఆ అప్పు కూటమి ప్రభుత్వం చేసినట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రూ. 81వేల కోట్లు ప్రభుత్వం అప్పు తీసుకుందని కాగ్ నివేదిక ఇస్తే వైసీపీ రూ.87 వేల కోట్లుగా ప్రచారం చేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు అప్పులే కాకుండా ఆస్తులను సృష్టిస్తున్నామని వైసీపీ బాధ్యత రహిత పరిపాలనతో బ్యాంక్ లు అప్పులు ఇవ్వడం మానేశాయన్నారు. పెట్టుబడులు దారులు రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిస్థితిలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందన్నారు. ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాజీ పడటం లేదని తొలి ఏడాదిలో ప్రభుత్వ ఉద్యోగస్థులకు రూ.20వేల కోట్లు చెల్లించామన్నారు. ప్రతీ నెల మొదటి తేదీకే జీతాలు చెల్లిస్తున్నామని చంద్రబాబు నాయుడు నాయకత్వంతో మరల రాష్ట్రంలో విశ్వసనీయత పెరిగిందన్నారు.

**గతం కంటే సంక్షేమానికి 45శాతం అధికంగా ఖర్చు:** జగన్ హయంలో ఐదేళ్లలో అమ్మ ఒడి పథకానికి రూ. 26వేల కోట్లు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సామాజిక పింఛన్లు కోసం జగన్ రూ.58,500 కోట్లు ఖర్చు చేస్తే కేవలం ఇరవై నెలల్లోనే రూ.58,654 కోట్లు ఖర్చు చేశామని గుర్తు చేశారు. రైతులకు జగన్ ఐదేళ్లలో రూ. 14 వేల కోట్లు ఖర్చు చేస్తే ఒక్క సంవత్సరంలో రూ. 6300 కోట్లు ఇచ్చామని గతంతో పోల్చితే 45 శాతం వరకు అదనపు నిధులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. పంచా యతీ గ్రాంట్స్, కేంద్ర ప్రభుత్వ పథకాలను జగన్ పక్కదారి పట్టిం చారని ఆయన హయంలో సర్పంచ్‌లు అధికారాలు తీసి ఇంట్లో కూర్చొబెట్టారన్నారు. ఐదేళ్ల రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఇప్పుడు అసత్యాలు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టాలని జగన్ చూస్తున్నాడని అన్నారు. సాక్షి పత్రిక, టీవీలో నచ్చిన వారిని కూర్చొబెట్టి అసత్య వార్తలను ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని చివరికి అన్నం పెట్టే రైతులను మోసం చేసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని ఎద్దేవా చేశారు. వైసీపీ హయంలో ధాన్యం అమ్మిన ఆరు నెలలు వరకు డబ్బులు జమా అయ్యేవి కావని నేడు 24 గంటల్లో రైతు అకౌంట్ లో డబ్బులు జమా చేస్తున్నామన్నారు.

**సొంత కంపెనీల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన జగన్:** రాష్ట్రానికి ఆదాయం తీసుకొచ్చి మార్గాలను వదిలేసిన జగన్ తన ఆదాయానికి ఏ మాత్రం డోకా లేకుండా భారతీ సిమెంట్ కు లబ్ధి చేకూర్చారని మంత్రి ఎద్దేవా చేశారు. సిమెంట్ ధర రూ.3 పెంచి రూ.165 కోట్లు ప్రజలపై భారం వేశారని సుమారు భారతీ సిమెంట్ సామర్థ్యం మూడు రెట్లు పెంచాడని అన్నారు. సాక్షి పత్రికకు ప్రకటన రూపంలో రూ.400 కోట్లు ఇచ్చారని ప్రత్యేక జీవోలు తీసుకొచ్చి వాలంటీర్స్, సచివాలయ సిబ్బందికి కేవలం సాక్షి పత్రికలు మాత్రమే సరఫరా చేశారని తెలిపారు. సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నామో ఆదాయ వనరులు కూడా అలానే తీసుకురావాలని, అప్పుడే రాష్ట్ర ఆర్థిక రంగం గాడిలో పడుతుందని అన్నారు. ఐదేళ్ల బటన్ నొక్కడమే పనిగా జగన్ పని చేశారని ఆదాయ వనరులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారుని విమర్శించారు.




# వైద్య సేవల్లో లోపాలుండొద్దు

- అన్ని విభాగాలలో అవసరమైన పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి: జిల్లా కలెక్టర్

నెల్లూరు. మార్చి 10, ప్రభాతవార్త –వైద్యం: ప్రభుత్వ సర్వజన ప్రధాన వైద్యశాలలో లక్ష్యానికి అనుగుణంగా శస్త్ర చికిత్సలను నిర్వహించేందుకు అవసరమైన పరికరాల కొనుగోలుకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. మంగళవారం నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని లెక్చర్ హాల్‌లో అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ మిమాన్షు శుక్ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్లినికల్, నాన్ క్లినికల్ సంబంధిత విషయాలపై కూలంకుషంగా చర్చించారు ప్రధానంగా ఆసుపత్రిలో నిర్వహించాల్సిన మేజర్ సర్జరీల విషయంలో శాఖల వారీగా జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, చెవి ముక్కు గొంతు, ఆంకాలజీ, గైనకాలజీ, ఆప్తాల్ మాలజీ తదితర శాఖలపై చర్చించి లక్ష్య సాధనలో వెనుకబడి ఉండుటకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన పరికరాలకు కొనుగోలుకు ప్రతిపాదనలను డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వచ్చి వారం రోజుల లోపల జాబితాను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. అంతేకాకుండా ఫిజియథెరఫీ, సైక్రియాటిక్ విభాగాలకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని కోరారు. ఏపీ ఎంఎస్ ఐడీసీ వారి ద్వారా ఐసీయూలో ఉన్న బెడ్ల పరిస్థితులను పరిశీలించి అవసరమైతే నూతన బెడ్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వజన వైద్యశాలలో సర్జరీల సంఖ్య పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాన్ క్లినికల్ వియాలపై చర్చిస్తూ ప్రధానంగా రక్షణకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ప్రధాన గేటు వద్దనే అధిక సంఖ్యలో పేషెంట్‌తో పాటు వచ్చే అటెండెంట్‌లను తగ్గించాలని దానికి అనుగుణంగా పోలీసు శాఖ అవసరమైన చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ సౌజన్యకు సూచించారు. మెయిన్ గేటు వద్ద నుండే జనాలను కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే లోపల కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందని తగు విధంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఆసుపత్రి పరిసరాలలో రాత్రి పూట 9 గంటల తదుపరి చీకటి ఎక్కువగా ఆవరించి ఉంటుందని దానిని నివారించేందుకు రానున్న 15 రోజుల లోపల మంచి లైటింగ్‌ను ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఆసుపత్రి లోపల అదనపు లైటింగ్ ఏర్పాటు చేయాలని అదే విధంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పవర్ బ్యాక్ ఆప్ ను ఉంచాలని అన్నారు. ఆసుపత్రి లోపల టార్చిలతో కానీ మొబైల్ లైటింగ్‌లనువాడడం జరగకూడదని ఆయన అన్నారు. అవసరమైన సిబ్బందిని ప్రత్యక్ష నియామకం ద్వారా కాకుండా సర్దుబాటు ద్వారా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో చెత్త నియంత్రణకు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తొలగించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ శాఖ సిబ్బందికి సూచించారు. అంతే కాకుండా కుక్కలు, కోతులు విచ్చలవిడిగా తిరగకుండా నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి ఆసుపత్రులు అందిస్తున్న సేవలు, సాధించిన ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎన్ఎస్ అనూష; సూపరింటెండెంట్ కే.మాధవి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పరిమళ, ఏడీ ఏడుకొండలు, డాక్టర్ సుజాత, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల డాక్టర్లు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మడపర్తి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌డిటికి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలి

- లేనిపక్షంలో కలిసొచ్చే పార్టీలు ప్రజాసంఘాలతో ఏప్రిల్ 2 నుంచి ప్రభుత్వ పరిపాలన స్తంభింప చేస్తాం
- వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత హెచ్చరిక



అనంతపురం, మార్చి 10 ప్రభాతవార్త బ్యూరో: పార్లమెంటు సమావేశాలు ముగిసేలోగా ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్ఏ రెన్యూవల్ చేయాలని, అట్లు చేయని పక్షంలో ఏప్రిల్ 2 నుంచి పరిపాలన స్తంభింపజేస్తామని, కలిసి వచ్చే పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతం చేస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం వైసిపి సమన్వయ కర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పిలో లక్ష పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, సమన్వయకర్తలు సాకే శైలజా నాథ్, విశ్వేశ్వర్ రెడ్డి, జెడ్పి చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, నియోజకవర్గ పరిశీలకులు మహేంద్రరెడ్డి, నాయకులు ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి, కె.వి రమణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ తొలుత అనంతపురం జిల్లాకు వచ్చినప్పుడు గో బ్యాక్ ఆర్డీట్టీ అంటూ కొందరు వ్యతిరేకించారని, అప్పట్లో తన తండ్రి అనంత వెంకటరెడ్డి ఆర్డీటీకి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఈ రోజు ఆర్డీటీపై మతం ముద్ర వేసి దేశంలోనే లేకుండా చేయాలన్న కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆర్డీటీ సంస్థ అహర్నిశలు కృషి చేసిందన్నారు. దళిత, గిరిజనులకు విద్యను చేరువ చేసిందని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొందించడం కోసం తొలుత చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టింది ఆర్డీటీ సంస్థేనని తెలియజేశారు. ప్రభుత్వాలకు స్ఫూర్తినిచ్చేలా ఆర్డీటీ పని చేసిందని తెలిపారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కోసం జిల్లాలో ఉద్యమాలు జరిగితే వాటిని కట్టడి చేసే ప్రయత్నాలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వంతో పనిచేస్తున్న సంస్థకు అందరూ అండగా ఉండాలని, ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయని, ఏప్రిల్ 2వ తేదీలోగా ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పరిపాలన స్తంబింప జేస్తామని ప్రజలు, కలిసొచ్చే పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి కలెక్టరేట్‌ను దిగ్బందిస్తామని స్పష్టం చేశారు. ఆర్డీటీ విషయంలో ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. చివరకు గ్రామాల్లో అడుగుపెట్టలేని పరిస్థితిని తెచ్చుకోవద్దని తెలిపారు. ఆర్డీటీ పరిరక్షణ కోసం గతంలోనే బైక్ ర్యాలీ, పాదయాత్రలు చేశామని, ఇప్పుడు ప్రధాని మోదీకి లక్ష పోస్టుకార్డులు పంపుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి సమన్వయకర్తలు, జిల్లా నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆడిట్ చేసిన సేవలు అపారం అని, ఆర్డిటిని సంరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఏ లైసెన్స్ వచ్చేవరకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. మన జీవితాల్లో ఆర్డీటీ ఒక భాగమని, అలాంటి సంస్థను అందరూ కలిసికట్టుగా కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు.




# రైతుల పరిస్థితి అగమ్యగోచరం

**పిసిసి అధ్యక్షురాలు షర్మిల**

అమలాపురం, మార్చి10 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ లోను,దేశంలో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా వుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లో ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర కి హాజరైన పి. సి సి అధ్యక్షురాలు షర్మిల మహాత్మా గాంధీ ఉపాధి పథకం పేరు మార్చడం పై బిజెపి కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. పార్లమెంట్ లో ఇచ్చిన రిపోర్ట్ ఇందుకు నిదర్శనమని మన దేశ రైతుల అప్పులు రూ30 లక్షల కోట్లని పేర్కొన్నారు.మన రాష్ట్ర రైతుల అప్పులు 3.75 లక్షల కోట్ల రూపాయలని అప్పుల్లో దేశంలోనే రాష్ట్రం రెండో స్థానం గావుందని ప్రకటించారు.దేశ రైతుల అప్పుల్లో మన రాష్ట్ర రైతుల అప్పులు 10 శాతంగా వుందని,రాష్ట్రంలో ప్రతి రైతుకు సగటున 2 నుంచి 7 న్నర లక్షల అప్పు ఉన్నట్లు తెలిపారు.రాష్ట్ర రైతాంగం మొత్తం అప్పుల్లో మునిగిపోయిందని రైతులను అప్పుల్లో ముంచడమేనా చంద్రబాబు వ్యవసాయం లాభసాటి అని తెలిపారు.ఇదేనా రైతు సంక్షేమ ప్రభుత్వం కేంద్రంతో సంబంధం లేకుండా రూ 20 వేలు ఇస్తామని మోసం చేశారని రైతులకు సుఖీభవ కింద ఇస్తున్నది రూ 14 వేలేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో 93 లక్షల మంది రైతులంటే, మీరిచ్చింది కేవలం 47 లక్షల మందికే నని కౌలు రైతులకు రాష్ట్రంలో దిక్కులేదని రైతు పండించిన పంటలకు కనీస గిట్టుబాటు ధర లేదని షర్మిల విమర్శించారు.రాష్ట్రంలో ఏ పంటకు కనీస మద్దతు ధర అందలేదని ధరల స్థిరీకరణ నిధి పేరుతో మోసమే జరిగిందన్నారు. ముష్టి 500 కోట్లు బడ్జెట్ లో పెట్టి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో కనీసం రైతులకు యూరియా సైతం ఇవ్వలేదని బీజేపీ పార్టీ తో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ అధికార పొత్తు పెట్టుకుంటే,జగన్ మోహన్ రెడ్డి అక్రమ పొత్తు పెట్టుకున్నారని సంచల వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని అవ్వడం ఖాయమని మళ్ళీ ఉపాధి హామీకి మహాత్మా గాంధీ పేరు పెడతామని,150 రోజుల పని దినాలు పెంచి 400 రూపాయలు వేతనం ఇస్తామని షర్మిల హామీ ఇచ్చారు.అమలాపురం నియోజకవర్గంలోని బట్నవిల్లి గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో స్థానికులు త్రాగునీటి కొరతపై ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తీవ్రంగా మంచినీటి సమస్య ఉందని, సరైన త్రాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రచ్చబండ కార్యక్రమం జరుగుతుండగానే స్థానికుల సమస్యను గమనించిన వైఎస్ షర్మిల జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అమలాపురం ప్రాంతంలో నెలకొన్న త్రాగునీటి ఎద్దడిపై తక్షణ చర్యలు తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు.సి డబ్ల్యూ ఎస్ సభ్యులు గిడుగు రుద్రరాజు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాస్, బిఆర్‌కె నాయుడు, అమలాపురం అసెంబ్లీ ఇంచార్జి అయితాబత్తుల సుభాషిణి, ముషిణి రామకృష్ణ, గెడ్డం సురేష్ బాబు, వంటెద్దు బాబీ తదితరులు ఉన్నారు.

**ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ బిల్‌కు**

# వ్యతిరేకంగా నిరసన

**తిరుపతి,మార్చి 10ప్రభాతవార్త ప్రతినిధి:** పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్న ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ బిల్‌కు వ్యతిరేకంగా తిరుపతిలో ఎస్పీడిసిఎల్ ఉద్యోగుల సంఘాలు నిరసన తెలిపాయి. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామసమయంలో ఈ నిరసన వ్యక్తం చేసి ఈ బిల్లు అమల్లోకి వస్తే ప్రైవేటీకరణకు దారితీస్తుందన్నారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్ అమల్లోకి వస్తే విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేటీకరణకు దారితీసే అవకాశం ఉందని, దీని వల్ల ప్రభుత్వ విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితి దెబ్బతినడంతో పాటు వినియోగదారులపై అదనపు భారం పడే ప్రమాదం ఉందని తెలిపారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఇంజనీర్ల భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావంపడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సంఘ నాయకులు డిమాండ్ చేశారు.

# కట్టుకున్నోడే కాలయముడు..

## అనుమానంతో కడతేర్చాడు.. కథ అల్లాడు

- గంగా భవాని మృతి మిస్టరీ చేదించిన బల్లికురవ పోలీసులు
- నిందితుడు అరెస్ట్




బల్లికురవ, మార్చి 10 ప్రభాతవార్త: క్షణికావేశం, భార్యపై అనుమానం, తాను చేసిన 15 ఏళ్ల కాపురం, తన ఇద్దరు కన్న కూతర్లను కూడా మరిచిపోయేలాగా చేసింది. భార్యను హతమార్చి తాను జైలు ఊచలు లెక్కబెడుతుంటే, తమ కడుపున పుట్టిన పాపానికి ఆ ఆడ బిడ్డలు, తల్లిదండ్రులకు దూరమైన ఎంత నరకయాతన అనుభవిస్తారో అనే తలంపు ఒక్క క్షణం, ఆలోచన వచ్చినా ఇంతటి ఘోరానికి పాల్పడే వాడు కాదు వీరాంజనేయులు. ఉమ్మడి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వల్లాపల్లి గ్రామానికి చెందిన గుంటుపల్లి, గంగా భవానీ మృతి కేసులో మిస్టరీ వీడింది. భర్త గుంటుపల్లి వీరాంజనేయులు తన భార్య గంగా భవానిని తానే కాలువలో తోసి హతమార్చినట్లు మంగళవారం వల్లాపల్లి వీఆర్వో సాయి ప్రసన్న ఎదుట అంగీకరించాడు. వీఆర్వో సాయి ప్రసన్న హంతకుడు వీరాంజనేయులును స్థానిక పోలీసు స్టేషన్లో సంతమాగులూరు సిఐ కాకుమాను వెంకట్రావుకు అప్పగించారు. తమదైన శైలిలో విచారించగా తాను చేసిన ఘోరాన్ని వెళ్ళగక్కాడు. కొణిదెన గ్రామానికి చెందిన కొణిదెనగంగా భవానికి, వీరాంజనేయులకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. బేల్దారి మేస్త్రీగా పనిచేసే వీరాంజనేయులు గత మూడేళ్లుగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో భాగంగానే ఈ నెల 3వ తేదీన గుంటుపల్లి వీరాంజనేయులు, గంగా భవానిలు ఎబిసి 33వ మైలు ఎగువ భాగంలో గొర్రె పిల్లలకు, ఆకు కోసేందుకు వెళ్లే.. మధ్యలో మంచినీరు తాగేందుకు కాలువలో దిగి తన భార్య గల్లంతయినట్లు భర్త వీరాంజనేయులు కథ సృష్టించాడు. ఆ తర్వాత కాలువలో నీటి సరఫరా తగ్గించడం మృతదేహం కోసం తీవ్రంగా శ్రమించిన పోలీసులు 7వ తేదీన మృతదేహాన్ని గుర్తించడం, దర్యాప్తును వేగవంతం చేయడంతో తప్పించుకోలేనని తెలిసి హంతకుడు వీరాంజనేయులు లొంగిపోయాడు.

పోలీసుల విచారణలో గత మూడు సంవత్సరాలుగా తన భార్యపై పెంచుకున్న అనుమానంతోనే ఆమెను హతమార్చినట్లు వెల్లడించాడు. గతంలో ఘర్షణ పడి ఒకసారి గంగా భవాని కాలు కూడా విరగొట్టాడు. ఇటీవల భార్యపై అనుమానం మరింతగా బలపడడంతో ఆమెను హతమార్చాలని నిర్ణయానికి వచ్చాడు. గత మంగళవారం ఆకు కోసం అనే నెపంతో తాడుతో ఉరివేసి చంపాలనుకున్నాడు. అది కుదరకపోవడంతో బహిర్భూమికి వెళ్లి వస్తున్న గంగా భవానిని కాలువలో తోసి హతమార్చాడు. ఆ తర్వాత కథ అల్లాడు. పోలీసులు తమదైన రీతిలో స్పందించడంతో అసలు విషయాన్ని వెళ్లగక్కాడు. గంగా భవాని సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ వై.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు మరింత వేగవంతం చేశాడు. వీరాంజనేయులు పొంతన లేని సమాధానాలతో అతనిపై అనుమానపడ్డ ఎస్ఐ వై.నాగరాజు వారం రోజుల వ్యవధిలోనే కట్టుకున్న వాడే కాలయముడు అని గుర్తించి అరెస్టుచేయగలిగారు. వరుసగా పలు కేసులలో నెలకొన్న మిస్టరీని చేధించిన ఎస్ఐ వై.నాగరాజును మండల ప్రజానీకం, అధికార యంత్రాంగం అభినందిస్తున్నారు. హంతకుడు వీరాంజనేయులును అద్దంకి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారు.



131 కోట్ల ప్రైజ్‌మనీ

## బిసిసిఐ నజరానా

**ముంబై:** టీ20 ప్రపంచకప్ నెగ్గిన సూర్యసేనకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. సొంతగడ్డపై కప్ నెగ్గి యావత్ భారతావనిని సంబరాల్లో ముంచెత్తిన టీమిండియాకు 131 కోట్ల నగదు బహుమతిని ఇవ్వనున్నట్లు బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా వెల్లడించారు. 2024లో రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా టీ20 వరల్డ్‌కప్ చేజిక్కించుకుంది. ఆ సమయంలో బీసీసీఐ 125 కోట్లను బహుమతిగా ప్రకటించగా, ఈసారి సూర్యసేనకు అదనంగా మరో ఆరు కోట్ల రూపాయలను పెంచింది. టీ20 ప్రపంచకప్ 2026 విజేతగా నిలిచిన తర్వాత టీమ్‌ఇండియాకు 27.48 కోట్ల ప్రైజ్‌మనీ, రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్‌కు 14.65 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. ప్రైజ్‌మనీతో కలుపుకుంటే టీమిండియా విన్నింగ్ టీమ్ సభ్యులు ఒక్కొక్కరికి దాదాపు 15 కోట్లు లభించనుంది. భారత్ అతిథ్యమిచ్చిన టీ20 ప్రపంచకప్‌లో సూర్య సేన అద్భుత ప్రదర్శన చేసింది. నాకౌట్ స్టేజ్‌లో మ్యాచ్‌లను వన్‌సైడ్‌గా ముగించి విజేతగా నిలిచింది.

## ఐసిసి జరిమానా

**న్యూఢిల్లీ:** భారత పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై ఐసీసీ జరిమానా పడింది. టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో అనుచిత ప్రవర్తనకు గాను అర్షదీప్ మ్యాచ్ ఫీజులో 15శాతం కోత విధించింది. ఐసీసీ కోడ్ ఉల్లంఘించినందుకు జరిమానాతోపాటు ఒక డీమెరిట్ పాయింట్ అర్షదీప్ ఖాతాలో చేరింది. గత 24 నెలల్లో ఇదే తొలి జరిమానా కావడంతో మ్యాచ్ వేటు తప్పింది. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో 11వ ఓవర్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. మిచెల్ రెండు వరుస సిక్స్‌లు బాదడంతో అర్షదీప్ అసహనానికి గురయ్యాడు. తరువాతి బంతికి డారిల్ మిచెల్ స్ట్రెయిల్ డ్రైవ్ ఆడాడు. బంతిని అందుకున్న అర్ష దీప్.. బ్యాట్స్‌మెన్‌పైకి నేరుగా విసిరాడు. దీనిపై మిచెల్ తీవ్ర ఆగ్రహంతో అర్షదీప్ వెపు దూసుకు వచ్చాడు. అర్ష్‌దీప్ మాత్రం ఏమీ పట్టించుకోకుండా బౌలింగ్ రనప్ వైపు వెళ్లిపోయాడు. మిచెల్ వద్దకు కెప్టెన్ సూర్య వెళ్లి సర్ది చెప్పాడు. తాను మిచెల్ కు సారీ చెప్పానని.. కావాలని అలా విసరలేదని వివరించినట్లు అర్ష్‌దీప్ సింగ్ తెలిపాడు.




## క్రికెట్ పిచ్ నుంచి పెళ్లి పీటలపైకి



**ముస్సోరి:** టీమిండియా టాప్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఓ ఇంటివాడు కానున్నాడు. తన చిన్ననాటి స్నేహితురాలు వన్షిక చద్దాను ఈనెల 14న పెళ్లి చేసుకోబోతున్నాడు. వీరి వివాహానికి ఉత్తరాఖండ్ ముస్సోరిలోని ఓ రిసార్ట్ వేదికకానుంది. 13న ప్రీ వెడ్డింగ్ జరగనుంది. కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య పెళ్లితంతు నిర్వహించనున్నారు. 17న లక్నోలో గ్రాండ్‌గా జరిగే రిసెప్షన్‌కు టీమిండియా క్రికెటర్లు, మాజీ క్రికెటర్లు, బీసీసీఐ అధికారులు హాజరుకానున్నారు. కుల్‌దీప్, వన్సిక ఎంగేజ్‌మెంట్ గత ఏడాది జూన్4న జరిగింది. టీ20ప్రపంచకప్ నేపథ్యంలో పెళ్లిని వాయిదా వేసుకున్నారు. ప్రపంచకప్ ముగియడంతో వీరిద్దరూ పెళ్లిపీటలెక్కనున్నారు.

## షూటింగ్‌లో మను భాకర్ టాప్



గురితప్పని లక్ష్యం

**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్‌సెలక్షన్ ట్రయల్స్ మహిళల 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ అగ్రస్థానంలో నిలిచింది. గురితప్పని షూటింగ్‌తో మొత్తం 246.1 పాయింట్లు స్కోరు చేసింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్ సెయిన్యం 241.9 పాయింట్లతో, ఆసియా ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్ ఇషా సింగ్ 220.26 వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. మను బాకర్ కంటే సెయిన్యం కేవలం 4.2 పాయింట్లతో వెనకబడింది. ఆసియా క్రీడల ఛాంపియన్ పాలక్ గులియా 200.2 స్కోరుతో నిరాశ పరిచింది. నాలుగో స్థానంతో సరిపెట్టింది. భారత జాతీయ షూటింగ్ జట్టు మరో కోచింగ్ క్యాంప్ ఢిల్లీలోని తుగ్లకాబాద్ షూటింగ్ రేంజ్‌లో కొనసాగుతోంది.

# వేల్స్‌పై గెలిస్తే సెమీస్ బెర్త్

**మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫైయింగ్ ● ఫుల్ జోష్ మీదున్న భారత్**



**హైదరాబాద్(వార్త క్రీడా ప్రతినిధి) :** గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరుగుతున్న మహిళల హాకీ ప్రపంచ కప్ క్వాలిఫయర్స్‌లో భారత్ జోరుచూపుతోంది. సెమీఫైనల్‌పై ఫోకస్ పెట్టింది. ఉరుగ్వేపై 4-0 గోల్స్ తేడాతో నెగ్గిన భారత అమ్మాయిలు... రెండో మ్యాచ్‌ను స్కాట్లాండ్‌తో 2-2తో డ్రా చేసింది. రెండు మ్యాచ్‌లు ఆడిన భారత్ 4 పాయింట్లతో పూల్-బిలో టాప్ ప్లేస్‌లో నిలిచింది. నేడు వేల్స్‌తో చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే సెమీస్ బెర్త్ దక్కుతుంది. డ్రా చేసుకున్నా సెమీస్ అవకాశాలు మెండుగానే ఉంటాయి. ఈ మ్యాచ్ రాత్రి 7.30గంటలకు గచ్చిబౌలిలో జరగనుంది.

పూల్-బిలో 4 పాయింట్లతో స్కాట్లాండ్‌తో భారత్ సమానంగా ఉన్నా.. మెరుగైన గోల్ తేడాతో టాప్ ప్లేస్ పొందింది. ప్రతి పూల్ నుండి మొదటి రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఉరుగ్వే 3 పాయింట్లతో, వేల్స్ గెలుపు ఖాతా లేకుండా ఉంది. భారత మహిళలు ఫుల్ జోష్‌తో ఉన్నారు. యువ ఫార్వర్డ్ సునెలిటా టోప్పో రెండు మ్యాచ్‌లలోనూ గోల్ చేస్తూ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నారు. అటాకర్లు లాల్రెమ్సియామి, నవనీత్ కౌర్, రుతుజా అద్భుతంగా రాణిస్తున్నారు. భారత డిఫెన్స్ కూడా దృఢంగాఉంది. గోల్‌కీపర్ బిచుదేవి స్థిరంగా సేవ్‌లుచేస్తున్నారు.

జట్టు ఆటతీరుపై భారత కెప్టెన్ సలీమా టెటే సంతృప్తి వ్యక్తం చేసింది. యువ ఆటగాళ్లు తమ అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారని తెలిపింది. ఇది తమకు చాలా సానుకూలాంశమని, వేల్స్‌పై నెగ్గి సెమీస్ చేరుతామన్న ధీమా వ్యక్తం చేశారు.

ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో టాప్-3లో నిలిచిన జట్లు ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్‌లలో జరిగే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి. సెమీఫైనల్స్ 13న... ఫైనల్ 14న జరుగుతాయి.

## స్విస్ ఓపెన్‌పై కిడాంబి శ్రీకాంత్ ఆశలు

**స్విట్జర్లాండ్:** స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో హైదరాబాదీ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ భారీ అంచనాలు ఉన్నాయి. గత ఏడాది రెండు టైటిల్స్‌కు విజయం దూరంలో ఉండిపోయిన శ్రీకాంత్ మరోసారి టైటిల్ వేటకు సిద్ధమయ్యాడు. స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 టోరీల్నో శ్రీకాంత్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ 42వ ర్యాంకర్ జేసన్ గుణవాన్ (హాంకాంగ్)తో శ్రీకాంత్ తలపడతాడు. గత ఏడాది మలేసియా మాస్టర్స్, సయ్యద్ మోడీ టోర్నీల్లో ఫైనల్‌కు చేరి రన్నరప్‌తో సరిపెట్టుకున్న శ్రీకాంత్.. ఈ సీజన్‌లో టైటిల్ నిరీక్షణకు తెరదించాలన్న పట్టుదలతో ఉన్నాడు. శ్రీకాంత్ చివరిసారి 2017లో ఫ్రెంచ్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. శ్రీకాంత్‌తోపాటు స్విస్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, ఆయుశ్ శెట్టి, కిరణ్ జార్జి, తరుణ్ మన్నేపల్లి పోటీపడుతున్నారు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా, మాళవిక బన్సోద్ బరిలో ఉన్నారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ... మిక్స్‌డ్ డబుల్స్‌లో గద్దె రుతిక్వ శివాని-రోహన్ కపూర్, తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జోడీ బరిలోకి దిగారు.

## నాలుగో రౌండ్‌లో జొకోవిచ్



టైటిల్ వేటలో దూసుకుపోతున్న సెర్బియా స్టార్

**కాలిఫోర్నియా:** సెర్బియా స్టార్ నోవాక్ జొకోవిచ్ ఇండియన్ వేల్స్ టెన్నిస్ టోర్నీలో నాలుగో రౌండ్‌కు చేరుకున్నాడు. మూడో రౌండ్‌లో 72వ ర్యాంక్ అమెరికా ఆటగాడు అలెగ్జాండర్ కోవాసెవిచ్‌పై విజయం సాధించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో కార్లోస్ అల్కరాజ్ చేతిలో ఓడిన తర్వాత జొకోవిచ్‌కు ఇది తొలి టోర్నీ. ఇక తొమ్మిదేళ్ల తర్వాత తొలిసారి ఇండియన్ వేల్స్ టోర్నీ బరిలోకి దిగిన జొకోవిచ్ తొలి రౌండ్ నుంచి జోరు చూపుతున్నాడు. మూడో రౌండ్ తొలి సెట్‌ను 6-4తో నెగ్గిన జొకోవిచ్‌కు రెండో సెట్‌లో అలెగ్జాండర్ అనూహ్యంగా షాకిచ్చాడు. సెర్బియా సూపర్ స్టార్‌పై ఏకంగా 16 ఏస్‌లు సంధించి రెండో సెట్‌ను 6-1తో గెలుపొంది సమవుజ్జీగా నిలిచాడు. కీలకమైన మూడో సెట్‌లో ఆరంభంలోనూ అలెగ్జాండర్ గట్టి పోటీ ఇచ్చాడు. అయితే పుంజుకున్న జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేస్తూ 6-4తో ముగించి ఊపిరి పీల్చుకున్నాడు. జొకోవిచ్ ఐదుసార్లు ఇండియన్ వెల్స్ టైటిల్స్ నెగ్గి ఫెదరర్‌తో సమానంగా ఉన్నాడు. మిగతా గేమ్‌ల్లో బ్రిటన్‌కు చెందిన కామెరాన్ నోరీ 6-4, 6-4తో ఎనిమిదో ర్యాంక్ ఆస్ట్రేలియా ఆటగాడు అలెక్స్ డి మినౌర్‌ను ఓడించగా, ఆస్ట్రేలియన్ క్వాలిఫైయర్ రింకి హిజికాటా 6-7 (3/7), 7-6 (7/3), 6-3తో ఓడించడంతో పదో సీడ్ అలెగ్జాండర్ బబ్లిక్‌కు షాకిచ్చాడు.

## 12 మిలియన్ డాలర్ల ఐపిఒకు ఎక్సెడ్!

**అహ్మదాబాద్, మార్చి 10:** ఎగ్జిక్యూటివ్ లెర్నింగ్ సొల్యూషన్స్ సంస్థ ఎక్సెడ్ 12 మిలియన్ డాలర్ల ఐపిఒకు రెడీ అవుతోంది. ఈనెల 16వ తేదీనుంచి మార్కెట్లకు రావాలని నిర్ణయించింది. వాస్తవానికి ఈనెల ఆరవ తేదీనే నిర్ణయించినా మధ్యప్రాచ్య ఉద్రిక్తతలతో వాయిదా వేసింది. గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్‌సిటీ అంటే గిఫ్ట్‌సిటీనుంచి వస్తున్న మొట్టమొదటి ఐపిఒగా చెపుతున్నారు. ఐపిఒలో ఇష్యూధర రూ.10నుంచి రూ.10.5గా నిర్ణయించనున్నారు. బిడ్డింగ్ ఈనెల 24వ తేదీతో ముగుస్తుంది. ఎగ్జిక్యూటివ్‌స్థాయి ఉద్యోగులకు శిక్షణ ఇతర విద్యాపరమైన పరిష్కారాలు అందించడంలో ఈ సంస్థ ముందుంది. సీనియర్ వృత్తినిపుణులు సుమారు 25 దేశాలనుంచి ఎక్సెడ్‌లో శిక్షణకు వస్తుంటారు. వీరంతా మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియా, ఉత్తర అమెరికా దేశాలనుంచి వస్తుంటారని సంస్థ వెల్లడించింది.



## 'బులియన్'కు ట్రంప్ బూస్ట్

**పసిడి రూ.1,62,380.. వెండి కిలో 2.90 లక్షలు**

**ముంబయి, మార్చి 10:** బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అమెరికా డాలర్ బలహీనపడటం, మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలతో ముడి చమురు ధరలు పడిపోవడం వంటివి పసిడికి ఊపునిచ్చాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఏప్రిల్ గోల్డ్ ఫ్యూచర్స్ 1.15 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,62,150 వద్ద ట్రేడ్ అయింది. అదే సమయంలో మే సిల్వర్ ఫ్యూచర్స్ 3.68 శాతం లాభపడి కిలోకు రూ.2.77 లక్షలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 5,082.51 డాలర్లకు, స్పాట్ సిల్వర్ 82.50 డాలర్లకు పెరిగాయి. మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో ఉద్రిక్తతలు తగ్గే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యానించడంతో చమురు ధరలు భారీగా తగ్గాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ ఒక దశలో 10.85 శాతం పడిపోయి బ్యారెల్‌కు 88.22 డాలర్ల కనిష్ఠానికి చేరింది. చమురు ధరలు తగ్గితే ద్రవ్యోల్బణ భయాలు తగ్గుతాయని, ఫలితంగా కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచకపోవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఇది వడ్డీ ఆదాయం లేని బంగారానికి మద్దతునిస్తుంది. మరోవైపు డాలర్ ఇండెక్స్ 0.44 శాతం తగ్గి 98.74 వద్దకు చేరడంతో ఇతర కరెన్సీల కొనుగోలుదారులకు బంగారం చౌకగా మారింది. ప్రస్తుతం ఇన్వెస్టర్ల దృష్టి అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై ఉంది. రేపు వెలువడనున్న వినియోగదారుల ధరల సూచీ, శుక్రవారం విడుదలచేసే వ్యక్తిగత వినియోగ వ్యయాల (పీసీఈ) సూచీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 18న జరిగే ఫెడ్ పాలసీ సమావేశంలో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచవచ్చని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. 24క్యారెట్ల బంగారందరలు 1,62,380గాను, 22కేరట్ల బంగారం రూ.1,19,080గాను కొనసాగాయి. స్పాట్‌మార్కెట్‌లో కొన్ని చోట్ల వెండి కూడా రూ.2.90 లక్షలమార్కును చేరింది. డాలర్ విలువ 99 కంటే దిగువస్థాయికి పడిపోవడంతో వెండి,పసిడిధరల పెరుగుదలకు కారణం అయింది.




# రెండురోజుల నష్టాలకు బ్రేక్

**లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ**




**ముంబయి, మార్చి 10:** రెండు రోజుల వరుస ఈక్విటీ మార్కెట్ల నష్టాలకు బ్రేక్‌పడింది. మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగియవచ్చంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. దీంతో అంతర్జాతీయంగా ఆందోళనలు తగ్గడంతో కొనుగోళ్లకు మద్దతు లభించింది.

ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 639.82 పాయింట్లు పెరిగి 78,205.98 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 233.55పాయింట్లు లాభపడి 24,261.6 వద్ద ముగిసింది. ఇరాన్‌తో వివాదం కారణంగా గత కొన్ని రోజులుగా అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి. అయితే, ఈ వివాదం త్వరలోనే పరిష్కారమవుతుందని ట్రంప్ సూచించడంతో గ్లోబల్ మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొంది. ఈ పరిణామంతో అంతర్జాతీయ ముడిచమురు ధరలు కూడా దిగిరావడంతో మార్కెట్లకు కలిసొచ్చింది. ఈరోజు ట్రేడింగ్‌లో బెంచ్‌మార్క్ సూచీల కంటే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.62 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 2.12 శాతం మేర లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఆటో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి.

నిఫ్టీ ఐటీ సూచీ అమ్మకాల ఒత్తిడికి గురైంది. ఆయిల్ అండ్ గ్యాస్ రంగం కూడా బలహీనంగానే కదలాడింది. టెక్నికల్‌గా నిఫ్టీకి 24,300 వద్ద తక్షణ నిరోధం ఉందని, దానిని దాటితే 24,600 స్థాయికి చేరవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. శ్రీరామ్ ఫైనాన్స్ 8.05శాతం, ఐసిఐసిఐబ్యాంకు 2.69శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.99శాతం చొప్పున పెరిగాయి. బిఎస్‌ఇలోమిడ్క్యాప్‌సూచీ 1.66శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 2.04శాతం చొప్పున పెరిగాయి. బిఎస్‌ఇలో 3103 షేర్లుపెరిగితే 1175 కంపెనీలషేర్లు క్షీణించాయి. 155 కంపెనీలషేర్లుస్థిరంగా కొనసాగాయి. బ్రెంట్‌ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్లు 6.87డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 92.09 డాలర్లుగాకొనసాగింది. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 91.87వద్ద కొనసాగాయి. అంతకుముందురోజు 92.35గా కొనసాగిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ సెటిల్‌మెంట్లు రూ.1,61,700గా కొనసాగాయి. ఇక ఐపిఒలపరంగా ఇన్నోవిజన్ 1,21,635 షేర్లకుబిడ్లు అందాయి. మొత్తం 61,32,433 షేర్లను ఆఫర్‌కు కేటాయించింది. రాజపుతానా స్టెయిన్‌లెస్ కూడా 2.09 కోట్ల వాటాలకుగాను 88,08,580 షేర్లకు బిడ్లు అందాయి. ఇష్యూ 9వన ప్రారంభించింది. 11 మార్చితోముగుస్తుంది.

ఐపిఒ ఇష్యూధర రూ.116 నుంచి 122గా నిర్ణయించింది. ఇక షేర్లపరంగా హ్యాపియస్ట్ మైండ్స్ టెక్నాలజీస్ 17.85వాతం, మహీంద్ర అండ్ మహీంద్ర 3.67శాతం, జెఎస్‌డబ్ల్యు స్టీల్ 1.83శాతం, ఎబిబి ఇండియా 4.08శాతం, బిఎండబ్ల్యు వెంచర్స్ 3.71శాతం, అరవింద్ స్మార్ట్ స్పేసెస్ 3.77శాతం, బోరోసిల్ 12.03వాతం, హిందూజా గ్లోబల్ సొల్యూషన్స్ 0.05శాతం, సోలెక్స్ ఎ నర్జీ 4.66 శాతం, జగ్‌సోన్‌పాల్ ఫార్మా 4.24శాతం, ఓపిటమస్ ఇన్‌ఫ్రాకామ్ 3.08 శాతం, మిండా కార్పొరేషన్ 1.64శాతం, ఇంటరార్చ్ బిల్డింగ్ సొల్యూషన్స్ 5.13 శాతం, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ సంస్థ కూడా షేర్లు 5.22 శాతం చొప్పున పెరిగాయి.

## మ్యూచువల్‌ఫండ్స్‌కు రూ.26 వేల కోట్ల పెట్టుబడులు!

**ముంబయి, మార్చి 10:** మూచువల్‌ఫండ్స్ రంగంలో గతనెలలో మొత్తం నికరంగా రూ.25,977.81 కోట్ల పెట్టుబడులు అందాయి. అదే గత జనవరిలో 24,028.59 కోట్లవరకూ ఫండ్స్‌నిర్వహాణాస్తులు ఉన్నట్లు ఫండ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంఫీప్రకటించింది. మొత్తంగా ఫిబ్రవరిలో ఫండ్స్ రంగానికి రూ.94,530 కోట్లు నిధులు వచ్చాయి. అయితే జనవరిలో మాత్రం ఏకంగా రూ.1.56 లక్షలకోట్లు రావడం విశేషం. ఈక్విటీ కేటగిరీల్లో భారీగా పెరిగాయి. ఫ్లెక్సీక్యాప్‌ఫండ్స్‌కు ఎక్కువ పెట్టుబడులు వచ్చిట్లు ఆంఫీ డేటా చెపుతోంది. భారీక్యాప్‌ఫండ్స్ రూ.2111.68 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అదే జనవరిలో రూ.2,004.98 కోట్లు మాత్రమే అందాయి. మిడ్‌క్యాప్ కేటగిరీలో జనవరిలో వచ్చిన రూ.3185.47 కోట్లనుంచి ఫిబ్రవరిలో రూ.4,002.99 కోట్లకు పెరిగాయి. ఇక స్మాల్‌క్యాప్ కేటగిరీలో జనవరిలో రూ2942.11 కోట్లు రాగా ఫిబ్రవరిలో 3881.06 కోట్లవరకూ నిధులు అందాయి. ఫ్లెక్సీక్యాప్‌ఫండ్స్‌లో రూ.6924.65 కోట్లవరకూ నిధులున్నాయి. జనవరినెలలో అయితే రూ.7672.36 కోట్లురాగా ఫిబ్రవరిలో తగ్గాయి. వివిధ విభాగాలవారీగా వచిచన ఫండ్స్ రూ.1042.56 కోట్లనుంచి రూ.2987.29 కోట్లకు పెరిగాయి. డెట్‌ఫండ్స్‌లలోకి జనవరికంటే ఫిబ్రవరిలో తగ్గాయి. 74,827.13కోట్లనుంచి చూస్తే రూ.42,106.31కోట్లు ఫండ్స్ పెట్టుబడులున్నాయి. హైబ్రిడ్‌స్కీమ్స్‌లో రూ.11,983.37 కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. మధ్యవర్తిత్వరంగంలో ఫండ్స్ రూ.591.85కోట్లుగా ఉన్నాయి. ఇక గోల్డ్ ఇటిఎఫ్‌లు రూ.5254.95 కోట్లవరకూ పెట్టుబడులు వచ్చాయి.



## డాలరుతో రూపాయి రూ.91.85

**న్యూఢిల్లీ, మార్చి 10:** డాలరుతోరూపాయి మారకం విలువలు కొంతపెరిగాయి భారత్ రూపాయి 36 పైసలు లాభపడి మంగళవారం కరెన్సీ ట్రేడింగ్ ముగిసేనాటికి 91.85గా కొనసాగింది. ముడిచమురు ధరల్లో అంతర్జాతీ యంగా కొంతమేర తగ్గడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే విధంగా ట్రంప్ సంకేతాలు ఇవ్వడం కూడా రూపాయి బలపడేందుకు దోహదంచేసాయి.

ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజిలో భారత్ రూపాయి మారకం ట్రేడింగ్ 91.92వద్ద ప్రారంభం అయింది. ఒకదశలో 91.71 నుంచి 92.19వరకూ ట్రేడ్ అయి చివరకు 36 పైసలు లాభపడి 91.85వద్ద స్థిరపడింది. సోమవారం భారత్‌రూపాయి 92.21వరకూ క్షీణించింది. ఒక్కరోజే 39 పైసలు క్షీణించింది. రానున్న రోజుల్లో 91.60 నుంచి 92.20మధ్య కొనసాగవచ్చని అంచనావేసారు.

## కనీస నిల్వలరూపంలో బ్యాంకులు రూ.19 వేల కోట్లు వసూలు




**న్యూఢిల్లీ, మార్చి 10:** బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వలు (మినిమం బ్యాలెన్స్) లేని కారణంగా గడిచిన మూడేళ్లలో ప్రైవేటు రంగ బ్యాంకులు ఖాతాదారుల నుంచి రూ.11 వేల కోట్లు వసూలు చేసినట్లు కేంద్రం పార్లమెంటుకు వెల్లడించింది. ఇదే కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.8 వేల కోట్లు వసూలుచేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటుకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రైవేటు రంగ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ అత్యధికంగా రూ.3,800 కోట్లు కనీస నిల్వల నిబంధన పేరుతో ఖాతాదారుల నుంచి వసూలు చేసినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంకు రూ.2,700 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంకు రూ.1,200 కోట్ల చొప్పున వసూలు చేశాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంకు అత్యధికంగా రూ.1,500 కోట్లు వసూలు చేయగా, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.1,200 కోట్లు, ఇండియన్ బ్యాంకు రూ.1,100 కోట్ల చొప్పున వసూలు చేసినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. కాగా, కనీస నిల్వలపై ఎస్బీఐ 2020 మార్చి నుంచి ఛార్జీలు వసూలు చేయడం లేదు. గత ఏడాది నుంచి పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకు కూడా ఈ ఛార్జీలను తొలగించాయి. అలాగే దేశంలో రూ.10, రూ.20, రూ.50 వంటి తక్కువ విలువ కలిగిన కరెన్సీ నోట్లకు ఎలాంటి కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నోట్లు చలామణిలో సరిపడా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ఈ వివరాలను వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నివేదిక ప్రకారం, ఈ ఆర్థిక సంవత్సరంలో 439.40 కోట్ల పది రూపాయల నోట్లు, 193.70 కోట్ల ఇరవై రూపాయల నోట్లు, 130.30 కోట్ల యాభై రూపాయల నోట్లను సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. సాధారణంగా ఏటీఎంల ద్వారా చిన్న డినామినేషన్ నోట్లను పంపిణీ చేయరని, వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు స్మాల్ వాల్యూ డిస్పెన్సర్ల ద్వారా పంపిణీ చేసే ఒక పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు సభకు తెలియజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా ఆర్బీఐ ఎప్పటికప్పుడు వివిధ నోట్ల అవసరాన్ని అంచనా వేస్తుందని పంకజ్ చౌధరి వివరించారు. నోట్లు, నాణేలతో పాటు డిజిటల్ చెల్లింపుల ద్వారా కూడా తక్కువ విలువ లావాదేవీల అవసరాలు తీరుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# హై కోర్టు న్యాయమూర్తులను ఆహ్వానించిన జిల్లా కలెక్టర్ నాగరాణి



తాడేపల్లిగూడెం మార్చి 10,ప్రభాతవార్త :తాడేపల్లిగూడెంలో పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దోనాడి రమేష్, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి లను స్థానిక నిట్ కళాశాల నందు మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులతో కొద్ది సమయం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలపై వివరించడం జరిగింది. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను కలుసుకున్న సందర్భంలో ఏలూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జస్టిస్ ఎస్.శ్రీదేవి, తాడేపల్లిగూడెం అడిషనల్ డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి జస్టిస్ షేక్ సికిందర్ భాష, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీశీ అస్మి, తదితరులు ఉన్నారు.



# ఒకప్పుడు కళకళ – నేడు వెలవెల

## - తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి
## - ఇంచార్జి తహసిల్దార్ తో పది మాసాలుగా కాలక్షేపం

ప్రభాతవార్త చాట్రాయి : ఒకప్పుడు చాట్రాయి తహసిల్దార్ కార్యాలయం నిత్యం జనంతో కళకళలాడుతూ ఉండగా నేడు వెలవెల పోతోంది. రెగ్యులర్ తహసిల్దార్ లేక పది మాసాల నుండి ఇన్చార్జితో కాలక్షేపం కావడంతో ప్రజలకు పనులు కాక విసుగెత్తి కార్యాలయానికే రాని పరిస్థితి ఏర్పడింది. రెగ్యులర్ తహసిల్దార్ లేకపోవడంతో కార్యాలయానికి వచ్చినా పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రధానమైనది తహసిల్దార్ పోస్ట్ కాగా మంత్రి ఇలాఖాలో ఇన్చార్జి తో కొనసాగించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజలకు తహసిల్దార్ కార్యాలయానికి పనులు నిమిత్తం వచ్చినవారు వెను తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో కార్యాలయంలో పనులు కాక ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఇన్నిన్నికాకుండా ఉన్నాయి. ఇక రెవెన్యూ కార్యదర్శిల విషయానికొస్తే రెగ్యులర్ తహసిల్దార్ లేకపోవడంతో అమ్యామ్యాలు అధికంగా అడుగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాసుపుస్తకం కావాలంటే ఆన్లైన్లో పెట్టిన తర్వాత ఆ సంబందిత కార్యదర్శిని కలిసి బేరం మాట్లాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కార్యదర్శిని కలవకుండా ఆన్లైన్లో పెట్టి వదిలేస్తే ఏదో ఒక కుంటి సాకు చెప్పి రిజెక్ట్ చేస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో అజమాయిషి లేకపోవడంతో లంచాలు పెరిగిపోయాయని దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా మంత్రి పార్ధసారథి చాట్రాయి మండలం పై దృష్టి సారించి రెగ్యులర్ తహసిల్దార్ ను నియమించేందుకు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# ప్రజా సమస్యలను పరిష్కారానికి రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలి.
## -జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి.

భీమవరం మార్చి 10,ప్రభాతవార్త :జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ అధికారుల సదస్సులో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి జి ఆర్ ఎస్, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, రెవెన్యూ క్లినిక్స్, రీ సర్వే, 22 ఎ, ఈ–ఆఫీస్, ఆర్ ఓ బి, ఆర్ యు బి నిర్మాణాలు, తదితర రెవెన్యూ అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, భూ పరిపాలనకు సంబంధించిన సేవలు ప్రజలకు పారదర్శకంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలు, భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత రెవిన్యూ అధికారులపై ఉందన్నారు. భూ వివాదాల పరిష్కారం, వెబ్ ల్యాండ్ సేవలు, రైతులకు సంబంధించిన పత్రాల జారీ, ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, రికార్డుల సక్రమ నిర్వహణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. భూ సేకరణకు సంబంధించిన పనులను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి తప్పులు లేకుండా రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏప్రిల్ మాసంలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కి సంబంధించి తాజా నివేదికలపై తహసిల్దారులతో చర్చించారు. తక్కువ శాతం సాధించిన నరసాపురం, యలమంచిలి, పోడూరు మండలాలలో నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి స్వయంగా పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను తహసిల్దారులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మే నెలలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కొరకు ఇప్పటినుండి ప్రణాళిక తయారు చేసుకొని వచ్చే వారం నుండి పనులు ప్రారంభించాలన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ, ఈకేవైసీ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జిల్లాలో ప్రతిపాదిత ఆర్ యు బి, ఆర్ ఓ బిల నిర్మాణాలకు సంబంధించి భూ సర్వే, భూమి విలువ, స్ట్రక్చర్ నిర్మాణ అంచనాలు కొరకు సంబంధిత శాఖలు అధికారులు రైల్వే శాఖ అధికారుల సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారులు కె.రామచంద్రారెడ్డి, దోసి రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి వెంకటేశ్వరరావు, జిల్లాలోని మండల్ తహసిల్దార్లు మండల సర్వేయర్లు, ఆర్ అండ్ బి అధికారులు తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



# డ్రగ్స్ నివారణకై నూజివీడులో త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ

నూజివీడు, మార్చి 10 ప్రభాతవార్త: నూజివీడు నియోజకవర్గం లో "వైబ్రంట్స్ ఆఫ్ కలాం"ఆర్గనైజేషన్ వారు ఈ నెల 12వ తేదీన నిర్వహించే మాదక ద్రవ్య వ్యతిరేక ఉద్యమం "దండి మార్చ్ 2.0"కార్యక్రమం గురించి 500 మంది విద్యార్థులు మంగళవారం శ్రీ శారద కళాశాల విద్యార్థులు 100 మీటర్ల త్రివర్ణ పతాకం తో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీ శారద విద్యాసంస్థల డైరెక్టర్ కుప్పాల శంకర్రావు, కలాం ఆర్గనైజేషన్ నూజివీడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కట్టుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ద్వారకా సెంటర్, స్థానిక పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా, శ్రీకృష్ణ యూనివర్సిటీ పీజీ సెంటర్, ఎల్ఐసి కార్యాలయం మీదగా భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం శారద విద్యాసంస్థల డైరెక్టర్ శంకరరావు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు గంజాయి, పొగాకు ఉత్పత్తులు, మద్యం వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడకూడదు అన్నారు. ఇటీవల గంజాయి ఇక్కడ అక్కడ అనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల నుంచి రవాణా జరగడం వలన చాలామంది యువత వాటి బారిన పడి జీవచ్ఛవాలుగా మారుతున్నారని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మన యువతకు మంచి ఉద్యోగ , ఉపాధి కల్పనలో మంచి డిమాండ్ ఉందన్నారు. ఇదే అదునుగా కొన్ని దేశాల వారు ఈర్ష్యతో భారతదేశ యువతపై గురి పెట్టారని అన్నారు. పెద్ద ఎత్తున యువతను నిర్వీర్యం చేసేందుకు అంతర్జాతీయంగా కుట్రలు జరుగుతున్నాయని కొన్ని నివేదికల ద్వారా తెలుస్తుంది అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు . పాఠశాల, కళాశాలలో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు విద్యార్థులను వ్యక్తిగతంగా పరిశీలించాలన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడితే వారి పరిస్థితి చాలా ప్రమాదకరంగా మారుతుంది అన్నారు. ఆ తర్వాత కుటుంబానికి సమాజానికి ఎంతో చేటు కలుగుతుందన్నారు. తరగతి గదిలో విద్యార్థులను పసిగట్టి ఉపాధ్యాయుల దృష్టికి సహవిద్యార్థులు తీసుకురావాలన్నారు. ఇంటి దగ్గర తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వారిని తల్లిదండ్రులు గమనించాలన్నారు. ఈనెల 12వ తేదీన కలాం ఆర్గనైజేషన్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. అనంతరం నూజివీడు నియోజకవర్గ కేంద్రం నూజివీడు పట్టణంలో శ్రీ శారద డిగ్రీ కాలేజ్ వారిని కలిసి, వివరించి ఆహ్వాన పత్రిక అందించి, కళాశాలలో 500 మంది డిగ్రీ విద్యార్థులచే పోస్టర్ లాంచింగ్ 100 మీటర్ల త్రివర్ణ పతాకం ట్రయిల్ కార్యక్రమం చేయడం జరిగింది . ఇంకా పిల్లలకు మాదకద్రవ్యాల వలన జరిగే నష్టాలను వివరిస్తూ, అవగాహన కార్యక్రమంను, నూజివీడు నియోజకవర్గ కోఆర్డినేటర్ కట్టుబోయిన శ్రీనివాసరావు , ఉమ్మడి కృష్ణాజిల్లా నియోజకవర్గ కోఆర్డినేటర్ బట్టపర్తి రాజు జరిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ శారద విద్యాసంస్థల డైరెక్టర్ కుప్పాల శంకర్రావు, పలువురు విద్యార్థిని విద్యార్థులు డ్రగ్స్ నివారణ పై వారి అభిప్రాయాలను తెలియజేసి, ప్రసంగించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా డ్రగ్స్ వాడకం నిలిపేయాలంటూ, అవి యువతరానికి గొడ్డలిపెట్టుగా మారిందని నినాదాలు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ఆరేపల్లి రమేష్, అధ్యాపకులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




# విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యం

తాడేపల్లిగూడెం టౌన్ మార్చి10: (ప్రభాతవార్త ) : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎంఈవో వి.హనుమ సూచించారు. ఐడిబిఐ తాడేపల్లిగూడెం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం మండలంలోని జగ్గన్నపేట మోడల్ ప్రైమరీ పాఠశాలకు సుమారు రూ లక్ష రూపాయల విలువ గల రెండు కంప్యూటర్లు, సౌండ్ సిస్టం, టేబుల్, రెండు రివాల్వింగ్ ఛైర్స్ ను సిఎస్ఆర్ నిధుల నుంచి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు హనుమ, పిఎంకే. జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని నైపుణ్యం కలిగిన విద్యార్థులుగా ఎదగాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే కంప్యూటర్ విద్యపై పాఠశాల స్థాయి నుంచే పట్టు సాధించాలని తెలిపారు. పాఠశాలకు కంప్యూటర్లు బహుకరించిన దాత ఐడిబిఐ తాడేపల్లిగూడెం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ ను, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు కోమటి శ్రీనివాస్ సేవలను కొనియాడారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమటి శ్రీనివాస్, సత్యనారాయణ, నాగేశ్వర రావు, సుజాత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# అమరావతి సచివాలయంలో మార్చి 11,12 తేదీల్లో
# జరుగునున్న జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్

భీమవరం మార్చి 10,ప్రభాతవార్త :మార్చి 11, 12 తేదీలలో అమరావతి సచివాలయం ఐదవ బ్లాక్ నందు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించనున్న కలెక్టర్ల సమావేశానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరుకానున్నారు. రెండు రోజులు పాటు సుదీర్ఘంగా జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో జిల్లాల వారీగా అభివృద్ధి, సంక్షేమం, ప్రజాభిప్రాయం, రెవిన్యూ, రెవిన్యూ ఎర్నింగ్ డిపార్ట్మెంట్స్, స్కిల్ అండ్ ఎంప్లాయిమెంట్, వెల్ఫేర్ ప్రోగ్రామ్స్ అండ్ ఎంపవర్మెంట్, పి జి ఆర్ ఎస్, సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్, భూ పరిపాలన, ఈ ఆఫీస్, పెట్టుబడుల ప్రతిపాదనలు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, స్వర్ణాంధ్ర ఏ 2047 పది సూత్రాలు, లా అండ్ ఆర్డర్ తదితర అంశాలపై విపులంగా సమీక్షించనున్నారు.



## నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి కృషి చేస్తుంది
# కార్పొరేషన్ చైర్మన్ సదాశివం

కైకలూరు,మార్చి,10 (ప్రభాతవార్త): నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం తెలిపారు. మంగళవారం కైకలూరు పట్టణంలోని ట్రావెలర్స్ బంగ్లా నందు నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంక రత్నారావు ఆధ్వర్యంలో సంఘ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సదాశివం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు పరిశీలనపై కైకలూరు రావడం జరిగిందన్నారు. అన్న నందమూరి తారక రామారావు హయాంలో నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కోసం 1989 లో ఫెడరేషన్ స్థాపించటం జరిగిందని, దానిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో ఫెడరేషన్ ని కార్పొరేషన్ గా మార్చారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయినాయని, తల్లికి వందనం పదివేల కోట్లతో 67 లక్షల మంది తల్లుల ఖాతాలో జమ చేసిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 16 వేల 347 టీచర్ పోస్టులను అత్యంత పారదర్శకంగా నిర్వహించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కిందన్నారు. నాయి బ్రాహ్మణ సెలూన్ షాపులకి 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వటం అలాగే రాబోయే రోజుల్లో ఆదరణ పథకాలు గాని, ప్రతి దేవాలయంలో పాలకమండలి సభ్యులుగా ఒకరికి కేటాయించటం ఇది ఒక చారిత్రాత్మకమైన ఘట్టం అన్నారు. చంద్రబాబు హయాంలో ఒక ప్రక్క సంక్షేమ పథకాలు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అవాకులు,చవాకులు పేలితే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలందరూ సంతృప్తి చెందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ సురవరపు నాగరాజు, కైకలూరు నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు కొత్తపల్లి విజయకుమార్, మాటూరి వెంకటేశ్వరరావు, రాలి ప్రభాకర్, అచ్చారావు, శేషు, కే సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# మట్టి మాఫియా బరి తెగింపు



జంగారెడ్డిగూడెం రూరల్ ప్రభాతవార్త మార్చ్ :ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలో మట్టి మాఫియా బరితెగిస్తోంది. అధికారుల అండదండలు ఉన్నాయంటూ మట్టి బకాసురులు యథేచ్ఛగా ప్రకృతి సంపదను దోచేస్తున్నారు. అర్ధరాత్రి వేళ భారీ యంత్రాలతో మట్టిని మాయం చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. మండలంలోని చిన్నవారిగూడెం సమీపంలో గత రాత్రి భారీ ఎత్తున మట్టి తవ్వకాలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి సమయంలో పెద్ద పెద్ద శబ్దాలతో జేసీబీలు, టిప్పర్లతో మట్టిని తరలిస్తుండటంతో స్థానిక రైతులు, గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చి ప్రజలు మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులపై మట్టి మాఫియా లీడర్ గంట్రోతు అయ్యప్ప, శంకర్ రావు వారి అనుచరులతో కలిసి చిందులు తొక్కారు. గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరింపులకు దిగారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులతో కూడా అయ్యప్ప వాగ్వివాదానికి దిగడం గమనార్హం. నాకు పాలకులు, ఉన్నతాధికారుల అనుమతులు ఉన్నాయి.. నన్నెవరూ ఏమీ చేయలేరు అంటూ అయ్యప్ప పోలీసుల ముందే వీరంగం సృష్టించాడు. నిజంగా అనుమతులు ఉంటే.. దొంగచాటుగా అర్ధరాత్రి తవ్వకాలు చేపట్టాల్సిన అవసరం ఏముందని గ్రామస్తులు నిలదీస్తున్నారు. జంగారెడ్డిగూడెం పరిసరాల్లో రోజురోజుకూ హెచ్చుమీరుతున్న ఈ మట్టి మాఫియాపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, చిన్నవారిగూడెం రైతులు డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో అక్రమ మట్టి టిప్పర్లను అడ్డుకున్న ఘటన రావడంతో రెవెన్యూ అధికారులు దిద్దిపాటు చర్యలను చేపట్టారు. తూతూ మంత్రంగా కేవలం ఒక్కొక్క లారీకి 7500 చొప్పున అపరాధ రుసుము విధించి చేతులు దులుపుతున్నారు. కాగా మట్టి తవ్వకానికి వినియోగించిన జెసిబిని మాత్రం ఎలా వదిలేస్తారు అని ప్రజలు గుసగుసలాడుతున్నారు.

# స్వర్ణాంధ్ర కళాశాలలో జాతీయ స్థాయి హ్యాకథాన్

నర్సాపురం రూరల్ ప్రభాతవార్త: నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్థానిక స్వర్ణాంధ్ర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్,మెకానికల్ ఇంజినీరింగ్ మరియు రోబోటిక్స్ విభాగంతో ఏ ఎస్ ఎమ్ ఈ మద్దతుతో మార్చి 17 మరియు 18 తేదీలలో జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు ఈ హ్యాకథాన్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలు మరియు సమస్య పరిష్కార సామర్థ్యాలను ప్రోత్సహించడం. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఇందులో పాల్గొని మెకానికల్ ఇంజినీరింగ్ మరియు రోబోటిక్స్ రంగాలలో కొత్త ఆలోచనలు మరియు ప్రాజెక్టులను అభివృద్ధి చేయుడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది. కార్యక్రమం ద్వారా పాల్గొనేవారు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శించే అవకాశం పొందడమే కాకుండా, పరిశ్రమలకు ఉపయోగపడే నూతన పరిష్కారాలను అభివృద్ధి చేసే అవకాశం కూడా పొందుతారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ జాతీయ స్థాయి హ్యాకథాన్లో పాల్గొని తమ ప్రతిభను చూపాలని చైర్మన్ కోరారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమనికి సంబంధించిన పోస్టర్ ను కళాశాల చైర్మన్ కె. వి. సత్యనారాయణ, ట్రెజరర్ కె. వేంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డా. ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎ. గోపిచంద్ ఏఐ అండ్ ఎమ్ ఎల్ విభాగాధిపతి మరియు కార్యక్రమ నిర్వాహకులు డా. బొమ్మ రామ కృష్ణ మరియు డా. ఫ్రాన్సిస్ లూథెర్ కింగ్ ఎమ్, అధ్యాపక సమన్వయకర్తలు డా. రావి లలిత నారాయణ, డా. జి. సుధాకర్, డా. పి. ఎస్.ఎన్.రాజు, ఆర్. వి. మణికంఠ మరియు విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.



# ఆత్మస్థైర్యంతో పరీక్షలు ఎదుర్కోవాలి

## 1668 విద్యార్థులకు పరీక్షా సామాగ్రి అందజేసిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, మార్చి 10 ( ప్రభాత వార్త) :రాబోయే పదో తరగతి పరీక్షలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనేలా విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువు కొనసాగించాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోయే 1668 విద్యార్థులకు ప్యాడ్లు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ ధైర్యంగా పరీక్షలు రాసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయడానికి అండగా మేమంతా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. విద్యార్థి దశలో పదో తరగతి కీలక మలుపు అని చెప్పారు. భవిష్యత్తులో డిగ్రీ, పీజీ చదితేనే ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. సాంకేతికను అందిపుచ్చుకుని అందుకు అనుగుణంగా పోటీ తత్వం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఏకీకృత కుటుంబ నమోదును నూరు శాతం పూర్తి పూర్తిచేయాలి
## -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం మర్చి 10 ప్రభాతవార్త :జిల్లాలో ఇంకను పెండింగ్ లో ఉన్న ఏకీకృత కుటుంబాల నమోదు కార్యక్రమమును వేగవంతం చేసి పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి మంగళవారం జిల్లాలోని అందరూ ఎంపీడీవోలు, ఎంఎస్ఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ లో ఉన్న 27,865 ఏకీకృత కుటుంబాల నమోదును వేగవంతంగా పూర్తి చేయాలని స్వర్ణ గ్రామ సిబ్బంది మరియు సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా ఏకీకృత కుటుంబాల నమోదు సమగ్రంగా నిర్వహించడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రస్తుతం ఇంకా పెండింగ్లో ఉన్న ఏకీకృత కుటుంబాల వివరాలను త్వరితగతిన పరిశీలించి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా స్వర్ణ గ్రామ మరియు స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి తదితరులు ఉన్నారు.

## గుర్రాజు కుంట నుంచి చార్లెస్ నగర్ వరకు తారు రోడ్డు నిర్మించాలి

టీ నర్సాపురం మార్చి 10 ప్రభాతవార్త : చింతలపూడి టీ నర్సాపురం రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి ప్రయాణికుల సమస్యలు తీర్చినందుకు టీ నర్సాపురం మేము సైతం మిత్ర బృందం చింతలపూడి ఎమ్మెల్యే కుకృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇంకా నిర్మించాల్సిన కిలోమీటర్ రోడ్డు కూడా డబల్ రోడ్డు గా అభివృద్ధి చేయాలని కోరుతూ టీ నర్సాపురం మండలానికి చెందిన మేము సైతం మిత్ర బృందం సభ్యులు మంగళవారం నాడు చింతలపూడి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఇతర సమస్యలతో కూడిన ఒక వినతి పత్రం కూడా అందజేశారు . ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త యస్ డి నా సర్ పాషా మాట్లాడుతూ అధ్వానంగా తయారైన చింతలపూడి టీ నర్సాపురం రోడ్డు నిర్మాణ పనులు గుర్రాజు కుంట వరకు పూర్తి చేపించినందుకు టి నర్సాపురం మండల ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో గుండె సంబంధిత వైద్యం కూడా అందుబాటులోకి తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే అసంపూర్తిగా నిలిచిపోయిన గుర్రాజు కుంట నుండి చింతలపూడి చార్లెస్ నగర్ వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలని డబల్ రోడ్డు గా అభివృద్ధి చేయాలని కోరారు. 2027 మేలో గోదావరి పుష్కరాల నేపథ్యంలో చింతలపూడి నుండి రావికంపాడు అడ్డ రోడ్డు వరకు మిగిలి ఉన్న సింగిల్ రోడ్డు డబల్ రోడ్డు గా అభివృద్ధి చేయడానికి తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొంత ప్రభావం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో గుర్రాజు కుంట వద్ద చెత్త డంపింగ్ పూర్తిస్థాయిలో నిలిపి వేసే విధంగా కూడా చర్యలు చేపట్టాలని,చింతల జాలు వద్ద ప్రమాదభరితంగా ఉన్న చెట్టుకొమ్మ తొలగించాలనీ, పలుచోట్ల అడ్డంకి గా తయారైన విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చాలనీ ఆ



వినతి పత్రంలో ఎమ్మెల్యే ను కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే గారు సానుకూలంగా స్పందించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేము సైతం మిత్ర బృందం సభ్యులు కొరివి శేషారావు, పింగుల మధు, కొరివి నాగేశ్వరరావు, పొదిల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే వర్ధంతి

అత్తిలి / పెంటపాడు, మార్చి 10 ( ప్రభాత వార్త )రావిపాడు మోడల్ ప్రైమరీ స్కూల్ లో సావిత్రిబాయి పూలే 130వ వర్ధంతి సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే కాశీ విశ్వనాథం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్త్రీల విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషిచేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. ఎస్ ఎంసీ చైర్మన్ కే డి ఎన్ రాజేశ్వరి మాట్లాడుతూ భారతదేశంలో మహిళల విద్యకు పునాదివేసిన మహనీయురాలు, సామాజిక సంస్కర్త సావిత్రి భాయి పూలే అని అన్నారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినులకు బహుమతి అందజేశారు. ఉ



పాధ్యాయులు డి జ్యోతి, కే నాగ సౌజన్య, వి.వి.వి. పరదేశి, ఎస్ఏ మంగతాయారులు మాట్లాడారు.

## హెచ్ .పి.వి.వ్యాక్సిన్ ప్రతి ఆడపిల్ల వేయించుకోవాలి: ఆరేటి తాత పండు

కాళ్ళ మార్చి 10( ప్రభాతవార్త) : స్త్రీలకు వచ్చే గర్భాశయ క్యాన్సర్ ను రాకుండా కాపాడుటకు ప్రతి ఆడపిల్ల ఈ వ్యాక్సిన్ ను వేయించుకో వాలని మండల పార్టీ అధ్యక్షులు ఆరేటి వెంకటరత్న ప్రసాద్ (తాతా పండు) అన్నారు. మండల కేంద్రమైన కాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హ్యూమన్ పాపలోమా వైరస్ (హెచ్ పి వి వ్యాక్సిన్ )ను మండల పార్టీ అధ్యక్షులు ఆరేటి వెంకటరత్న ప్రసాద్ (తాతాపండు) ప్రారంభించినారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. వైద్యాధికారి డాక్టర్ సి.హెచ్.వి.రంగం నాయుడు మాట్లాడుతూ 14 సంవత్సరాలు



పూర్తి అయ్యి 15 సంవత్సరాలు లోపు ఆడపిల్లలందరికీ ఈ వ్యాక్సిన్ ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేస్తారని దీనివలన ఎటువంటి దుష్పరిమణాలు ఎదురుపడవని చిన్నపిల్లలప్పుడు ఈ వ్యాక్సిన్ వేయించుకోవడం వలన పెద్దవారైనా తరువాత గర్భాసయ క్యాన్సర్ రాకుండా నిరోధించవచ్చున్నారు. డాక్టర్ సరాబు సునీల్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలల కాలంలో 14 సంవత్సరాలు పూర్తి అయ్యి 15 సంవత్సరాలు పూర్తికాని ప్రతి ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్ ఉచితంగా అందిస్తారని మండలంలో 567 మందిని గుర్తించామన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు పరీక్షలు

అత్తిలి/ గణపవరం, మార్చి 10 (ప్రభాతవార్త) గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి డాక్టర్ .కే . ఓంకార్ నాథ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం క్రింద గర్భిణీ స్త్రీలను పరీక్షించి మందులు అందజేశారు.ప్రతి గర్భిణీ తప్పని సరిగా 4 సార్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నందు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మంచి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని అన్నారు. ఐరన్ మాత్రలు, కాల్షియం బిళ్లలు వాడలని, సాధారణ ప్రసవం ఆరోగ్య కేంద్రం లో పోసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్. జె విల్సన్



బాబు మాట్లాడుతూ ప్రతిగర్భిణీ కి, యూరిన్ ,రక్త పరీక్షలు ఉచితముగా చేస్తున్నట్లు తెలిపారు.వైద్య సిబ్బంది సీవీ సత్యవతి, సి . పద్మజ,ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్య కర్తలు పాల్గొన్నారు.

## భూదేవిపేటలో నూతన ఆలయ నిర్మాణం

వేలేరుపాడు,మార్చి 10 ( ప్రభాత వార్త ): వేలేరుపాడు మండలంలోని భూదేవిపేట గ్రామంలో శ్రీ అపర్ణాంబ సమేత శ్రీ గౌతమేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆలయ ధర్మకర్తలు తుమ్మూరి నాగమణి, మణికంఠ, కర్ణాటకకు చెందిన పండితులు సాయిరాం, ,మనోహర్ శర్మ, రుద్రంకోట గ్రామానికి చెందిన భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా ఆలయ శంకుస్థాపన కార్యక్రమాలు హోమాలు అభిషేకాలు సోమ మంగళ వరాలలొ నిర్వహించారు. ఆలయానికి కావాల్సిన కోనేరు ఆలయ నిర్మాణంకు సోడే వెంకయ్య సీతా దంపతులు ఒక ఎకరం పొలం ఆలయానికి ఇవ్వగా గర్భాలయ నిర్మాణా నిమిత్తం కామినేని వెంకటేశ్వరరావు లక్ష పదహారు రూపాయలు అందించారని ఆలయ కమిటీ తెలియజేశారు. అన్న సమారాధన కార్యక్రమానికి అలాగే పునాదికి 10వేలు పసుపులేటి లక్ష్మయ్య రమాదేవి దంపతులు సహాయం అందించారన్నారు.హోమం పూజా ఖర్చులు మేడవరపు నాగేశ్వరరావు 10 వేల రూపాయలు పునాది



నిమిత్తం సోడే లక్ష్మణ్ 5000, ముత్యాల సత్యనారాయణ 5116, వాళ్ల లక్ష్మీదేవి రెడ్డి 5116 తదితరులు సహాయ సహకారాలు అందించారని తెలియజేశారు.

## కొనైకోడు అక్రమాలకు గురి



మొగల్తూరు మార్చి 10 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా 216 నేషనల్ హైవే ను ఆనుకుని మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధిలో స్టార్ హోటల్ ఎదురుగా ఉన్న బెల్లం టీ సెంటర్ వెనుకాల కొనైకోడు తవ్వి దెబ్బ వేసి అక్రమ నిర్మాణం నిర్మిస్తున్నారు మంగళవారం దీనిపై స్థానికులు పంచాయితీ అధికారులకు ఫిర్యాదు చేయగా పంచాయతీ కార్యదర్శి బి పరమానందరావు వెంటనే స్పందించి తమ కార్యాలయ సిబ్బందిని పంపించగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న వ్యక్తి నాకు ఒక ప్రజా ప్రతినిధి ఉన్నాడు ఆయనతో మాట్లాడుతాను లేకపోతే ఈసమీపంలో ఉన్న అక్రమ కట్టడాలు తొలగించి తే నేను తీసి వేస్తానని పంచాయతీ సిబ్బందికి బదులిచ్చాడు దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు

## బల్లిపాడు లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు పంపిణీ

అత్తిలి, మార్చి 10 (ప్రభాత వార్త ) అత్తిలి మండలం బల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు గ్రామ టిడిపి నాయకులు పంపిణీ చేశారు. అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యారావు మాట్లాడుతూ తణుకు శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ మండలం లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అందరికీ పరీక్ష ప్యాడ్లు,పెన్నులు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మండలానికి గుర్తింపు తేవాలని కోరారు. గ్రామ టిడిపి నాయకులు గారపాటి ధర్మయ్య, ఎంపీటీసీ ప్రగడ



నాగేశ్వరరావు మండల టిడిపి అధ్యక్షుడు పోలిశెట్టి చందు,ఆనాల ఆదినారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

## క్రాంతి జ్యోతి , సావిత్రిబాయి పూలే 129 వ వర్ధంతి

చింతలపూడి.. ప్రభాత వార్త : భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయిని , క్రాంతి జ్యోతి , సావిత్రిబాయి పూలే 129 వ వర్ధంతి ని స్థానిక చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించటం జరిగింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. వారు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి వారి సేవలను కొనియాడారు. డాక్టర్ ఏ వెంకటేశ్వరరావు , కెమిస్ట్రీ లెక్చరర్ మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ – సావిత్రిబాయి లాంటి వ్యక్తుల ఆవశ్యకత ఈ రోజున చాలా ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమ ముఖ్య నిర్వాహకుడు మరియు ఇంగ్లీష్ లెక్చరర్ అయిన బి శ్రీనివాసరావు మాట్లాడుతూ గొప్ప వారి జీవితాలలో వ్యక్తిగత విషయాలంటూ ఉండవని వారి జీవితవే సామాజికపరమవుతుందని గుర్తు చేశారు . ఈ విషయాన్ని



సావిత్రిబాయి తన భర్త అయిన మహాత్మా జ్యోతిబాపూలే కు రాసిన ఉత్తరాలను చదివితే మనకు చాలా స్పష్టంగా అర్థం అవుతుంది అని వివరించారు. వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరైనారు.

## ఉచిత హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమం

అత్తిలి,మార్చి 10 (ప్రభాతవార్త )అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలికలకు ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకాను కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు వైద్యధికారి డాక్టర్ కే. నాగరాజు తెలిపారు. క్యాన్సర్ నివారణలో ఇది కీలకమైన చర్యగా నిలుస్తుందని అన్నారు.9 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలకు రెండు డోసులు, 15 సంవత్సరాల పైబడిన వారికి మూడు డోసులుగా ఈ వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల వచ్చే సర్వికల్ క్యాన్సర్, ఆనల్ క్యాన్సర్, ఒరోఫారింజియల్ క్యాన్సర్, పెనైల్ క్యాన్సర్, వైజైనల్ క్యాన్సర్, వల్వర్ క్యాన్సర్ వంటి మొత్తం ఆరు రకాల క్యాన్సర్లను నివారించడంలో ఈ టీకా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ



కార్యక్రమంలో మండల టిడిపి మాజీ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ రావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు కొరిపల్లి ప్రసాద్, మండల కార్యదర్శి ఆల్తి అజయ్, దాసం బాబ్జి, కొత్తపల్లి శేషగిరిరావు, కోరిపల్లి హరి, కూటమి నాయకులు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యానికి పెద్దపీట
### హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, మార్చి 10 ( ప్రభాత వార్త) :మహిళల ఆరోగ్యానికి సంబంధించి ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా వైద్య సదుపాయం కల్పించిన ఏకైక ప్రభుత్వం నరేంద్రమోదీ ప్రభుత్వం అని తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ అన్నారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాధాకృష్ణ ప్రారంభంచి మాట్లాడారు. గర్భాశయ ముఖద్వారానికి వచ్చే క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ముందస్తు టీకా వంటిదని అన్నారు. దేశంలో ఏటా గర్భాశయ ముఖద్వారానికి వచ్చే క్యాన్సర్ కారణంగా లక్షలాది మంది చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాక్సిన్ ఖరీదైంది కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యల్లో భాగంతో దేశ ప్రధాని నరేంద్రమోదీ సదుద్దేశంతో ఈ కార్యక్రమం తలపెట్టారని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రతిఏటా కోటి మంది 14 ఏళ్లు నిండిన బాలికలకు వ్యాక్సినేషన్ అందిచడానికి చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో 3.50 లక్షల మందికి వ్యాక్సినేషన్ వేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రతి మహిళ



ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో వారి ఆరోగ్య సంరక్షణకు నిధులు కేటాయిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు సహకరించి అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు



మొగల్తూరు మార్చి 10 (ప్రభాతవార్త ) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కేపీ పాలెం రైతు సేవ కేంద్రం నందు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం గ్రామ సర్పంచ్ కడలి సోంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో సైంటిస్ట్ విష్ణుమూర్తి మాట్లాడుతూ ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ ఫామ్ సాగు రైతులకు స్థిరమైన మరియు దీర్ఘకాలిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వము ప్రోత్సాహకాలు మొక్కలు పంపిణీ డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) పై లభించే సబ్సిడీలు మరియు అంతర్ పంటల సాగు ద్వారా వచ్చే అదనపు లాభాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. హార్టికల్చర్ అధికారి మౌనిక మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటల నుండి రామదాయకమైన ఆయిల్ పామ్ సాగు వైపు మాట్లాడడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు కాట్రగడ్డ మౌనిక, ఆయిల్ పంప్ కంపెనీ డి.జి ఎం సూర్యారావు, కేపీ పాలెం నార్త్ గ్రామం ఉప సర్పంచ్ బెల్లప్ప కొండ వెంకట సూర్యనారాయణ (నాని), బొక్క పెద్దిరాజు, బొక్క ఏడుకొండలు, పరస సత్యనారాయణ, బెల్లంకొండ వెంకట శేషగిరి మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## అంతర్గత రహదారులకు 30 లక్షల మంజూరు

చాట్రాయి, మార్చి 10, ప్రభాతవార్త : చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామంలో అద్వానంగా ఉన్న అంతర్గత రహదారులు సిమెంట్ రోడ్లుగా మార్చేందుకు 30 లక్షలు నిధులు మంత్రి పార్థసారథి మంజూరు చేయించినట్లు ఆ గ్రామ మాజీ సర్పంచ్ కొత్తపల్లి రామదాసు అన్నారు. సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు అద్వానంగా ఉన్నాయనే పరిస్థితిని మంత్రి పార్థసారథికి విన్నవించగా తక్షణమే స్పందించారని ఆయన తెలిపారు. చిత్తూరు గ్రామ అభివృద్ధి పై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది అని మరిన్ని నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తుమ్మగూడెం సహకార సంఘ అధ్యక్షులు దామెర చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



## కవిటం శ్రీ సోమేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

పోడూరు, మార్చి 10,ప్రభాత వార్త : మండలం కవిటం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ సోమేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పి.ఏ మోహన్ కూడా ఆయనతో కలిసి ఆలయ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఆలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, భక్తులకు సౌకర్యాలు కల్పించేలా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత వారికి సూచించారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ అభివృద్ధి మరింత మెరుగుపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో సతీష్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు ఊడిగ శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షుడు రమేష్ రాజు,



గ్రామ టిడిపి అధ్యక్షుడు గుబ్బల అప్పలస్వామి, గ్రామ బీజేపీ అధ్యక్షుడు మేడపాటి ప్రసాద్ రెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 4,5 వార్డులోని కూడళ్ళకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు పెట్టాలి

భీమవరం మర్చి 10 ప్రభాతవార్త : భీమవరం నరసయ్య అగ్రహారంలోని 4,5 వార్డులోని పలు కూడలిలకు స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను పెట్టాలని ఆ ప్రాంత వాసులు మున్సిపల్ మేనేజర్ కు వినతిపత్రాన్ని అందించారు. కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, క్విట్ ఇండియా స్తూప కమిటి సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల చరిత్రలు భావితరాలకు తెలియజేసేలా వారి పేర్లను ప్రధాన కూడలి లకు పెట్టాలని కోరారు. 4,5 వార్డు సెంటర్ కు స్వాతంత్ర్య సమరయోధులు భూపతిరాజు బాపిరాజు మార్గ్ అని నామకరణం చేయాలని కోరారు. గతంలో కూడా ప్రజా ప్రతినిధులకు అధికారులకు వినతిపత్రాలను అందించామని, దీనిని పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యలమంచిలి శ్రీనివాస్, విన్నకోట వినాయక్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

వేలేరుపాడు, మార్చి 10 ( ప్రభాత వార్త ) : వేలేరుపాడు మండలంలోని సుద్ధగుంపు మరియు గుల్లవాయి గ్రామాలకు చెందిన బాధితులు ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఆరోగ్య ఖర్చుల నిమిత్తం గతంలో దరఖాస్తూ చేసుకున్నారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు గణేషుల ఆదినారాయణ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను భాధితులకు మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ మండలంలోని సుద్ధగుంపు గ్రామానికి చెందిన పురేం దుర్గ అనే మహిళకు 50701 రూపాయలు, గుల్లవాయి గ్రామానికి చెందిన అంగిరేకుల దుర్గమ్మకు 25655 రుపాయలు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సహకారంతో భాధితులకు చెక్కులు పంపిణీ చేశామన్నారు.కూటమి ప్రభుత్వం పేదల కొరకు పని చేస్తుందని



అన్నారు. భాధితులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ముఖ్యమంత్రి సహాయానిది చెక్కులు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గణేషుల ఆదినారాయణతోపాటు జనసేన నాయకులు షాను, ముత్యాలరావు, శ్రీదేవి, సోషల్ మీడియా ఇన్చార్జి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గణపవరంలో ఆశాడే

అత్తిలి /గణపవరం మార్చి 10( ప్రభాత వార్త) గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశ డే సందర్భంగా ఆశ నోడల్ అధికారి సి హెచ్ వి సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించారు.వైద్యాధికారి డాక్టర్ కే . ఓంకార్ నాథ్ పాల్గొని ఆశా కార్యకర్తలకు కుటుంబ నియంత్రణ శాశ్వత, తాత్కాలిక పద్ధతులపై అవగాహన కల్పించారు. వేసవి కాలం లో ప్రతి ఆశ కార్యకర్త వద్ద ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్ కనీసం 20 ఉండాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె . విల్సన్ బాబు హెచ్ వి పద్మజ, కార్యకర్తలు పాల్గొన్నారు.

